ప్రభాత

వెలుగు

17.01.2019
www.v6velugu.com

గురువారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 331 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



ఈ సంచికతోపాటు 12 పేజీల
లైఫ్ సప్లిమెంట్ అందుకోండి

బుధవారం లోటస్‌పాండ్‌లోని తన నివాసంలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమావేశమైన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్



"దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు రావాలని కేసీఆర్ పోరాడుతున్నారు. ఇందులో భాగంగా ఆయన చాలా మంది నేతలను కలిశారు. మేము కూడా అందుకే జగన్‌ను కలిశాం. భావసారూప్యత ఉన్న శక్తులు, ప్రాంతీయ పార్టీలు మాతో కలిసి వస్తాయనే నమ్మకం ఉంది. జగన్‌తో చాలా విషయాలు చర్చించాం. ఇప్పుడు జరిగింది మొదటి సమావేశమే. త్వరలో కేసీఆర్ ఏపీకి వెళ్లి జగన్‌తో మాట్లాడతారు.

–కేటీఆర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

"రాష్ట్రాల హక్కులు నిలబడాలంటే ఎంపీల నంబర్ పెరగాలి. అప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అన్యాయం చేయాలంటే వెనకడుగు వేస్తుంది. అందుకే కేసీఆర్ ప్రతిపాదించిన మోడల్‌ను స్వాగతిస్తున్నాను. కేసీఆర్ నాతో ఫోన్లో మాట్లాడారు. మునుముందు కూడా ఆయనే వచ్చి చర్చలు జరుపుతానన్నారు. కేటీఆర్ అన్ని విషయాలను చెప్పారు. దీనిపై పార్టీలో సుదీర్ఘంగా డిస్కస్ చేసి ఎలా ముందుకు పోవాలో చూస్తాం.

– వైఎస్ జగన్, వైఎస్సార్సీపీ చీఫ్

ఫ్రంట్‌కు పోదాం

వైఎస్ జగన్‌కు కేటీఆర్ ఆహ్వానం

ఢిల్లీ నుంచి కాంగ్రెస్‌ను, బీజేపీని బేదఖల్ చేసేటందుకు లోకల్ పార్టీలతో ఫ్రంట్‌గడుతున్న టీఆర్ఎస్ జోరు పెంచింది. ఫ్రంట్‌ల షరీక్ గమ్మని ఏపీ అప్పొజిషన్ లీడర్ జగన్‌ను కేటీఆర్ ఖుద్ బుధవారం నాడు పోయి అడిగిండు. జగన్ పార్టీ ఈ ఫ్రంట్‌ల జాయినైతె తెలుగు రాష్ట్రాల పాలిటిక్స్ కొత్త టర్న్ తీసుకుంటయి.

- జగన్ ఇంట్లో గంటన్నరపాటు సమావేశం
- సాదర స్వాగతం పలికిన వైఎస్సార్‌సీపీ చీఫ్
- మంగళవారం జగన్‌కు సీఎం కేసీఆర్ ఫోన్
- ఫ్రంట్ గురించి మాట్లాడుదామని ప్రతిపాదన
- కేసీఆర్ ఏపీకి వెళ్లి జగన్‌తో మరింత చర్చిస్తారు
- హోదాపై మా వైఖరిని ఇప్పటికే ప్రకటించాం: కేటీఆర్
- కేసీఆర్ ప్రయత్నాన్ని స్వాగతిస్తున్నాం
- ఎంపీల బలం పెరిగితే రాష్ట్రాలకు లాభం : జగన్

02



పాలిటికల్

సీఎల్పీ నేత ఎన్నిక నేడే

అసెంబ్లీ సమావేశాలకు ముందే సీఎల్పీ నేతపై నిర్ణయం.. రేసులో ఉత్తమ్ తదితరులు.

03



దేశం - విదేశం

బ్రెగ్జిట్‌కు నో

చరిత్రాత్మక బ్రెగ్జిట్ బిల్లుకు బ్రిటన్ పార్లమెంట్‌లో నో అన్న ఎంపీలు. థెరెసా మే సర్కారుపై అవిశ్వాసం?.

05



దేశం – విదేశం

కర్ణాటకలో టెన్షన్

కర్ణాటక రాజకీయాల్లో కొనసాగుతున్న ఉత్కంఠ.. అసంతృప్త ఎమ్మెల్యేలను బుజ్జగించేందుకు శుక్రవారం సీఎల్పీ భేటీ.

05



జనరల్

వరల్డ్ బ్యాంక్ చీఫ్‌గా ఇంద్రానూయి?


పెప్సికో మాజీ సీఈవో ఇంద్రా నూయి వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంట్ అయ్యే చాన్స్ కనిపిస్తోంది.

02

కేంద్ర మంత్రి జైట్లీకి తీవ్ర అనారోగ్యం

- ట్రీట్‌మెంట్ కోసం అమెరికాకు.. అక్కడే ఆపరేషన్
- బడ్జెట్ ఎవరు ప్రవేశపెడతారన్న దానిపై సస్పెన్స్
- అమిత్‌షాకు స్వైన్‌ఫ్లూ.. ఎయిమ్స్‌లో చికిత్స

03



బాబోయ్.. చిరుత

- రాష్ట్రంలో పెరుగుతున్న చిరుతల బెడద
- మహబూబ్‌నగర్, కరీంనగర్, మెదక్‌జిల్లాల్లో హల్‌చల్
- లేగదూడలపై పంజా.. భయాందోళనలో జనం

04

విద్యా సంస్థల్లో 25% సీట్ల పెంపు

- ఈడబ్ల్యూఎస్ కోటా అమలు కోసమే
- ఈ ఏడాది నుంచే రిజర్వేషన్లు
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఇబ్బంది లేదు
- కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్

02

వెన్‌కాబ్
(ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
87.00	87.00	87.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
88.00	87.00	86.00

నేటి నుంచే అసెంబ్లీ



స్వీటు తిను భాయ్..
బుధవారం రాజ్‌భవన్‌లో ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఎంఐఎం ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌కు స్వీటు తినిపిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో గవర్నర్ నరసింహన్ తదితరులు

03

- ఉదయం 11.30కు సభ షురూ
- మొదట ప్రమాణం చేయనున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- సభ్యుల ప్రమాణం తర్వాత వాయిదా
- రేపు స్పీకర్ ఎన్నిక
- ఎల్లుండి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం
- 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు.. తర్వాత వాయిదా
- స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుందాం
- సహకరించాలని ప్రతిపక్ష పార్టీల చీఫ్‌లకు సీఎం కేసీఆర్ ఫోన్

05



పులకించిన త్రివేణి

సంక్రాంతి నాడు షాహీ స్నాన్‌తో మొదలైన కుంభమేళా

- తొలి రోజు రికార్డు స్థాయిలో 2.25 కోట్ల మంది పుణ్యస్నానాలు
- హెలికాప్టర్‌తో రెండు గంటలపాటు పూల వర్షం
- మార్చి 4 వరకు కొనసాగనున్న ఆధ్యాత్మిక పండుగ
- 15 కోట్ల మందికిపైగా హాజరవుతారని అంచనా



03

ముగ్గురు ఎమ్మెల్సీలపై వేటు

భూపతిరెడ్డి, యాదవరెడ్డి, రాములునాయక్‌ను అనర్హులుగా ప్రకటించిన మండలి చైర్మన్

పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్సీలపై శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ వేటు వేశారు. గవర్నర్ కోటాలో నామినేటైన ఎస్.రాములు నాయక్, ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన కె.యాదవరెడ్డి, నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఆర్.భూపతిరెడ్డిలను టీఆర్ఎస్ ఫిర్యాదు మేరకు అనర్హులుగా ప్రకటించారు. ఈ మేరకు వేర్వేరు బులెటిన్లు విడుదలయ్యాయి. దీనిపై న్యాయపోరాటం చేస్తామని వేటుపడిన ఎమ్మెల్సీలు చెప్పారు.



మంటల మధ్య ఆవులతో..

ఈ ఆవు మంటల మధ్య చిక్కుకోలేదు. మంట వేసి ఆవును అందులో నుంచి పరిగెత్తించారు. కర్నాటకలోని బెంగళూరు, మైసూరు శివార్లలో సంక్రాంతి రోజున జరిగిన తతంగమిది. ఆవులను అందంగా అలంకరించి ఇలా మంటల్లో నుంచి పరిగెత్తించే ఆచారం కర్నాటకలో ఎప్పటి నుంచో ఉంది. మంటలను చూసి ఆవులు ఎంత బెదిరిపోయినా బలవంతంగా వాటిని నడిపించారు. ఇలా చేస్తే పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయని ఆక్కడి రైతుల నమ్మకం.



బ్రహ్మానందానికి హార్ట్ సర్జరీ

హైదరాబాద్, వెలుగు: ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం అస్వస్థతకు గురయ్యారు. గుండె సంబంధిత సమస్యలు తలెత్తడంతో ముంబైలోని ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆయనకు హార్ట్ సర్జరీ జరిగింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, డాక్టర్ల అబ్జర్వేషన్లో ఉన్నారని కుటుంబ సభ్యులు చెప్పారు. వెయ్యికి పైగా చిత్రాలతో తమ పెదవులపై నవ్వులు పూయించిన బ్రహ్మానందం త్వరగా కోలుకోవాలంటూ ఆయన అభిమానులు ప్రార్థనలు చేస్తున్నారు.



వరల్డ్ బ్యాంక్ చీఫ్‌గా ఇంద్రానూయి?

ప్రతిపాదిస్తున్న ఇవాంకా ట్రంప్

వాషింగ్టన్: పెప్సికో మాజీ సీఈవో, భారత సంతతి మహిళ ఇంద్రా నూయి వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంట్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆమె పేరును వైట్‌హౌస్ పరిశీలిస్తున్నట్లు న్యూయార్క్ టైమ్స్ పత్రిక వెల్లడించింది. ఇందుకు ఆమె అంగీకరిస్తారో లేదో క్లారిటీ లేదని పేర్కొంది. ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు జిమ్‌యాంగ్ కిమ్ మరో మూడేళ్ల సర్వీసు ఉంగానే తప్పుకుంటున్నారు. ఆయన స్థానంలో అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా, యూఎన్‌లో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీతో పాటు బ్యాంకు ట్రెజరీ సెక్రెటరీ స్టీవెన్‌మునిచ్, వైట్‌హౌస్ తాత్కాలిక చీఫ్ ఆఫ్ స్టాఫ్ మిక్ ముల్వెనీ, ట్రంప్‌కు అధ్యక్ష ఎన్నికల ప్రచార సలహాదారుగా వ్యవహరించిన మరో ఇద్దరి పేర్లు కూడా వినబడ్డాయి. ఇప్పుడు ఇవాంకా స్వయంగా నూయి పేరు ప్రతిపాదించారని, వైట్‌హౌస్ కూడా సానుకూలంగా స్పందించిందని చెప్తున్నారు. ప్రపంచబ్యాంకులో అమెరికా అతిపెద్ద వ్యాపార భాగస్వామి కావడంతో ఆ దేశం ప్రతిపాదించిన వారు చీఫ్ అవడం లాంఛనమే.

31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

ఫిబ్రవరి 1న వార్షిక బడ్జెట్

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈనెల 31న ప్రారంభం కానున్నాయి. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 31న రాష్ట్రపతి ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి ఒకటిన కేంద్రం వార్షిక బడ్జెట్ ను సమర్పిస్తుంది. ఫిబ్రవరి తొమ్మిది వరకు తొలి విడత సమావేశాలు జరుగుతాయి. తర్వాత సమావేశాలకు కొన్నిరోజులు విరామం ఇస్తారు. ఆ తర్వాత రెండో విడత సమావేశాలు జరుగుతాయి. ఫిబ్రవరి 13తో సమావేశాలు ముగుస్తాయి.

రాష్ట్రంలో మూడ్రోజులు పొడి వాతావరణం

హైదరాబాద్, వెలుగు: రానున్న మూడ్రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం పొగమంచు కురుస్తుందని తెలిపింది. చలిగాలులు వీస్తుండడంతో ఆదిలాబాద్, భద్రాచలం, హకీంపేట, హన్మకొండ, హైదరాబాద్, నిజామాబాద్, రామగుండం ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. బుధవారం ఆదిలాబాద్‌లో 10డిగ్రీలు, రామగుండం, మెదక్‌లో 12.6, హన్మకొండ14.5, హకీంపేట15.1, హైదరాబాద్15.2, నిజామాబాద్15.6, ఖమ్మంలో 16 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ముగ్గురు మోడీలు ఒక్కటయ్యారు

జగన్, కేటీఆర్ భేటీపై లోకేశ్ విమర్శ

అమరావతి, వెలుగు:

వైఎస్సార్ సీపీ చీఫ్ జగన్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీపై ఏపీ మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. ముగ్గురు మోడీలు ఒక్కటయ్యారని ట్విటర్‌లో విమర్శించారు. 'ఢిల్లీ మోడీ, ఆంధ్రా మోడీ, తెలంగాణ మోడీ ఒక్కటయ్యారు. ఇంతకాలం వీరి మధ్య ఉన్న చీకటి ఒప్పందం ఇప్పుడు బహిర్గతమైంది. విభజన చట్టం ప్రకారం ఏపీకి రావాల్సిన వాటా దక్కకుండా అడ్డుపడుతున్న కేసీఆర్‌తో కలిసి జగన్ ఆంధ్రా ద్రోహుల ఫ్రంట్ ఏర్పాటు చేశారు' అని ఆయన ఆరోపించారు. 'లంకలో పుట్టినవాళ్లంతా రాక్షసులు.. ఆంధ్రాలో పుట్టినవాళ్లంతా వారి వారసులని కేసీఆర్ ఆంధ్రులను అవమానించారు. అలాంటి కేసీఆర్‌తో జగన్ మోడీ రెడ్డి జతకట్టారు' అని విమర్శించారు. పోలవరంపై కేసులు వేసిన వారితో ఏవిధంగా పొత్తు పెట్టుకోవాలని చూస్తారని జగన్‌ను ఏపీ మంత్రి దేవినేని ఉమ ప్రశ్నించారు. కేసీఆర్ ఏర్పాటు చేసేది ఫెడరల్ ఫ్రంట్ కాదని, మోడీ చేతిలో కీలుబొమ్మల ఫ్రంట్ అని ఏపీ మంత్రి యనమల రామకృష్ణుడు దుయ్యబట్టారు. మోడీ డైరెక్షన్‌లోనే కేటీఆర్, జగన్ భేటీ జరిగిందని ఆయన ఆరోపించారు.



- అది మోడీ చేతిలో కీలుబొమ్మల ఫ్రంట్: యనమల
- చంద్రబాబుది నీచ మనస్తత్వం: అంబటి రాంబాబు

ఫెడరల్ ఫ్రంట్‌పైనే చర్చ: అంబటి

జగన్‌తో కేటీఆర్ కేవలం ఫెడరల్ ఫ్రంట్ గురించే చర్చించారని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ నేతలు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. చంద్రబాబుది నీచమైన మనస్తత్వమని దుయ్యబట్టారు. ఫెడరల్ ఫ్రంట్ కోసం దేశవ్యాప్తంగా అందరు నేతలతో చర్చిస్తున్నట్లుగానే జగన్‌తోనూ చర్చించారని, దీనిపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. టీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని, ఏపీలో 175 సీట్లకు ధైర్యంగా పోటీ చేసే దమ్ము.. ధైర్యం వైఎస్సార్ సీపీకి ఉందని చెప్పారు. ప్రత్యేక హోదాపై చంద్రబాబు పూటకో మాట మాట్లాడుతున్నారని, తమ నేత జగన్ మాత్రం ఈ విషయంలో నిబద్ధతతో ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు.

ముసుగులు తొలిగాయి

జగన్, కేటీఆర్ భేటీపై ఎల్. రమణ

హైదరాబాద్, వెలుగు: టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ భేటీతో ముసుగులన్నీ తొలిగిపోయాయని టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ బుధవారం అన్నారు. ఫెడరల్ ఫ్రంట్ ముసుగులో బీజేపీకి వైసీపీ, టీఆర్ఎస్, మజ్లిస్‌లు బీ టీమ్‌లుగా వ్యవహరిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఫ్రంట్ పేరుతో కొత్త రాజకీయానికి టీఆర్ఎస్ నేతలు తెర లేపారని, దీన్ని టీడీపీ బ్లాక్ డేగా పాటిస్తామని చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్ దేశంలోనే అత్యంత అవినీతి పరులు అని, లాలూప్రసాద్ యాదవ్ మాదిరి వాళ్లు కూడా జైలుకు వెళ్తారంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో కేసీఆర్ విమర్శించారని రమణ గుర్తు చేశారు. వైఎస్సార్ కుటుంబాన్ని నిత్యం విమర్శించే కేసీఆర్‌కు ఇవాళ జగన్ దోస్త్ ఎలా అయ్యారని నిలదీశారు. నీతి గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్న కేటీఆర్.. ఇవాళ ఆయన్ను ఎందుకు కలిశారో చెప్పాలని రమణ ప్రశ్నించారు. బీజేపీ నాయకత్వంలో టీఆర్ఎస్, వైఎస్సార్ సీపీ, ఎంఐఎం అంతా ఒక టీమ్‌గా పని చేస్తున్నాయని రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు.

ఫ్రంట్లు, టెంట్లతో ప్రయోజనం లేదు: లక్ష్మణ్

హైదరాబాద్, వెలుగు: "దేశంలో ఎవరైనా ఫ్రంట్లు పెట్టుకోవచ్చు. టెంట్లు వేసుకోవచ్చు. కానీ ఈ ఫ్రంట్లు, టెంట్లతో ఎలాంటి ప్రయోజనం లేదు. గతంలో ఇలాంటివి విఫలమయ్యాయి. కుటుంబ పార్టీలన్నీ కలిసి తమ ఉనికి చాటుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలే ఇవి" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ రాంచందర్ రావుతో కలిసి ఆయన పార్టీ డైరీ ఆవిష్కరించారు. ఇద్దరు చంద్రులు కూటముల కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారని, ఇద్దరి ప్రయత్నాలు విఫలం కావడం తథ్యమని లక్ష్మణ్ అన్నారు. కూటములు, ఫ్రంట్లు తమ భావి ప్రధాని ఎవరనేది తేల్చుకోలేకపోతున్నాయని ఎద్దేవా చేశారు.



వాహనాలు లేక బుధవారం ఖాళీగా పంతంగి టోల్ ప్లాజా

మెల్లమెల్లగా పట్నం బాట

సంక్రాంతికి ఊరెళ్లిన జనమంతా తిరిగి పట్నానికి చేరుతున్నారు. పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ నెల 13, 16 తేదీల్లో టోల్ ఫీజు రద్దు చేసింది. దీంతో వాహనాలు ఆగే అవసరం లేకుండా టోల్ ప్లాజాల వద్ద గేట్లు తెరిచి ఉంచారు. అయితే బుధవారం సాయంత్రం వరకు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై అంతగా వాహనాల రద్దీ కనిపించలేదు.

- యాదాద్రి, వెలుగు



బుధవారం మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. పక్కన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ జగన్, టీఆర్ఎస్ ఎంపీలు వినోద్, సంతోష్

ఫెడరల్ ఫ్రంట్ దిశగా

కేటీఆర్, వైఎస్ జగన్ గంటన్నరపాటు భేటీ

హైదరాబాద్, వెలుగు:

ఫెడరల్ ఫ్రంట్ దిశగా మరో అడుగు. ఇదే అంశంపై ఇప్పటికే వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో, వివిధ పార్టీల చీఫ్‌లతో చర్చించిన సీఎం కేసీఆర్.. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో చర్చలకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పంపారు. కేసీఆర్ మంగళవారం జగన్‌కు ఫోన్ చేసి ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదనలను ఆయన ముందుంచారు. దీంతో చర్చలకు రావాలని కేటీఆర్‌ను జగన్ ఆహ్వానించారు. ఈ మేరకు కేటీఆర్, టీఆర్ఎస్ ఎంపీలు వినోద్‌కుమార్, సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌రెడ్డి బుధవారం లంచ్ అవర్‌లో హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని జగన్మోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. పలు అంశాలపై కేటీఆర్, జగన్ అభిప్రాయాలను పంచుకున్నారు. దాదాపు గంటన్నరపాటు వారి మధ్య చర్చలు జరిగాయి. టీఆర్ఎస్ ప్రతినిధి బృందానికి జగన్ సాదర స్వాగతం పలికారు. సమావేశం అనంతరం ఇరువురు నేతలు మీడియాతో మాట్లాడారు.

- లోటస్‌పాండ్‌లోని జగన్ ఇంట్లో సమావేశం
- కేసీఆర్ ఏపీ వెళ్లి జగన్‌తో మరింత చర్చిస్తారు: కేటీఆర్
- కేసీఆర్ ప్రయత్నాన్ని స్వాగతిస్తున్నాం: జగన్

కేసీఆర్ ఆదేశం మేరకు వచ్చాం: కేటీఆర్

సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు తాము జగన్‌తో చర్చలు జరిపేందుకు వచ్చినట్లు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. దేశ రాజకీయాల్లో ఒక గుణాత్మక మార్పు రావాలని ఏడాదిన్నర కాలంగా కేసీఆర్ పోరాడుతున్నారని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని తన దగ్గర పెట్టుకొని రాష్ట్రాలను ఇబ్బంది పెడుతోందని, ఇది మారాలన్న ఆలోచనతో కేసీఆర్ ఒక సమాఖ్య స్ఫూర్తితో ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని తలపెట్టారని తెలిపారు. ఇందులో భాగంగా ఆయన స్వయంగా ఒడిశా వెళ్లి అక్కడి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను, పశ్చిమ బెంగాల్ వెళ్లి అక్కడి సీఎం మమతా బెనర్జీని, తమిళనాడుకు వెళ్లి అక్కడి ప్రతిపక్ష నేత స్టాలిన్‌ను, కర్నాటకకు వెళ్లి అక్కడి సీఎం కుమారస్వామిని కలిశారని కేటీఆర్ గుర్తుచేశారు. వీళ్లే కాక పలు పార్టీల అధ్యక్షులను సంప్రదించి అందరినీ తన ప్రయత్నానికి మద్దతు ఇవ్వాలని అడిగారని వివరించారు. ఈ క్రమంలోనే మంగళవారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌కు సీఎం కేసీఆర్ ఫోన్ చేశారని, ఫెడరల్ ఫ్రంట్ ఆలోచన గురించి మాట్లాడేందుకు కలుస్తామని కోరితే జగన్మోహన్‌రెడ్డి ఆహ్వానించారని ఆయన వివరించారు. 'భావసారూప్యత ఉన్న శక్తులు, ప్రాంతీయ పార్టీలు మాతో కలిసి వస్తాయనే విశ్వాసం ఉంది. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జాతీయ రాజకీయాలు, వ్యవస్థ ఉండాలనే ఆలోచన కలిగిన ప్రతి ఒక్కరూ కలిసి వస్తారనే నమ్మకం ఉంది' అని కేటీఆర్ తెలిపారు. 'ఈ రోజు చాలా విషయాలు పంచుకున్నాం. ఇవి ప్రాథమిక చర్చలు మాత్రమే. కేసీఆర్ ఆయా రాష్ట్రాలకు వెళ్లి ముఖ్యమంత్రులు, పార్టీల అధ్యక్షులతో ఎలా మాట్లాడారో అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌కు కూడా వెళ్లి జగన్మోహన్‌రెడ్డితో కూడా అన్ని విషయాలు చర్చిస్తారు' అని ఆయన వివరించారు. భవిష్యత్తులో సందర్భానుసారం చర్చలు ముందుకు తీసుకుపోతామన్నారు.

ప్రత్యేక హోదాపై మా వైఖరి చెప్పేశాం

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై మీడియా కేటీఆర్‌ను ప్రశ్నించగా.. 'ప్రత్యేక హోదాపై వైఖరిని మా పార్టీ, సీఎం కేసీఆర్ సహా రాజ్యసభలో మా ఫ్లోర్ లీడర్ కేశవరావు, లోక్‌సభలో ఎంపీ కవిత చాలా స్పష్టంగా ప్రకటించారు. ప్రధాని నాడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని చెప్పాం. ఈ విషయంలో రెండో అభిప్రాయం గానీ, ఆలోచనగానీ మా పార్టీలో ఎక్కడ కూడా లేదు' అని బదులిచ్చారు. 'ఈ రోజు జరిగింది మొదటి సమావేశమే. మిగితా అన్ని విషయాలు కేసీఆర్ స్వయంగా వెళ్లి కూలంకశంగా మాట్లాడుతారు. ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాలకు సంబంధించిన ప్రయోజనాలపై ఏ రకంగా పోరాడాలో ఆయన చెబుతారు' అని కేటీఆర్ వివరించారు.

కేసీఆర్ ప్రతిపాదనను స్వాగతిస్తున్నా: జగన్

కేసీఆర్ ఫోన్ అనంతరం కేటీఆర్ వచ్చి ఫెడరల్ ఫ్రంట్ గురించి, రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాల గురించి చర్చించారని వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్ తెలిపారు. అన్యాయాలు జరగకుండా రాష్ట్రాలు నిలబడాలంటే దేశవ్యాప్తంగా రాష్ట్రాలు కలవాల్సిన అవసరాన్ని వివరించారని ఆయన అన్నారు. 'ప్రత్యేక హోదా అంశాన్ని తీసుకుంటే పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీకే దిక్కూదివాణం లేదు. చాలా విషయాల్లో రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోంది. వీటిని అధిగమించాలంటే రాష్ట్రంలోని ఎంపీల పరిధి సరిపోదు. 25 మంది ఏపీ ఎంపీలతో అడిగితే పట్టించుకోలేదు. పక్క రాష్ట్రంలోని 17 మంది ఎంపీలు తోడైతే బలం పెరిగి 42 మంది అవుతారు. ఈ బలంతో అన్యాయాన్ని ప్రశ్నిస్తే పరిస్థితి మెరుగవుతుంది. ఈ కోణంలో ఇది స్వాగతించదగ్గ విషయం. రాష్ట్రాల హక్కులు నిలబడాలంటే సంఖ్యాపరంగా ఎంపీల నంబర్ పెరగాలి. అప్పుడు కేంద్రం రాష్ట్రాలకు అన్యాయం చేయాలంటే వెనకడుగు వేస్తుంది. అందుకే కేసీఆర్ ప్రతిపాదించిన మోడల్‌ను స్వాగతిస్తున్నాను' అని జగన్ తెలిపారు. 'రాష్ట్రాలను ఏకం చేసి, ఎంపీలను ఒక్క తాటిపైకి తెచ్చేందుకు ఓ ప్లాట్‌ఫాం తయారుచేయడం ఆహ్వానించదగిన పరిణామం. కేసీఆర్ నాతో ఫోన్లో మాట్లాడారు. మునుముందు తానే వచ్చి చర్చిస్తానన్నారు. కేటీఆర్ అన్ని విషయాలను చెప్పారు. దీనిపై పార్టీలో సుదీర్ఘంగా డిస్కస్ చేసి ఎలా ముందుకు పోవాలో చూస్తాం' అని వివరించారు. వైఎస్సార్ సీపీ బృందంలో ఎంపీలు విజయసాయిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఉన్నారు.

యూపీఎస్సీని సంప్రదించాల్సిందే

డీజీపీల నియామకంపై గత తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, వెలుగు: డీజీపీల నియామకంపై రాష్ట్రాలు యూపీఎస్సీని సంప్రదించాల్సిందేనని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. గతేడాది జూలై 3న సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. విస్తృత ప్రయోజనాల దృష్ట్యా పోలీస్ అధికారుల నియామకంలో రాజకీయ జోక్యాన్ని తప్పించేందుకే ఆ నిర్ణయం తీసుకున్నట్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. స్థానిక చట్టాలకు అనుగుణంగా డీజీపీలను నియమించుకునేలా వెసులుబాటు కల్పించాలని కోరుతూ పంజాబ్, కేరళ, పశ్చిమ బెంగాల్, హర్యానా, బీహార్ తదితర రాష్ట్రాలు వేసిన పిటిషన్‌ను కోర్టు విచారించింది. వారి విజ్ఞప్తిని తోసిపుచ్చింది.



సీబీఐ డైరెక్టర్ నియామకానికి జనవరి 24న ప్యానల్ కమిటీ భేటీ

న్యూఢిల్లీ: సీబీఐ కొత్త డైరెక్టర్ నియామకంపై ఈ నెల 24న ప్యానల్‌కమిటీ భేటీ కానుంది. ప్రధాని మోడీ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. మొదట సమావేశాన్ని 21న నిర్వహించాలనుకున్నారు. కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే 24 లేదా 25న నిర్వహించాలని కోరటంతో ఈ మేరకు జనవరి 24ను ఫైనల్ చేశామని అధికారులు చెప్పారు.

పోలింగ్‌కు ముందే తేల్చండి

హైదరాబాద్, వెలుగు:

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చును పోలింగ్‌కు ముందే తేల్చాలని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్‌కు ముందు కనీసం రెండుసార్లు అకౌంట్లను మండలస్థాయి ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు, అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు పరిశీలించాలంది. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారులకు కమిషన్ కార్యదర్శి మేకల అశోక్‌కుమార్ లేఖ రాశారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థులు (సర్పంచ్, వార్డు మెంబర్) తమ ఖర్చులను ఓ రిజిస్టర్‌లో రికార్డు చేయాలి. ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లూ ఖర్చులను నమోదు చేసుకోవాలి. ఆ రెండు రికార్డుల అంచనాలు సమానంగా ఉండాలి.

- 'పంచాయతీ' అభ్యర్థుల ఖర్చుపై రాష్ట్ర ఎన్నికల సంఘం
- మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణ పూర్తవ్వాలి
- జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు

3.15 కల్లా పంపాలి

తొలి దశ పంచాయతీ నామినేషన్ల ఉపసంహరణ సమయంపై ఫిర్యాదులు రావడంతో జిల్లా కలెక్టర్లకు ఎన్నికల సంఘం మరోమారు స్పష్టతనిచ్చింది. రెండో, మూడో విడత నామినేషన్ల ఉపసంహరణను 3 గంటలకు పూర్తి చేసి 3.15 గంటలకు నిర్దేశిత నమూనాలో వివరాలు పంపాలని ఆదేశించింది. దీనిపై రిటర్నింగ్ అధికారులకు ఎంపీడీవోల ద్వారా సమాచారమివ్వాలని కలెక్టర్లకు సూచించింది.



నేడు రెండో విడత ఉపసంహరణ

రెండో విడత ఎన్నికలు జరిగే 4,135 పంచాయతీల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థులను అధికారులు అధికారికంగా ప్రకటిస్తారు.

సీరియస్‌గా తీసుకోండి / మూడో విడత నామినేషన్లు షురూ

ఎన్నికల ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోవాలని జిల్లా అధికారులకు ఎన్నికల సంఘం మరోమారు [illegible] అప్పీలు చేసేందుకు అవకాశం ఉంటుంది. 21న ఆర్డీవోల దగ్గర అప్పీళ్ల పరిష్కారం, 22న నామినేషన్ల ఉపసంహరణ, 30న మధ్యాహ్నం వరకు పోలింగ్, తర్వాత ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక ఉంటుంది.

విద్యాసంస్థల్లో 25% సీట్ల పెంపు

- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుకు: జవదేకర్

న్యూఢిల్లీ: పెద్దకులాల్లోని పేదలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా దేశవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు పెంచుతున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడించారు. అన్ని కాలేజీలు, యూనివర్శిటీలు, ప్రైవేటు విద్యాసంస్థల్లో 2019-20 నుంచి రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌తో జరిగిన భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

రిజర్వేషన్లు పొందడానికి అర్హులు వీరే

- ఏడాది ఆదాయం రూ.8 లక్షల కన్నా తక్కువ ఉన్నవారు.
- ఐదెకరాల కన్నా తక్కువ వ్యవసాయ భూమి ఉన్న వారు
- వెయ్యి చదరపు అడుగుల కన్నా తక్కువ విస్తీర్ణం ఉన్న ఇల్లు ఉన్న వారు
- నోటిఫైడ్ మున్సిపల్ ఏరియాల్లో 100 గజాల కన్నా తక్కువ విస్తీర్ణంలో నివాసం ఉన్న వారు
- నాన్ నోటిఫైడ్ మున్సిపల్ ప్రాంతాల్లో 200 గజాల కన్నా తక్కువ స్థలంలో ఇల్లు ఉన్న వారు.

సీనియర్లను కాదని జూనియర్లకు పదోన్నతులా?

న్యూఢిల్లీ:

ఇద్దరు న్యాయమూర్తులకు సుప్రీం కోర్టు జడ్జీలుగా పదోన్నతి కల్పిస్తూ కొలీజియం తీసుకున్న నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిట్టింగ్, రిటైర్డ్ జడ్జీలు లేఖాస్త్రాలు సంధిస్తున్నారు. సీనియర్లను కాదని జూనియర్లకు అవకాశం కల్పించారని దుయ్యబడుతున్నారు. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ సంజీవ్ ఖన్నాను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలని ఈ నెల 10న సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని కొలీజియం సిఫార్సు చేసింది. దీనికి తాజాగా బుధవారం కేంద్రం కూడా ఓకే చెప్పింది. కొలీజియం నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ సంజయ్ కృష్ణన్ కౌల్ తీవ్రంగా తప్పుబట్టారు. గత డిసెంబర్‌లో కొలీజియం సమావేశమై రాజస్థాన్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రదీప్ నంద్రజోగ్‌కు, ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ రాజేంద్ర మీనన్‌కు పదోన్నతి కల్పిస్తూ నిర్ణయం తీసుకుందని, అయితే.. తాజాగా సమావేశమైన కొలీజియం మాత్రం వాళ్ల పేర్లను పక్కనబెట్టిందని మండిపడ్డారు. ఇది తప్పుడు సంకేతాలకు దారితీస్తుందని, పునరాలోచించాలని కోరుతూ ఆయన సీజేఐ రంజన్ గొగోయ్‌కు లేఖ రాశారు. ఎందరో సీనియర్ జడ్జీలు ఉండగా.. జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నాకు ఎలా పదోన్నతి కల్పిస్తారని ఢిల్లీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ కైలాష్ గంభీర్ మండిపడ్డారు. దీనిపై ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాశారు. మాజీ సీజేఐ ఆర్ఎం లోధా, జస్టిస్ ఏపీ షా కూడా కొలీజియం తాజా సిఫార్సులను తప్పుబట్టారు. కొలీజియం సిఫార్సులు అసంబద్ధంగా ఉన్నాయని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) కూడా నిరసన తెలిపింది. జస్టిస్ ప్రదీప్ నంద్రజోగ్, జస్టిస్ రాజేంద్ర మీనన్ వంటి సీనియర్లు ఉండగా జూనియర్లకు ఎలా అవకాశం కల్పిస్తారని, పైగా గత కొలీజియం సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ఎలా కాదంటారని నిలదీసింది. న్యాయమూర్తుల నియామకాలు, పదోన్నతులపై సిఫార్సులు చేసే సుప్రీంకోర్టు కొలీజియంలో సీజేఐ జస్టిస్ గొగోయ్‌తోపాటు జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ బాబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ అరుణ్ మిశ్రా సభ్యులుగా ఉన్నారు.

- కొలీజియం సిఫార్సులపై సిట్టింగ్, రిటైర్డ్ జడ్జీల ఆగ్రహం
- రాష్ట్రపతి, సీజేఐకి లేఖలు
- కొలీజియం సిఫార్సులకు కేంద్రం ఓకే

గురువారం | హైదరాబాద్
17.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu
03


లైట్ల వెలుతురులో బుధవారం రాత్రి మెరుస్తున్న అసెంబ్లీ భవనం


ప్రత్యేక అలంకరణలో అమరవీరుల స్థూపం

నేటి నుంచే అసెంబ్లీ

ఉదయం 11.30 గంటలకు సభ షురూ ● మొదట ప్రమాణం చేయనున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, వెలుగు:

రాష్ట్ర రెండో అసెంబ్లీ తొలి విడత సమావేశాలకు సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం 11.30 గంటలకు సభ కొలువుదీరనుంది. 119 నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలతో పాటు నామినేటెడ్ ఎమ్మెల్యే కూడా తొలి రోజే శాసనసభ్యులుగా ప్రమాణం చేయనున్నారు. ఉదయం 11 గంటలకు సీఎం కేసీఆర్ గన్‌పార్క్‌కు చేరుకొని అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తారు. తర్వాత 11.05 గంటలకు అసెంబ్లీలోని తన ఆఫీసుకు చేరుకుంటారు. స్పీకర్ నామినేషన్, ఎన్నిక ప్రక్రియపై సీనియర్ ఎమ్మెల్యేలతో మాట్లాడి సభలోకి వస్తారు. సమావేశాల నిర్వహణ కోసం ఎంఐఎం సీనియర్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌తో గవర్నర్ నరసింహన్ బుధవారమే ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేయించారు.

ఎమ్మెల్యేలకు జూబ్లీహాల్‌లో లంచ్

గురువారం ఉదయం 11.30 గంటలకు ప్రొటెం స్పీకర్ అధ్యక్షతన అసెంబ్లీ సమావేశమవుతుంది. సభా నాయకుడిగా తొలుత సీఎం కేసీఆర్ ప్రమాణం చేస్తారు. అనంతరం మహిళా సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయిస్తారు. తర్వాత ఎన్నికల కమిషన్ ప్రకటించిన గెజిట్ నోటిఫికేషన్‌లోని అక్షర మాల ప్రకారం సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుంది. రెండు గంటల పాటు ఇది ఉంటుంది. సభ్యుల ప్రమాణం తర్వాత సభ మరుసటి రోజుకు వాయిదా పడుతుంది. కొత్త సభ్యులకు మండలి ఆవరణలోని జూబ్లీహాల్ లాన్స్‌లో లంచ్ ఏర్పాటు చేశారు.

రేపు స్పీకర్ ఎన్నిక

శాసనసభ స్పీకర్ ఎన్నిక కోసం ఇది వరకే నోటిఫికేషన్ జారీ అయింది. గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పీకర్ ఎన్నికకు నామినేషన్ దాఖలు చేయవచ్చు. సీఎం కేసీఆర్ ఎంపిక చేసిన సభ్యుడే స్పీకర్‌గా నామినేషన్ దాఖలు చేసే అవకాశముంది. మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేరును స్పీకర్‌గా ఖరారు చేసినట్టుగా తెలుస్తోంది. స్పీకర్ రేసులో పలువురి పేర్లను పరిశీలించినా పోచారం వైపే సీఎం మొగ్గు చూపినట్టుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శుక్రవారం స్పీకర్ ఎన్నిక ఉంటుంది. తర్వాత కొత్త సభాపతి అధ్యక్షతన సభ ప్రారంభమవుతుంది. సభను వాయిదా వేసిన తర్వాత స్పీకర్ చాంబర్‌లో బీఏసీ సమావేశమై గవర్నర్ ప్రసంగంపై చర్చిస్తుంది. శాసనసభ సమావేశాల నిర్వహణపైనా ఇందులో నిర్ణయం తీసుకుంటారు.

19న గవర్నర్ ప్రసంగం

19న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. తర్వాత సభ వాయిదా పడుతుంది. అదేరోజు మండలి సమావేశమవుతుంది. రెండ్రోజులపాటు సమావేశాలు సాగుతాయి. 20న శాసనసభ, మండలి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపడంతో ఈ విడత సమావేశాలు వాయిదా పడనున్నాయి.

గవర్నర్‌తో కేసీఆర్ భేటీ

బుధవారం గవర్నర్ నరసింహన్‌తో సీఎం కేసీఆర్ భేటీ అయ్యారు. ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం తర్వాత వారిద్దరు సుమారు రెండు గంటల పాటు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శాసనసభ సమావేశాలు, గవర్నర్ ప్రసంగంపై చర్చించారు. మంత్రివర్గ విస్తరణపైనా గవర్నర్‌కు సీఎం వివరించినట్టుగా తెలుస్తోంది. ఈ నెల 18న మంత్రివర్గ విస్తరణ ఉండవచ్చన ప్రచారం నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌తో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందం భేటీ, త్వరలో ఏపీలో తన పర్యటన వివరాలను కేసీఆర్ వివరించినట్టు సమాచారం.

వయసులో పెద్ద.. వనమా

ఎమ్మెల్యేలందరిలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావు(73) వయసులో పెద్దవారు. కొత్తగూడెం జిల్లాకే చెందిన ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ నాయక్ (29) అందరిలో పిన్న వయస్కురాలు.

- సభ్యుల ప్రమాణం తర్వాత వాయిదా
- రేపు స్పీకర్ ఎన్నిక..
- ఎల్లుండి గవర్నర్ ప్రసంగం

స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుందాం..

ప్రతిపక్ష పార్టీల చీఫ్‌లకు సీఎం ఫోన్

అసెంబ్లీ స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు సహకరించాలని ప్రతిపక్ష పార్టీల అధ్యక్షులను సీఎం కేసీఆర్ కోరారు. బుధవారం సాయంత్రం ఆయన పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. సీఎం ప్రతిపాదనకు అసదుద్దీన్, లక్ష్మణ్ సానుకూలంగా స్పందించగా.. పార్టీలో చర్చించి తమ నిర్ణయం ప్రకటిస్తామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

అసెంబ్లీకి సరికొత్త లుక్

18 ఏళ్ల తర్వాత పూర్తి స్థాయిలో వేసిన వైట్ పెయింట్, ఇతర రంగులతో అసెంబ్లీ భవనం కళకళలాడుతోంది. రంగురంగుల విద్యుద్దీపాల కాంతులతో ధగధగలాడుతోంది. అసెంబ్లీకి వెళ్లే దారిలో ఫుట్‌పాత్‌లపై కొత్త టైల్స్ వేయడంతోపాటు మొక్కలు నాటారు. అసెంబ్లీ హాల్‌లో కొత్త గ్రీన్ కార్పెట్ ఏర్పాటు చేశారు. డిస్పెన్సరీ, లైబ్రరీలో చిన్నచిన్న మరమ్మతు పనులు పూర్తి చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలోకి ఎమ్మెల్యేలు ప్రవేశించే ద్వారం దగ్గర కొత్తగా మినీ పార్కును ఏర్పాటు చేశారు. శాసనసభ పక్ష(ఎల్పీ) కార్యాలయాలకు కూడా రంగులు వేశారు. సరికొత్త నేమ్ బోర్డ్స్ ఏర్పాటు చేశారు. మీడియా పాయింట్ కూడా కొత్త శోభ సంతరించుకుంది. తాత్కాలికంగా కాకుండా పర్మనెంట్ చైర్స్ ఏర్పాటు చేయడంతోపాటు అధునాతన రైలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. అటు మండలి ప్రాంగణంలో సీఎంకు కొత్త చాంబర్ ఏర్పాటు చేశారు.


ప్రొటెం స్పీకర్‌గా అహ్మద్ ప్రమాణం

అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం సీనియర్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్ బుధవారం ప్రమాణం చేశారు. గవర్నర్ నరసింహన్ సాయంత్రం రాజ్‌భవన్‌లో ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్, శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, హోంమంత్రి మహమూద్ అలీ, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనచారి, ఎంఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎంపీలు బి.వినోద్‌కుమార్, సంతోష్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. గురువారం అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్.. కొత్తగా నెగ్గిన ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించనున్నారు.

జైట్లీకి తీవ్ర అనారోగ్యం

ట్రీట్మెంట్ కోసం అమెరికా పయనం

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. దీంతో చికిత్స కోసం అమెరికా బయల్దేరి వెళ్లారు. అమెరికాలో జైట్లీకి ఆపరేషన్ చేస్తారు. ఇప్పట్లో ఆయన ఇండియాకు తిరిగి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. కిందటేడాది జైట్లీ ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నారు. అప్పుడు రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ఆర్థిక శాఖ వ్యవహారాలు చూశారు. ఆపరేషన్ తర్వాత మూడు నెలల పాటు ఇంటికే పరిమితమైన జైట్లీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. మరోసారి అనారోగ్యం బారిన పడటంతో బడ్జెట్‌ను ఎవరు ప్రవేశ పెడతారన్న ప్రశ్న తెరమీదకు వచ్చింది. దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.




జైట్లీ కోలుకోవాలన్న రాహుల్

అరుణ్ జైట్లీ త్వరగా కోలుకోవాలని ప్రతిక్షాల నేతలు ఆకాంక్షించారు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. " జైట్లీ అనారోగ్యం బారిన పడ్డ విషయం తెలిసి షాక్ అయ్యా. ఆయన త్వరగా కోలుకోవాలి. ఈ కష్ట సమయంలో కాంగ్రెస్ ఆయనకు అండగా ఉంటుంది " అని అన్నారు. జైట్లీ సంపూర్ణ అరోగ్యంలో తిరిగి రావాలని రాహుల్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు చిదంబరం, సల్మాన్ ఖుర్షీద్, ఆర్జేడీ అధినేత లాలుప్రసాద్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఒమర్ అబ్దుల్లా తదితరులు ఆకాంక్షించారు.

నిలకడగా మంత్రి రవిశంకర్ ఆరోగ్యం

మరోవైపు, ముక్కు సంబంధిత ఇన్ఫెక్షన్ తో ఆస్పత్రిలో చేరిన మరో బీజేపీ నేత, కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఎయిమ్స్ డాక్టర్లు ప్రకటించారు. మంత్రిని ఐసీయూ నుంచి ప్రైవేటు వార్డుకు మార్చినట్లు చెప్పారు. సోమవారం మంత్రి ఆస్పత్రిలో చేరిన మంత్రిని పల్మనరీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ లో చేర్చుకుని చికిత్స ఇస్తున్నట్లు వివరించారు.



అమిత్‌షాకు స్వైన్ ఫ్లూ

న్యూఢిల్లీ: బీజేపీ చీఫ్ అమిత్ షాకు స్వైన్ ఫ్లూ సోకింది. చికిత్స కోసం ఢిల్లీలోని ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో చేరారు. బుధవారం ఈ విషయాన్ని ఆయన తన ట్విటర్ ద్వారా వెల్లడించారు. "నాకు స్వైన్ ఫ్లూ సోకింది. చికిత్స తీసుకుంటున్నా. ఆ దేవుడి దయ, మీ అందరి ఆశీస్సులతో తొందరగానే నేను కోలుకుంటా" అని ఆయన ట్వీట్ చేశారు. ఛాతిలో నొప్పి, శ్వాసలో ఇబ్బందులు తలెత్తడంతో ఆయన ఎయిమ్స్‌లో చేరారని, టెస్టుల్లో స్వైన్ ఫ్లూ ఉన్నట్టు తేలిందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఎయిమ్స్ డైరెక్టర్ రణ్‌దీప్ గులేరియా ఆధ్వర్యంలోని డాక్టర్ల బృందం ఆయన ఆరోగ్యాన్ని సమీక్షిస్తోంది.

నేడే సీఎల్పీ నేత ఎన్నిక

కోర్ కమిటీ మల్లగుల్లాలు ● రేసులో ఉత్తమ్ సహా పలువురు

హైదరాబాద్, వెలుగు: కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ లీడర్‌ను గురువారం ఎన్నుకోనున్నారు. ఇందు కోసం పార్టీ హైకమాండ్ దూతగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హైదరాబాద్ చేరుకున్నారు. బుధవారం రాత్రి ఆయన గోల్కొండ హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశంలో పాల్గొని.. సీఎల్పీ నేతగా ఎవరిని ఎంపిక చేయాలన్నదానిపై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర ముఖ్య నేతలతో పాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, ఏఐసీసీ కార్యదర్శులు సలీం, శ్రీనివాస్ కృష్ణన్, బోసు రాజు పాల్గొన్నారు. గురువారం ఉదయం 9గంటలకు సీఎల్పీ సమావేశం జరుగనుంది. ఈ భేటీలో కేసీ వేణుగోపాల్ పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని తీసుకొని, హైకమాండ్ అనుమతితో సీఎల్పీ నేతను ప్రకటిస్తారు. పదవి కోసం పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితోపాటు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి పోటీ పడుతున్నారు. ఉత్తమ్, భట్టి మధ్యే ప్రధాన పోటీ ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. బుధవారం రాత్రి జరిగిన కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశంలో సీఎల్పీ నేత ఎంపికతోపాటు డీసీసీ అధ్యక్షుల నియామకం, ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వంటి అంశాలపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిసింది.



ముగ్గురు ఎమ్మెల్సీలపై వేటు

హైదరాబాద్, వెలుగు:

పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్సీలపై శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ వేటు వేశారు. గవర్నర్ కోటాలో నామినేటైన ఎస్.రాములు నాయక్, ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన కె.యాదవరెడ్డి, నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఆర్. భూపతిరెడ్డిలను టీఆర్ఎస్ ఫిర్యాదు మేరకు అనర్హులుగా ప్రకటించారు. రాజ్యాంగంలోని 191(2) అధికరణం రూల్ 6 కింద ఈ చర్య తీసుకున్నట్టు పేర్కొన్నారు. శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులు బుధవారం ఈ మేరకు వేర్వేరు బులెటిన్లు విడుదల చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. రాష్ట్ర శాసన మండలి చరిత్రలో సభ్యులపై అనర్హత వేటు పడటం ఇదే తొలిసారి. ఫిర్యాదు అందిన నెల రోజుల్లోనే వీరిపై వేటు పండింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ వీడిన వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుపైనా టీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. తర్వాత ఆయన రాజీనామా చేశారు.

మండలిలో మొత్తం స్థానాలు 40 కాగా ఇప్పటికే నలుగురు రాజీనామా చేశారు. తాజాగా ముగ్గురిపై వేటుతో ఖాళీలు 7కు పెరిగాయి. కేసీఆర్ ముఖ్యమంత్రిగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశాక మండలిలో కాంగ్రెస్ బలం పడిపోయింది. కాంగ్రెస్ ఎమ్మెల్సీలు టి.సంతోష్‌కుమార్, ఆకుల లలిత, ఎం.ఎస్.ప్రభాకర్‌రావు, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కాంగ్రెస్ ఎల్పీని టీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేయాలని కోరుతూ నోటీసివ్వడం, ఆ మేరకు వారిని టీఆర్ఎస్ సభ్యులుగా విలీనం చేస్తూ చైర్మన్ బులెటిన్ జారీ చేయడం తెలిసిందే. దాంతో మండలిలో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష హోదా కోల్పోయింది.

ఎమ్మెల్సీలపై అనర్హత క్రమం..

డిసెంబర్ 17: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీలు రాములునాయక్, కొండా మురళీ, యాదవరెడ్డి, భూపతి రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ మండలి చైర్మన్‌కు ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు

డిసెంబర్ 18: నలుగురు సభ్యులకు చైర్మన్ నోటీసులు

డిసెంబర్ 21: టీఆర్ఎస్ఎల్పీలో విలీనం కావాలంటూ తాము సీఎల్పీ మీటింగ్‌లో తీర్మానం చేశామంటూ మండలి చైర్మన్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీలు టి.సంతోష్‌కుమార్, ఆకుల లలిత, ఎం.ఎస్.ప్రభాకర్‌రావు, కూచుకళ్ల దామోదర్‌రెడ్డి నోటీసులు. వారిని టీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేస్తూ అదే రోజు మండలి చైర్మన్ బులెటిన్ జారీ

డిసెంబర్ 22: మండలి సభ్యత్వానికి కొండా మురళీ రాజీనామా. వివరణకు గడువు కోరిన మిగతా ఎమ్మెల్సీలు

జనవరి 11: విచారణకు హాజరై వివరణ ఇచ్చిన ఎమ్మెల్సీ రాములు నాయక్ న్యాయవాది

జనవరి 12: విచారణకు హాజరైన యాదవరెడ్డి, భూపతిరెడ్డి తరపు న్యాయవాదులు. తీర్పు రిజర్వ్ చేసిన చైర్మన్

జనవరి 16: ముగ్గురిపై అనర్హత వేటువేస్తూ నిర్ణయం.


విలేకరులతో మాట్లాడుతున్న భూపతిరెడ్డి, యాదవరెడ్డి, రాములు నాయక్

న్యాయపోరాటం చేస్తం

తమపై అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజని ఎమ్మెల్సీలు భూపతిరెడ్డి, రాములు నాయక్, యాదవరెడ్డి అన్నారు. ప్రభుత్వం చెప్పిందే మండలి చైర్మన్ చేస్తున్నారని, ఎంఎస్ ప్రభాకర్‌పై ఏడాది క్రితం ఫిర్యాదు చేస్తే ఇప్పటిదాకా చైర్మన్ ఎందుకు చర్యలు తీసుకోలేదని భూపతిరెడ్డి బుధవారం ప్రశ్నించారు. తమపై అనర్హత వేటు చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. "మాకిచ్చిన నోటీసు తప్పులతడక. లోకల్ బాడీ నుంచి ఎన్నికైన నన్ను పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీగా పేర్కొంటూ ఎలా డిస్ క్వాలిఫై చేస్తారు? కాంగ్రెస్ పార్టీయే టీఆర్ఎస్‌లో విలీనమైందని అంటున్నప్పుడు మేమింకా కాంగ్రెస్ ఎమ్మెల్సీలం ఎలా అవుతాం?" అని ప్రశ్నించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు.

ఏకపక్షం: రాములునాయక్

సీఎం కార్యాలయ డైరెక్షన్‌లోనే మండలి చైర్మన్ తమపై ఏకపక్షంగా వేటు వేశారని రాములునాయక్ ఆరోపించారు. సీఎం కేసీఆర్‌ను గాంధీతో పోల్చినందుకు తనకు డిస్ క్వాలిఫై గిఫ్ట్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన తనను ఎలా డిస్ క్వాలిఫై చేస్తారని ప్రశ్నించారు. తమపై వేటు వేయడం చట్టాన్ని అవహేళన చేయడమేనని యాదవరెడ్డి అన్నారు.



ప్రకాశ్‌కు పర్యావరణ సంరక్షక్ అవార్డు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి. ప్రకాశ్‌కు అరుదైన గుర్తింపు దక్కింది. వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ సారథ్యంలోని భారత్‌సంగ్ ఆయనకు పర్యావరణ సంరక్షక్ అవార్డును ప్రకటించింది. ఈనెల 15, 16 తేదీల్లో రాజస్థాన్‌లోని బీకంపురాలో జరిగిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ మనవడు అరుణ్‌గాంధీ, ముని మనవడు తుషార్‌గాంధీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జలవనరుల పరిరక్షణ కోసం సీఎం కేసీఆర్ అనుసరిస్తున్న విధానాలను తన ప్రసంగంలో ప్రకాశ్ వివరించారు. రాజేంద్రసింగ్ గతంలో తన జన్మదినాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నెక్కొండ చెరువుకట్టపై జరుపుకోగా ప్రకాశ్ తన 62వ పుట్టినరోజును రాజేంద్రసింగ్ ఆశ్రమంలో జరుపుకున్నారు.

ఆర్రోజులు.. రూ.63.35 కోట్లు

అంచనాలు మించిన ఆర్టీసీ సంక్రాంతి ఆదాయం

హైదరాబాద్, వెలుగు: సంక్రాంతి సందర్భంగా టీఎస్ ఆర్టీసీకి అంచనాలకు మించి ఆదాయం సమకూరింది. ఈ నెల 10వ తేదీ నుంచి 15 వరకు ఆర్టీసీ వివిధ ప్రాంతాలకు 4,622 ప్రత్యేక బస్సులు నడిపింది. దీంతో ఈ ఆరు రోజుల్లో రూ.63.35 కోట్ల ఆదాయం వచ్చింది. గత యేడాది 10వ తేదీ నుంచి 15 మధ్యలో 3,222 బస్సులను నడపగా రూ.62.48 కోట్ల ఇన్‌కం వచ్చింది. ఈ సంవత్సరం 1400 అదనపు బస్సులు నడిపామని, రూ. 87 లక్షల ఆదాయం ఎక్కువొచ్చిందని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) కొమురయ్య తెలిపారు. సాధారణ రోజుల్లో సంస్థకు సగటున సుమారు రూ.9 కోట్ల వరకు ఆదాయం వస్తుంది.

ఆ ఒక్కరోజే రూ.13.25 కోట్లు

12వ తేదీన అధికంగా రూ.13.25 కోట్ల ఆదాయం వచ్చింది. 10న రూ.10.6 కోట్లు, 11న రూ.11.96 కోట్లు, 13న రూ.12 కోట్లు, 14న రూ.12 కోట్లు, 15న అత్యల్పంగా రూ. 6.14 కోట్ల ఇన్‌కం వచ్చింది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో 50శాతం అదనపు చార్జీలు వసూలు చేసింది. పండుగకు 30 లక్షల మందికి పైగా సొంతూళ్లకు వెళ్లగా, ఒక్క ఆర్టీసీ బస్సుల్లోనే 10లక్షల మంది ప్రయాణించినట్లు సంస్థ లెక్కలు చెబుతున్నాయి. పండుగ రోజుల్లో ఆర్టీసీ సిబ్బంది సెలవులు తీసుకోకుండా పనిచేశారు. ప్రత్యేక సెల్ ద్వారా పర్యవేక్షించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతోపాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులకు అదనపు బస్సులు నడిపారు. ఈ సారి ఏపీకి ఎక్కువ బస్సులు నడపడం గమనార్హం. పండుగకు ఇంటికెళ్లిన వారు తిరిగి సిటీకి వస్తుండడంతో రానున్న రెండు మూడు రోజుల్లో ఆదాయం మరింత పెరిగే అవకాశముంది.



- 12న ఒక్క రోజే 13.25 కోట్ల ఇన్‌కం
- గతేడాది కంటే రూ.87 లక్షలు అదనం


మన వర్సిటీలు ఇరగదీశాయి

టీహెచ్‌ఈ ఎమర్జింగ్ ఎకానమీస్ ర్యాంకింగ్‌లో సత్తా ● 450 వర్సిటీల్లో 49 మనవే.. ఐఐఎస్సీకి14వ ర్యాంక్

లండన్: అభివృద్ధి చెందుతున్న దేశాల యూనివర్సిటీల ర్యాంకింగ్‌లో ఇండియన్ వర్సిటీలు దుమ్మురేపాయి. బెస్ట్ వర్సిటీల్లో గత ఏడాది కన్నా ఎక్కువ విశ్వవిద్యాలయాలు చోటు దక్కించుకున్నాయి. 'టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీహెచ్‌ఈ)' 2019కి గాను విడుదల చేసిన ఎమర్జింగ్ ఎకానమీస్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఈసారి 49 ఇండియన్ వర్సిటీలకు (గత ఏడాది 42) చోటు దక్కింది. టాప్ 200లో 25 వర్సిటీలున్నాయి. 2018లో ఈ సంఖ్య 17 మాత్రమే. లిస్టులో చైనా టాప్‌లో ఉంది. 72 వర్సిటీలు ఆ దేశానివే. టాప్ 5 వర్సిటీల్లో చైనావే నాలుగు. గత ఏడాది పెకింగ్ వర్సిటీ టాప్‌లో ఉండగా ఈ సారి ఆ స్థానాన్ని చైనాకు చెందిన సింఘువా వర్సిటీ దక్కించుకుంది. జెజియాంగ్ వర్సిటీ 3వ స్థానంలో (గత ఏడాది 6వ స్థానం), యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆఫ్ చైనా 4, లొమొనొసోవ్ మాస్కో స్టేట్ వర్సిటీ 5వ స్థానంలో నిలిచాయి. వర్సిటీల జాబితాలో ఈ సారి 43 దేశాల నుంచి 450 వర్సిటీలు చోటు సంపాదించాయి. మునుపు 378 వర్సిటీలకే చాన్స్ దక్కింది.

లిస్టులో ఐఐటీ హైదరాబాద్

జాబితాలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ 14వ స్థానం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే 27వ ర్యాంకును దక్కించుకున్నాయి. ఈ రెండు వర్సిటీలూ గత ఏడాదితో పోలిస్తే ఒక స్థానాన్ని కోల్పోయాయి. పోయినసారి 56వ స్థానంలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూర్కీ ఈసారి 35వ స్థానంలో నిలిచింది. పరిశోధన (ఆదాయం, పేరు, రీసెర్చ్‌ల సంఖ్య), ఇండస్ట్రీ ఇన్‌కమ్ (నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్)లో ముందంజలో ఉండటంతో 21 స్థానాలు మెరుగుపరుచుకుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇండోర్ (61వ స్థానం), జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (64వ స్థానం) తొలిసారి లిస్టులో చేరి మంచి స్థానం సంపాదించాయి. సావిత్రీబాయి ఫులే పుణే వర్సిటీ 87 స్థానాలు మెరుగుపరుచుకొని 93 స్థానం దక్కించుకుంది. నేషనల్ అటానమస్ యూనివర్సిటీ ఆఫ్ మెక్సికోతో కలసి ఈ స్థానం పంచుకుంది. బెనారస్ హిందూ వర్సిటీ, అమృత యూనివర్సిటీలు రెండూ టాప్ 150లో స్థానం సంపాదించాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ పుణే, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ తొలిసారి లిస్టులో చేరాయి.



ఇండియన్ వర్సిటీలకు చాన్స్

ఇండియన్ వర్సిటీలు ఎమర్జింగ్ ఎకానమీస్‌లోనే కాకుండా గ్లోబల్‌గానూ సత్తా చాటగలవని, అందుకు మంచి అవకాశాలున్నాయని టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ గ్లోబల్ ర్యాంకింగ్స్ ఎడిటర్ ఎల్లీ బోత్‌వెల్ చెప్పారు. బోధనలో ఇండియన్ వర్సిటీలు మంచి అభివృద్ధి కనబరిచినా ప్రపంచ స్థాయితో పోలిస్తే మాత్రం ఇంకా వెనుకబడే ఉన్నాయన్నారు. దేశ వర్సిటీ ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు సంపాదిస్తే పరిశోధనలో ఇతర దేశాల నుంచి సహకారం అందుతుందని, విదేశీ స్టూడెంట్లు కూడా చదివేందుకు ఆసక్తి కనబరుస్తారని చెప్పారు.



ఏపీ నెక్స్ట్ సీఎం నేనే: కేఏ పాల్

హైదరాబాద్, వెలుగు: ఆంధ్రప్రదేశ్‌కు కాబోయే సీఎం తానేనని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ బుధవారం అన్నారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్‌తో కలిసి పనిచేస్తానని చెప్పారు. కేటీఆర్, జగన్‌ను సమావేశ పరిచినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పిన పాల్.. వైఎస్సార్ సీపీ గెలుపు కోసం టీఆర్ఎస్ ప్రచారం చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. 'ఏపీ సీఎం చంద్రబాబును ఆ రాష్ట్ర ప్రజలు నమ్మడం లేదు. మాటలు రాని లోకేశ్‌కు మంత్రి పదవిచ్చారు' అన్నారు. డబ్బుతో తనను బాబు కొనాలనుకుంటున్నారని ఆరోపించారు. 'ప్రాణం పోయే వరకూ ఏపీలోనే ఉంటాను. చావుకు భయపడను. నాకేమైనా అయితే నా ఆస్తులు ప్రజలకే చెందుతాయి' అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ భూస్థాపితం అవుతుందని, మోడీ మరోసారి ప్రధాని కాలేరన్నారు. తన అన్నను వదినే చంపించిందని ఆరోపించారు.

'పాలు'పంచుకుందాం

తెలంగాణ, బ్రెజిల్ మధ్య సూత్రప్రాయ ఒప్పందం

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగేందుకు ముందడుగు పడింది. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ, బ్రెజిల్‌లోని ఎంబ్రాప అమజోనియా ఓరియంటల్ సంస్థ బుధవారం హైదరాబాద్‌లో సూత్రప్రాయంగా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం ఆయా జాతులకు సంబంధించిన సెమన్ (వీర్యం), ఇతర పరిజ్ఞానాన్ని బదిలీ చేసుకోనున్నారు. దీని ద్వారా రాష్ట్రంలోని 11 లక్షల మంది పాడి రైతులు లాభం పొందనున్నారు. దేశానికి చెందిన ఉత్తమ పశుజాతులు గిర్, సాహీవాల్, కంక్రెజ్, ఒంగోలు పశువులను రోజుకు 75 లీటర్లు, ముర్రా జాతి గేదెలు రోజుకు 45 లీటర్ల పాలు ఇచ్చేలా 1908 నుంచి బ్రెజిల్ జన్యుపరంగా అభివృద్ధి చేస్తోంది. మరోవైపు ఏప్రిల్‌లో జరిగే పశు ప్రదర్శనకు రావాల్సిందిగా రాష్ట్ర అధికారులను బ్రెజిల్ ప్రతినిధులు ఆహ్వానించారు. సమావేశంలో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, డైరెక్టర్ డి.వెంకటేశ్వర్లు, బ్రెజిల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెన్నైలో 20 కిలోల బంగారం స్వాధీనం

చెన్నై: దుబాయ్, శ్రీలంక నుంచి అక్రమంగా బంగారం స్మగ్లింగ్ చేస్తున్న ముఠా సభ్యులను చెన్నై పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.6.88కోట్ల విలువైన 20.6కిలోల బంగారం, బీఎండబ్ల్యూ కారు, రూ.21లక్షల ఇండియన్ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. ముఠా నడిపిస్తున్న వ్యక్తితో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పలు దేశాల నుంచి బంగారం తరలించి చెన్నైలో అమ్ముతున్నట్లుగా విచారణలో తేలింది.

చత్తీస్‌గఢ్‌లో ముగ్గురు నక్సల్స్ అరెస్టు

దంతెవాడ: చత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లాలో ముగ్గురు నక్సల్స్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నక్సలైట్లు పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు నక్సల్స్‌కు గాయాలవగా వారిని అరెస్టు చేశామని దంతెవాడ జిల్లా ఎస్పీ అభిషేక్ పల్లవ్ వివరాలు వెల్లడించారు. "ప్రయాణికులతో గీదం నుంచి చింతల్నార్ వెళ్తున్న బస్సును కసోలీ అటవీ ప్రాంతంలో 20 మంది నక్సల్స్ బుధవారం ఉదయం అడ్డుకున్నారు. అందరినీ కిందకు దించి బస్సును తగలబెట్టారు. ఈ సమాచారం అందిన వెంటనే ప్ర



చిరుతదాడిలో గాయపడిన లేగదూడ..



చిరుత జాడలు

బాబోయ్.. చిరుతలు

- మహబూబ్‌నగర్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో హల్‌చల్
- లేగదూడలపై పంజా.. భయాందోళనలో జనం

వెలుగు నెట్‌వర్క్:

రాష్ట్రంలో చిరుతల బెడద పెరుగుతున్నది. మూడు జిల్లాల్లో వాటి పంజాకు మూడు లేగ దూడలు చనిపోయాయి. వరుసగా జరుగుతున్న ఈ సంఘటనలతో జనం వణికిపోతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం బండమీదిపల్లి గ్రామానికి చెందిన రాలబాయి లక్ష్మమ్మ తన పశువులను సోమవారం రాత్రి పొలం దగ్గర కట్టేసి ఇంటికి వచ్చింది. మంగళవారం తెల్లవారుజామున అటు వైపు వెళ్లిన గ్రామస్థులకు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ లేగదూడ కనిపించింది. కొద్దిసేపటికే అది చనిపోయింది. అక్కడ పులి జాడలు ఉండటంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు అవి చిరుత పులి జాడలేనని నిర్ధారించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం ఖాసింపేటకు చెందిన కల్లెపల్లి చంద్రం నాలుగు లేగదూడలను సోమవారం సాయంత్రం పొలం వద్ద కట్టేశారు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి ఒక దూడ చనిపోయింది. చిరుత దాడి వల్లే చనిపోయిందని బాధితుడు తెలిపారు. అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగాఉండాలని వారు సూచించారు. ఇక, మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌లోని దాసరి పెద్ద ఎల్లయ్యకు చెందిన దూడపై మంగళవారం రాత్రి చిరుత దాడి చేసి చంపేసింది. రామాయంపేట మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో గతంలో చిరుత దాడిలో 25 పశువులు చనిపోయాయి. తాజాగా మళ్లీ చిరుత దాడి జనాన్ని భయాందోళనలకు గురిచేస్తున్నది.

జబల్‌పూర్, తిరునల్వేలి మధ్య 16 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, వెలుగు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జబల్‌పూర్ తిరునల్వేలి మధ్య 16 వీక్లీ సూపర్ ఫాస్ట్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రతి గురువారం జబల్‌పూర్ నుంచి ఉదయం 9.30లకు.. తిరునల్వేలి నుంచి ప్రతి శనివారం సాయంత్రం 5.45 గంటలకు విజయవాడ, రేణిగుంట మీదుగా నడుస్తాయని చెప్పారు.

ఘనంగా పార్వేటోత్సవం

తిరుమల, వెలుగు: తిరుమల వెంకటేశ్వర స్వామి పార్వేటోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆరాధన తర్వాత శ్రీ మలయప్ప స్వామివారు వెండి తిరుచ్చిలో, శ్రీ కృష్ణ స్వామివారు మరో తిరుచ్చిలో మండపానికి చేరుకుని పార్వేటలో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వామి వారి తరఫున అర్చకులు 3 సార్లు బాణం వేస్తూ వేటను ప్రదర్శించి, భక్తులకు కనువిందు చేశారు. గోదాపరిణయ ఉత్సవం వైభవంగా జరిగింది. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలోని ఆండాళ్ శ్రీగోదాదేవి నుంచి శ్రీవారికి ప్రత్యేక మాలలు కానుకగా అందాయి. ఈ ఉత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



చంద్రుడి వాసన చూస్తరా?


మార్స్‌పైకి వెళ్లేందుకు మీరు ఫిట్టా కాదా?

- గుజరాత్ సైన్స్ సిటీలో అమెరికా బియాండ్ ప్లానెట్ ఎర్త్ ఎగ్జిబిషన్
- ఇండియాలో ఇదే తొలిసారి.. నేటి నుంచి 16 వారాల పాటు ప్రదర్శన

చంద్రుడి మట్టి వాసన చూడాలనుందా? అంగారకుడిపై కాలు పెట్టేందుకు అర్హులు అవునో కాదో తెలుసుకోవాలనుందా? అయితే, గుజరాత్ సైన్స్ సిటీలో అమెరికన్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ (ఏఎంఎన్‌హెచ్) పెడుతున్న ఎగ్జిబిషన్‌కు వెళ్లాల్సిందే. 'బియాండ్ ప్లానెట్ ఎర్త్' పేరిట వైబ్రెంట్ గుజరాత్ సదస్సులో భాగంగా జనవరి 17న (గురువారం) ఈ ఎగ్జిబిషన్‌ను పెడుతున్నారు. అందులో మనిషిని అంతరిక్షంలోకి తీసుకెళ్లిన సోవియెట్ కాలం నాటి 'వోస్తోక్' క్యాప్సూల్ నుంచి నేటి నాసా 'క్యూరియాసిటీ' రోవర్ వరకు వాటి నమూనాలను ఆ సదస్సులో ప్రదర్శిస్తారు. వాటిని న్యూయార్క్ నుంచి ఇండియాకు తీసుకొచ్చేందుకు అయ్యే రూ.2.8 కోట్ల ఖర్చును గుజరాత్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ భరించింది. ఇండియాలో ఎగ్జిబిషన్‌ను పెట్టడం ఇదే తొలిసారని ఏఎంఎన్‌హెచ్ సేల్స్ డైరెక్టర్ మ్యాట్ హీనన్ చెప్పారు.

వాడిన గన్‌పౌడర్ లాంటి వాసన


అపోలో 17 లూనార్ ల్యాండర్‌లో చంద్రుడిపైకి వెళ్లిన జీన్ సెర్నన్ అనే ఆస్ట్రోనాట్.. చంద్రుడి మట్టి వాడిన గన్‌పౌడర్‌లా ఉంటుందని అప్పట్లో చెప్పారు. చంద్రుడిపైన ఉన్న రాళ్లను తీసుకొచ్చారు. అయితే, ఆ ఆస్ట్రోనాట్ చెప్పిన దాని ప్రకారం తయారు చేసిన రిక్రియేషనల్ మోడల్‌ను ఎగ్జిబిషన్‌లో పెడుతున్నట్టు హీనన్ చెప్పారు. మూన్ రోవర్లలో వాడిన టైర్ల పదార్థాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తున్నామన్నారు. మూన్ రోవర్లలో రబ్బర్ టైర్లకు బదులు వైర్ జాలితో టైర్లను తయారు చేశామని, వాటిని ప్రముఖ టైర్ల కంపెనీ గుడ్‌ఇయర్ ప్రెజెంట్ చేస్తుందని అన్నారు. అంతరిక్షంలోకి వెళ్లిన తొలి మనిషి యూరీ గగారిన్. అతడిని 1960లో స్పేస్‌లోకి తీసుకెళ్లిన వోస్తోక్ నమూనాను ప్రదర్శించనున్నారు. 1957లో అంతరిక్షంలో ప్రవేశపెట్టిన తొలి కృత్రిమ ఉపగ్రహం స్పుత్నిక్1 నమూనాను ప్రదర్శిస్తారు. చంద్రుడిపైకి మినరల్స్, మనిషిని సులభంగా తీసుకెళ్లడానికి వీలుగా చంద్రుడి ఈక్వేటర్ వద్ద నిర్మించ తలపెట్టిన మూన్ ఎలివేటర్ (లిఫ్ట్)నూ ప్రదర్శిస్తారు. చంద్రుడి తర్వాత హాట్ టాపిక్ మార్స్‌పైకి మనిషిని పంపడం కదా. అందుకూ ఓ పెద్ద మార్స్ సెక్షన్‌నూ ఏర్పాటు చేశారు. సేమ్ మార్స్‌ను తలపించేలా సెట్ వేశారు. 360 డిగ్రీల కోణంలో మార్స్‌ను ఫొటో తీసే రోవర్ సహా అక్కడ కొలువుదీరతాయి. అక్కడ మార్స్‌పైకి వెళ్లేందుకు ఫిట్టో కాదో తేల్చే పరీక్షలను నిర్వహించనున్నారు. దాదాపు 16 వారాల పాటు ఈ ఎగ్జిబిషన్ సాగుతుంది.



వాట్సాప్‌కు డిక్టేషన్

గొంతుతో టైపింగ్.. చేత్తో సెండింగ్

వాట్సాప్‌లో టైప్ చేసి చేసి వేళ్లు నొప్పెడుతున్నాయా.. ఇకపై ఆ శ్రమ ఉండదు. టైప్ చేయాల్సిన అవసరం రాదు లెండి. ఆ... ఎవరు టైప్ చేస్తరు.. వాట్సాప్‌కు చేతులొచ్చి తనే టైప్ చేసుకుంటుందా ఏంటి అని ఎదురు ప్రశ్నించకండి. మీరు ఓ మాట వాట్సాప్‌కు చెప్పేయండి.. అదే పోలోమని ఆ మాటను రాసేసుకుంటుంది. అవును, వాట్సాప్‌లో కొత్త ఫీచరొచ్చింది. చిన్నప్పుడు టీచర్ డిక్టేషన్ చెబుతుంటే.. నోట్స్‌పైనో



లేదంటే పలకపైనో చెప్పింది చెప్పినట్టు రాసేవాళ్లం కదా. అలాగే అన్నమాట. వాట్సాప్‌కు డిక్టేషన్ చెప్పేస్తే సరి. ఆ చెప్పిన మాటలను టైప్ చేసేస్తుంది. అంటే డిక్టేషన్ ఫీచర్ అన్నమాట. టైప్ చేయడానికి వేళ్లనాడించాల్సిన అవసరం లేకపోయినా.. అది అవతలివైపు వాళ్లకు వెళ్లాలంటే కచ్చితంగా చేతిని వాడాలండోయ్. ఆండ్రాయిడ్, ఐవోస్ ఫోన్లలో ఇది అందుబాటులోకి వచ్చింది. కీబోర్డుపై ఉండే మైక్ ఐకాన్‌ను క్లిక్ చేసి డిక్టేషన్ చెప్పి మెసేజ్‌ను ఎంచక్కా పంపించుకోవచ్చన్నమాట. ఇప్పటికే గూగుల్ అసిస్టెంట్, యాపిల్ సిరిల్లో ఈ డిక్టేషన్ ఫీచర్ అందుబాటులో ఉంది. ఇప్పుడు వాట్సాప్‌లోకి ఎక్కింది. సేమ్ మామూలుగా మనం వాట్సాప్‌లో మెసేజ్ ఎలా పంపుతామో అలాగే పంపుకుంటే సరిపోతుంది. ఇక్కడ కొన్ని చిక్కులున్నాయి. కామా, క్వశ్చన్ మార్క్, ఫుల్‌స్టాప్ అని చెబితే.. చిహ్నాలను కాకుండా పూర్తిగా రాసేస్తుంది. కాబట్టి, అంతా అయిపోయాక కొద్దిగా ఎడిట్ చేసుకుంటే బాగుంటుంది. పెద్ద పెద్ద మెసేజ్‌లు పెట్టాలంటే ఈ ఫీచర్ బాగా పనికొస్తుందని చెబుతున్నారు. కాబట్టి గొంతుతో టైప్ చేసి.. చేత్తో సెండ్ చేస్తే సరి!!

ఏప్రిల్ నుంచి కొత్త జోన్లు

శాఖలవారీగా ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్న సర్కారు ● పనిలో పనిగా ఖాళీలపైనా ఆరా

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి కొత్త జోన్లు అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానికులకు ఎక్కువ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో గత ఏడాది మే నెలలో కొత్త జోనల్ వ్యవస్థకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. దీన్ని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించి కేంద్రానికి పంపింది. ఇదే విషయమై సీఎం పలుదఫాలు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీని కలిశారు. ఈ క్రమంలోనే గత ఏడాది ఆగస్టులో తొమ్మిది జోన్లను ఏర్పాటుచేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో 31 జిల్లాల పరిధిలో 7 జోన్లతోపాటు 2 మల్టీ జోన్లు ఉన్నాయి.

పుట్టిన ప్రదేశం, చదువు కీలకం

కొత్త జోనల్ వ్యవస్థ నిబంధనలకు లోబడి ఉద్యోగుల వివరాల సేకరణలో యంత్రాంగం నిమగ్నమైంది. సాధారణ పరిపాలన శాఖ నుంచి అందిన ప్రొఫార్మా ప్రకారం ఉద్యోగులు పుట్టిన, చదువుకున్న ప్రాంతాలు, ప్రస్తుత హోదా, ఇప్పుడు పనిచేస్తున్న ప్రదేశం, ప్రస్తుత జోన్ వంటి వివరాలు తీసుకుంటున్నారు. నెలరోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

ఖాళీల వివరాలు కూడా..

ఉద్యోగుల వివరాలతోపాటు వివిధ శాఖల్లో ఖాళీల వివరాలనూ ప్రభుత్వం సేకరిస్తోంది. గతంలోనూ ఖాళీల వివరాలు తెప్పించుకున్నప్పటికీ, క్రాస్‌చెకింగ్ కోసం మరోమారు లెక్కలు తీసుకున్నారు. జోన్, మల్టీజోన్ పరిధిలో పోస్టుల ఖాళీలతోపాటు వాటిపై రిమార్క్స్ కూడా ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

ఏప్రిల్‌లోనే ఎందుకు?


కొత్త జోనల్ వ్యవస్థపై రాష్ట్రపతి ఉత్తర్వులు వచ్చాక కూడా వాటిపై ప్రభుత్వం కొంత కసరత్తు చేసింది. 31 జిల్లాల పరిధిలో ఉన్న జనాభా, నిరుద్యోగ యువత, జిల్లాలవారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై లోతుగా అధ్యయనం చేసింది. 2019 జనవరి నుంచే కొత్త జోన్స్ ను అమల్లోకి తేవాలని భావించినా అసెంబ్లీ ఎన్నికల కారణంగా అది సాధ్యం కాలేదు. దాంతో కొత్త ఆర్థిక సంవత్సరం(ఏప్రిల్) నుంచైనా కొత్త జోనల్ వ్యవస్థను ఉనికిలోకి తేవాలని నిర్ణయించింది.



రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణ!

కొత్త జోనల్ వ్యవస్థపై రాష్ట్రపతి ఉత్తర్వులకు మరో సవరణ అవసరమయ్యేలా కనిపిస్తోంది. ఇప్పటివరకు 31 జిల్లాల ప్రాతిపదికగా 9 జోన్లు ఏర్పాటయ్యాయి. అయితే ఇటీవల ప్రభుత్వం రాష్ట్రంలో ములుగు, నారాయణపేట జిల్లాల ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ రెండు జిల్లాలు అధికారికంగా ఫిబ్రవరిలో ఖరారు కానున్నాయి. ప్రతిపాదిత జిల్లాలు ములుగు.. భద్రాద్రి జోన్ పరిధిలో, నారాయణపేట.. జోగుళాంబ జోన్ పరిధిలో ఉన్నాయి. అయినా కొత్త జిల్లాల ఏర్పాటు అంశంపై రాష్ట్రపతి ఉత్తర్వుల్లో సవరణ అవసరమనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది.

కొబ్బరి చిప్ప వెయ్యి రూపాయలు



కొబ్బరికాయ ఎంతుంటుంది.. ఇప్పటి రేటు ప్రకారం మహా అయితే 25 రూపాయలు. దేవుడికి కాయ కొట్టిన తర్వాత.. అందులోని కొబ్బరిని వాడుకుని ఆ చిప్పను పడేస్తాం. మరి, వెయ్యి రూపాయలకు ఆ ఖాళీ కొబ్బరి చిప్పను 'ఆఫర్లో' కొనమంటే కొంటారా? ఏం జోకులేస్తున్నారా.. ఖాళీ కొబ్బరి చిప్పకు వెయ్యి రూపాయలా.. మళ్లీ ఆఫర్ అంటారా అని కళ్లెర్రజెయ్యకండి. అమెజాన్‌కు ఆ వేస్ట్‌పైనా వ్యాపారం ఎలా చేయాలో బాగా తెలిసినట్టుంది. అందుకే ఆన్‌లైన్‌లో కొబ్బరి చిప్పలను అమ్ముతోంది. షోరూంలో అయితే రూ.3 వేలట. అదే అమెజాన్‌లో ఆఫర్ పోనూ రూ.వెయ్యి రూపాయలకు ఇస్తారట. నమ్మశక్యంగా లేకపోయినా నిజమే. మనం వాడుకుని పడేసే, లేదంటే చలిమంటల కోసం వాడుకునే ఆ కొబ్బరి చిప్పలను డైనింగ్ టేబుల్‌పై అలంకరణ కోసం వాడుకోవచ్చట. సహజంగా దొరికే చిప్పలట. అందుకే వెయ్యి రూపాయలకు ఆఫర్లో ఇస్తోందట అమెజాన్. ఇంకా దానికి హవాయి కొబ్బరి చిప్పలంటూ ఓ ట్యాగ్ తగిలిస్తోంది.

గురువారం | హైదరాబాద్
17.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu



కర్ణాటక పరిణామాలపై ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఖర్గే

బుజ్జగింపు రేపు

కన్నడ అసంతృప్త ఎమ్మెల్యేలతో సీఎల్పీ భేటీ

- బీజేపీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోంది: కాంగ్రెస్
- కూలదోసే ఆలోచన లేదంటున్న బీజేపీ

బెంగళూరు: కర్ణాటక రాజకీయాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించడానికి శుక్రవారం కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) సమావేశం కానుంది. సీఎల్పీ నాయకుడు సిద్ధరామయ్య అధ్యక్షతన మధ్యాహ్నం మూడున్నర గంటలకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తాజా విస్తరణలో మంత్రి పదవులు దక్కనందుకు కొంతమంది ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని, బీజేపీ వైపు చూస్తున్నారని సమాచారం రావడంతో వారిని సముదాయించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. అవసరమైతే అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేల కోసం తాము పదవులు వదులుకోవడానికి కొంతమంది మంత్రులు ముందుకు వచ్చినట్లు తెలిసింది. కాగా బీజేపీ ఎన్ని ప్రలోభాలు చేసినా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ వీడరని చాటి చెప్పడానికి సీఎల్పీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

తిరిగివచ్చిన ఇద్దరు ఎమ్మెల్యేలు

రెండు రోజుల నుంచి కనిపించకుండా పోయిన ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తిరిగివచ్చారు. ఎమ్మెల్యే భీమా నాయక్ తోపాటు మరో ఎమ్మెల్యే బుధవారం ఉదయం బెంగళూరుకు వచ్చారు. తాము బీజేపీతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోలేదని భీమా నాయక్ స్పష్టం చేశారు. మొబైల్ కు ప్రాబ్లం రావడంతోనే పార్టీ లీడర్లతో తాను కాంటాక్ట్ లో లేనని ఆయన చెప్పారు.

మా ఎమ్మెల్యేలు మా వెంటే: కేసీ వేణు గోపాల్

బీజేపీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ పార్టీని విడిచిపోరని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. కర్ణాటక రాజకీయాల్లో కొనసాగుతున్న డ్రామాకు గురువారం సాయంత్రానికి తెర పడుతుందన్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. బీజేపీ చేస్తున్న ఈ ప్రయత్నాలు జాతీయ స్థాయిలో ఆ పార్టీకి చెడ్డ పేరు తీసుకువస్తాయని వేణు గోపాల్ చెప్పారు. కాగా, సంకీర్ణ ప్రభుత్వానికి మంగళవారం ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు నగేశ్, ఆర్.శంకర్ మద్దతు ఉపసంహరించుకున్నారు. ఇది చాలా చిన్న విషయమని జేడీ(ఎస్) చీఫ్, మాజీ ప్రధాని హెచ్ డీ దేవె గౌడ అన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో బీజేపీపై కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య మండిపడ్డారు. అవమానకర రీతిలో బీజేపీ రాజకీయాలు చేస్తోందన్నారు. కుమారస్వామి ప్రభుత్వాన్ని కూలదోయాలన్న ఆలోచన తమకు లేదని బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు చెప్పారు. సంకీర్ణ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీలేదని సీనియర్ కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ నుంచి 11 మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్ లో ఉన్నట్లు మీడియాలో ప్రచారంతో కాంగ్రెస్, జేడీ(ఎస్) నేతలు అప్రమత్తమయ్యారు.

నో టెన్షన్: కుమారస్వామి

తాజా పరిణామాలను చూసి భయపడాల్సిందేమీ లేదని సీఎం కుమారస్వామి చెప్పారు. తనకు ఎలాంటి టెన్షన్ లేదన్నారు. చాలా ప్రశాంతంగా ఉన్నానన్నారు. 'అంతా అదుపులోనే ఉంది' అని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ ఫిరాయించబోరని చెప్పారు. ముంబై హోటల్లో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లోనే ఉన్నారన్నారు. వారు తిరిగి వచ్చి తనతో కలుస్తారన్న ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదని కుమారస్వామి చెప్పారు.



కుంభమేళా సందర్భంగా త్రివేణి సంగమంలో స్నానం చేస్తున్న భక్తులు

తొలిరోజున 2 కోట్ల 25 లక్షల మంది పుణ్యస్నానాలు

పులకించిన త్రివేణి

- మకర సంక్రాంతి షాహీ స్నాన్‌తో ప్రారంభమైన అర్ధ కుంభమేళా
- హెలికాప్టర్‌తో రెండు గంటలపాటు పూలజల్లు


ప్రయాగ్‌రాజ్(అలహాబాద్)/లక్నో: మకర సంక్రాంతి రోజున హిందువుల పవిత్ర ఉత్సవం అర్ధ కుంభమేళా మొదలైంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో గంగ, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో మంగళవారం తెల్లవారుజామున మొదటి షాహీ స్నాన్ ప్రారంభమైంది. సాయంత్రం పొద్దుమునిగే వరకు కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. 'హర హర గంగే' నినాదాలతో కుంభమేళా ప్రాంగణం మారిమోగింది. తొలిరోజు 2.25 కోట్ల మందికిపైగా హాజరయ్యారని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ చెప్పారు. 50 రోజులపాటు కొనసాగే ఈ పవిత్ర పండుగ మార్చి 4 ముగుస్తుంది.

13 అఖాడాలతో ప్రారంభం

13 అఖాడా (ఏడు శైవ, మూడు వైష్ణవ, రెండు ఉదాసీన్, ఒక సిక్కు)లకు చెందిన సాధువులతో తొలి షాహీ స్నాన్ ప్రారంభమైంది. తర్వాత భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. ఈ ఘట్టం మొదలు కాగానే హెలికాప్టర్ నుంచి కురిపించిన పూలజల్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దాదాపు 2 గంటలపాటు ఇది కొనసాగింది. మరోవైపు గతంలో ఎన్నడూ లేనంతగా కుంభమేళాకోసం యూపీ ప్రభుత్వం రూ. 7 వేల కోట్లు కేటాయించింది. 12 కోట్ల నుంచి 15 కోట్ల వరకు భక్తులు హాజరవుతారని అంచనా వేస్తోంది.

స్నానమాచరించిన స్మృతి

కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కూడా మంగళవారం పవిత్ర స్నానం ఆచరించారు. ఈ మేరకు ఫొటోను ట్వీట్ చేశారు. గంగా మాతకు నమస్కరిస్తూ "హర హర గంగే" అని ఫొటో కాప్షన్ ఇచ్చారు. ఎంపీ సాక్షి మహరాజ్ కూడా తొలి రోజు స్నానమాచరించారు.



కుంభమేళాలో మంత్రి స్మృతి ఇరానీ నదీస్నానం



విశేషాలివీ...

- చరిత్రలో తొలిసారిగా ట్రాన్స్ జెండర్లు కుంభమేళాలో పాల్గొన్నారు. కాషాయ, ఎరుపు రంగు చీరలు ధరించి వచ్చి, త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు.
- భక్తుల కోసం 5.5 కిలోమీటర్ల మేర 35 స్నానఘట్టాలు ఏర్పాటు చేశారు.
- కుంభమేళా చరిత్రలో అక్షయ్ వట్, సరస్వతి కూప్‌ల వద్ద పూజలు చేసుకునే అవకాశం కల్పించడం ఇదే తొలిసారి.
- లక్ష బయో పోర్టబుల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు.

2.25 కోట్ల మంది

మంగళవారం 2.25 కోట్ల మంది భక్తులు స్నానం ఆచరించారు. మొదటి రోజు ఇంతమంది హాజరవడం ఓ రికార్డు. ఈ కార్యక్రమాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు సహకరించిన సందర్శకులు, సాధువులు, మత గురువులు, సాధారణ ప్రజలకు కృతజ్ఞతలు.

- ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్

ఇంత మంది హాజరవడం ఓ అద్భుతం. ఇది ఇండియా ప్రజల మధ్య ఉన్న ఐకమత్యాన్ని తెలుపుతోంది. ఇక్కడికి రావాలని 20 ఏళ్లుగా ప్రయత్నిస్తున్నా. ఇప్పటికి కుదిరింది.

- నెదర్లాండ్స్ కు చెందిన అన్నా హెర్త్నా

మమత ర్యాలీకి గాంధీలు డుమ్మా?

పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ లీడర్ల అభ్యంతరమే కారణం

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ఆధ్వర్యంలో ఈనెల 19న కోల్ కతాలో జరిగే మెగా ర్యాలీకి యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ హాజరయ్యే అవకాశాలు కనిపించడం లేదు. లోక్ సభ ఎన్నికలు రానున్న నేపథ్యంలో బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్యతను తెలియచేయడానికి మమతా బెనర్జీ ఈ ర్యాలీని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి బీజేపీయేతర ప్రతిపక్షాల లీడర్లందరికీ ఆహ్వానాలు కూడా పంపారు. ఈ ర్యాలీకి కాంగ్రెస్ తరపున సీనియర్ నేత మల్లికార్జున్ ఖర్గే హాజరుకానున్నారు. అయితే మమతా బెనర్జీతో రాహుల్ గాంధీ వేదిక పంచుకోవడానికి బెంగాల్ కాంగ్రెస్ నాయకులు ఇష్టపడటం లేదని తెలిసింది. దీంతో ప్రతిపక్షాల ర్యాలీకి



దూరంగా ఉండాలని సోనియా,రాహుల్ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అంతేకాక పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ లీడర్లను మమతా బెనర్జీ ఈ ర్యాలీకి ఆహ్వానించలేదట. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ వరకు అవసరమైతే లోక్ సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయడానికి సిద్ధమేనని రాష్ట్ర కాంగ్రెస్ లీడర్లు చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ర్యాలీకి దూరంగా ఉండాలని గాంధీ కుటుంబం దాదాపుగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ తో దూరంగా ఉంటున్న మమత

మమతా బెనర్జీ కొద్దికాలంగా కాంగ్రెస్ హైకమాండ్ తో దూరంగా ఉంటున్నారు. కిందటి నెలలో చెన్నైలో జరిగిన కరుణానిధి విగ్రహావిష్కరణ సభలో కాబోయే ప్రధాని అంటూ రాహుల్ గాంధీ పేరును డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ ప్రతిపాదించారు. ప్రతిపక్షాల నుంచి ప్రధాని రేసులో ఉన్నట్లు అందరూ భావిస్తున్న మమతకు ఈ ప్రతిపాదన నచ్చలేదు.

మాయావతి రాక కూడా అనుమానమే

మెగా ర్యాలీకి బీ.ఎస్పీ చీఫ్ మాయావతిని కూడా మమతా బెనర్జీ ఆహ్వానించారు. అయితే ఈ ఆహ్వానం పై ఆమె ఇప్పటివరకు స్పందించలేదు.



'ఆప్'తో పొత్తులపై మాట్లాడలేదు

సీనియర్ కాంగ్రెస్ నేత షీలా దీక్షిత్

న్యూఢిల్లీ: లోక్ సభ ఎన్నికలకు సంబంధించి ఆమ్ ఆద్మీ పార్టీతో తాము ఇప్పటివరకు ఎలాంటి చర్చలు జరపలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం షీలా దీక్షిత్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఆప్ మధ్య పొత్తుకు సంబంధించిన ఊహాగానాలు వచ్చిన నేపథ్యంలో ఢిల్లీ పీసీసీ చీఫ్ అజయ్ మాకెన్ తాజాగా పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో షీలా దీక్షిత్ ను కాంగ్రెస్ చీఫ్ రాహుల్ నియమించారు. షీలా దీక్షిత్ ను ఢిల్లీ పీసీసీ చీఫ్ గా నియమించడంతో ఆప్ తో కాంగ్రెస్ పొత్తుకు రూట్ క్లియర్ అయిందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



ఎద్దు.. మనిషి.. సై!

తమిళనాడు వ్యాప్తంగా జోరుగా జల్లికట్టు

మధురై: జల్లికట్టు పోటీలు తమిళనాడు వ్యాప్తంగా జోరుగా కొనసాగుతున్నాయి. రంకెలు వేస్తూ దూసుకువచ్చే ఎద్దులకు ఎదురు వెళ్లి వాటిని నిలువరించేందుకు పోటీదారులు ఉత్సాహం చూపుతున్నారు. సంక్రాంతి నేపథ్యంలో వారం నుంచి ఈ పోటీలు వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. బుధవారం మధురై జిల్లాలోని అవనియపురం, పాలమేడు తదితర గ్రామాల్లో పోటీలు నిర్వహించారు. ఇరువైపులా జనం.. వారి మధ్య నుంచి వందల సంఖ్యలో ఎద్దులు దూసుకు వస్తుండగా వాటిని ఎదుర్కొనేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ క్రమంలో అవనియపురంలో 43 మంది, పాలమేడులో 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. గురువారం మధురై జిల్లాలోని అలంగనల్లూర్‌లో జరిగే అతిపెద్ద జల్లికట్టు పోటీలకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎనిమిది రౌండ్లలో జరిగే ఈ పోటీల్లో ఒక్కో రౌండ్‌లో 100 మంది వరకు పాల్గొంటారు. తొలి రౌండ్‌లో ఎద్దులను దీటుగా ఎదుర్కొన్నవాళ్లు తర్వాతి రౌండ్‌లో తలపడతారు. విజేతలకు బంగారు నాణేలు, టీవీలు, బైక్‌లు, కార్లు బహుమతులుగా అందజేస్తారు.

కెన్యాలో టెర్రరిస్టు దాడి

నైరోబి: కెన్యా రాజధాని నైరోబీలో టెర్రరిస్టులు విరుచుకుపడ్డారు. ఓ హోటల్‌లోకి చొరబడి బాంబు దాడులు, కాల్పులకు తెగబడ్డారు. దీంతో 14 మంది చనిపోగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. చనిపోయిన వారిలో పలువురు విదేశీయులు కూడా ఉన్నారు. తర్వాత భద్రతా దళాలు రంగంలోకి దిగి టెర్రరిస్టులను హతమార్చాయి. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నైరోబిలోని వెస్ట్‌లాండ్స్‌లో 'డసిట్ డీ2' కాంప్లెక్స్ లోకి అల్ షబాబ్ ఇస్లామిక్ మిలిటెంట్ గ్రూప్ టెర్రరిస్టులు చొరబడ్డారు. నలుగురు నల్ల దుస్తులు ధరించిన దుండగులు, భారీగా ఆయుధాలతో లోపలికి రావడం సీసీటీవీల్లో రికార్డయింది. హోటల్, రెస్టారెంట్, స్థానిక, అంతర్జాతీయ ఆఫీసులు ఉన్న ఆ కాంప్లెక్స్ లోకి వచ్చి రావడంతోనే ఓ బ్యాంక్‌కు సమీపంలో ఉన్న మూడు కార్లపై బాంబులు విసిరారు. తర్వాత ఓ దుండగుడు హోటల్ లో లాబీలో తనను తాను పేల్చేసుకున్నాడు.

వద్దంటే పోతావా?

అయ్యప్పను దర్శించుకున్న కోడలిని కొట్టిన అత్త

తిరువనంతపురం: శబరిమల అయ్యప్పను దర్శించుకున్న ఇద్దరు మహిళల్లో ఒకరైన కనకదుర్గపై ఆమె అత్తింటివారు దాడి చేశారు. సంస్కృతి, సంప్రదాయాలను పక్కనపెట్టి.. వద్దన్నా వినకుండా అయ్యప్ప గుడిలోకి వెళ్లి ఆచారాలను మంటగలిపిందంటూ కర్రతో దాడిచేశారు. తలపై తీవ్ర గాయం కావటంతో దుర్గ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. అయ్యప్పను దర్శించుకున్న తర్వా త ఆందోళకారులకు భయపడిన దుర్గ కనిపించకుండా పోయారు. రెండు వారాల తర్వాత మంగళవారం ఉదయం ఇంటికి చేరుకున్నారు.

మరో ఇద్దరు మహిళలను అడ్డుకున్న భక్తులు

శబరిమల ఆలయ పరిసరాల్లో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యాభైఏళ్లలోపు వయసు ఉన్న ఇద్దరు మహిళలు ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించటంతో భక్తులు ఆందోళనకు దిగారు. కన్నూరుకు చెందిన రేష్మ నిషాంత్, శానిలా అనే ఇద్దరు మహిళలు బుధవారం ఉదయం ఏడుగంటల ప్రాంతంలో ఇరుముడి కట్టుతో పంబకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న భక్తులు పంబ బేస్‌క్యాంప్ వద్ద ఆందోళనకు దిగి మహిళలను అడ్డుకున్నారు.



బుధవారం ఆస్పత్రిలో చికిత్స తర్వాత విలేకరులతో మాట్లాడుతున్న కనకదుర్గ

రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని మోడీ విమర్శలు

శబరిమల విషయంలో పినరయి విజయన్‌ప్రభుత్వం మరీ దారుణంగా ప్రవర్తించిందని ప్రధాని మోడీ విమర్శించారు. కేరళలోని యూడీఎఫ్‌కూడా నాటకాలు ఆడుతోందని విమర్శించారు. మరోవైపు, జస్టిస్ ఇందు మల్హోత్ర లీవ్ కారణంగా శబరిమల అంశంపై సుప్రీం తీర్పుపై దాఖలైన పిటిషన్ల విచారణ ఆలసమయ్యేలా ఉందని సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్ చెప్పారు.



'ఆప్'కు మరో ఎమ్మెల్యే షాక్

పార్టీకి బల్ దేవ్ సింగ్ రాజీనామా

చండీగఢ్ : ఆమ్ ఆద్మీ పార్టీకి మరో ఎమ్మెల్యే షాకిచ్చారు. పంజాబ్ లోని జైతూ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే బల్ దేవ్ సింగ్ బుధవారం పార్టీకి రాజీనామా చేశారు. దీంతో పంజాబ్‌లో ఆప్ ఎమ్మెల్యేల సంఖ్య 18 కి తగ్గింది. ఆప్ లో నియంతృత్వ ధోరణులు పెరుగుతున్నాయని పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ కు పంపిన రాజీనామా లేఖలో బల్ దేవ్ సింగ్ ఆరోపించారు. దీనికి నిరసనగా బాధతో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. అన్నా హజారే ఉద్యమ స్ఫూర్తితో తాను రాజకీయాల్లోకి వచ్చానని బల్‌దేవ్ చెప్పారు.



మంచు దుప్పటిలో శ్రీనగర్

బుధవారం శ్రీనగర్‌లో మంచు విడవకుండా కురుస్తుండడంతో ఒంటికి గరం కోట్లు తొడిగి, చేతుల్లో గొడుగు పట్టుకున్నాకే ప్రజలు బయట కాలు పెడుతున్నారు. దాల్ లేక్ చుట్టూ పరుచుకున్న మంచు దుప్పటిలో జాగ్రత్తగా అడుగులు వేస్తున్న కాశ్మీరీలు. మరో 5 రోజులు శ్రీనగర్‌లో ఇదే పరిస్థితి ఉంటుందట.

బ్రెగ్జిట్‌కు నో



- ఓటింగ్ లో తిరస్కరించిన ఎంపీలు
- ప్రధాని థెరెసాకు ఘోర ఓటమి

లండన్: బ్రిటన్ ప్రధాని థెరెసా మే కు పార్లమెంట్‌లో మంగళవారం ఘోర ఓటమి ఎదురైంది. చరిత్రాత్మక బ్రెగ్జిట్ బిల్లుకు పెద్ద సంఖ్యలో ఎంపీలు నో చెప్పారు. సర్కారు ప్రతిపాదనపై జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు వ్యతిరేకంగా 432 మంది ఎంపీలు ఓటేయగా, అనుకూలంగా కేవలం 202 మంది ఓటేశారు. దీంతో 230 ఓట్ల తేడాతో బిల్లు తిరస్కరణకు గురైంది. బ్రిటన్ చరిత్రలోనే ఈ స్థాయి తిరస్కరణ ఏన్నడూ చూడలేదని నిపుణులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడుతున్నట్లు ప్రతిపక్ష లేబర్ పార్టీ నేత జెరెమీ కార్బిన్‌చెప్పారు. ఇందులో ఓడిపోతే థెరెసా పదవి నుంచి తప్పుకోవాల్సి వస్తుంది. అదే జరిగితే ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడుతుంది. కూటమి నుంచి వైదొలగాలన్న నిర్ణయానికి అనుగుణంగా ఈయూతో బ్రిటన్ గతంలోనే ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ పై ప్రతిపక్ష నేతలతో పాటు అధికార పార్టీ నేతలలోనూ వ్యతిరేకత ఎదురైంది. ప్రధాని థెరెసా మే కుదుర్చుకున్న ఒప్పందం బ్రిటన్‌కు నష్టం చేకూర్చేలా ఉందని మంత్రులు కూడా రాజీనామా చేశారు. సొంత పార్టీ ఎంపీలే థెరెసాపై అవిశ్వాసం పెట్టారు. గతేడాది ప్రవేశ పెట్టిన ఈ తీర్మానం వీగిపోయింది. దీంతో ఊపిరి పీల్చుకున్న థెరెసా బ్రెగ్జిట్ బిల్లుపై ఓటింగ్ ను వాయిదా వేశారు. తాజాగా జరిగిన ఓటింగ్ లో బిల్లు వీగిపోయింది.

ఇప్పటికీ అవకాశం ఉంది: మెర్కెల్

బ్రెగ్జిట్ డీల్ పై చర్చించేందుకు తాము ఇప్పటికీ సిద్ధంగానే ఉన్నామని జర్మనీ చాన్సలర్ ఎంజెలా మెర్కెల్ చెప్పారు. అయితే, పార్లమెంట్ తిరస్కరణ తర్వాత బ్రెగ్జిట్ బిల్లు విషయంలో ప్రధాని థెరెసా మే స్పందన కోసం వేచి చూస్తున్నామని మెర్కెల్ వివరించారు.

వద్దన్నందుకు కామెరాన్.. కావాలన్నందుకు థెరెసా?

2016లో బ్రెగ్జిట్ ప్రతిపాదనను అప్పటి ప్రధాని డేవిడ్ కామెరాన్ తిరస్కరించారు. ఈయూ కూటమి నుంచి వైదొలగడం మంచిది కాదని వాదించారు. రిఫరెండంలో మెజారిటీ వర్గం బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఓటేయడంతో ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ కామెరాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో బ్రెగ్జిట్‌ను సమర్థిస్తున్న థెరెసా మే ప్రధాని బాధ్యతలు స్వీకరించారు. ఈయూ కూటమితో చర్చలు జరిపి డీల్ అగ్రిమెంట్‌ను తయారుచేశారు. ఈ ఒప్పందం ఈయూ కూటమికే అనుకూలంగా ఉందని, ఇది అమలులోకి వస్తే బ్రిటన్ భారీగా నష్టపోవాల్సి వస్తుందని ఎంపీలు ఆరోపించారు. మంగళవారం జరిగిన ఓటింగ్ లో బ్రెగ్జిట్ డీల్‌కు వ్యతిరేకంగా ఓటేశారు. దీంతో బిల్లు ప్రతిపాదన పార్లమెంట్‌లో వీగిపోయింది. ప్రభుత్వంపై ప్రతిపక్ష లేబర్ పార్టీ అవిశ్వాస తీర్మానం పెట్టింది. ఈ నేపథ్యంలో థెరెసా పదవి కోల్పోయే పరిస్థితి ఏర్పడే అవకాశం లేకపోలేదు.



గోదా రంగనాథుల రథోత్సవం

భద్రాచలం, వెలుగు : గోదాదేవి రంగనాథులకు సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భోగి పండుగ రోజు గోదాదేవి రంగనాథుల కల్యాణం భక్తిప్రపత్తులతో చేశారు. కల్యాణం అనంతరం అర్చకులు గోదాదేవి, రంగనాథులను తీసుకొచ్చి రథంపై కూర్చోబెట్టి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రామనామ సంకీర్తనలు, వేదపండితుల మంత్రోచ్చారణ, కోలాటాల నడుమ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలులో ఐలోని మల్లన్న జాతర వైభవంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రభ బండ్లు ఆలయం చుట్టు తిరిగాయి. ఇవి జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఎల్కతుర్తి మండలం కొత్తకొండలో వీరన్న జాతర ఘనంగా జరిగింది. మంగళ, బుధవారాల్లో భక్తులు పోటెత్తారు. దీంతో కొత్తకొండ గ్రామం జనసంద్రమైంది.
- వరంగల్ అర్బన్, వెలుగు

సర్పంచుకు కోటి

యాదాద్రి జిల్లాలో జోరుగా ఎన్నికల ఖర్చు

బరిలోకి దిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు

హైవే పక్కనున్న పల్లెల్లో ఆర్భాటంగా ప్రచారం

యాదాద్రి, వెలుగు:

హైదరాబాద్ దగ్గరగా పల్లెల్లో పంచాయతీ ఎన్నికలు కాస్ట్లీ వ్యవహారంగా మారాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో విజయవాడ, వరంగల్ హైవేల పక్కనున్న గ్రామాలతో పాటు, యాదాద్రి పరిసర గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఒక్కో పంచాయతీలో అభ్యర్థులు 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఖర్చు చేసేందుకు రెడీ అవుతున్నట్టు సమాచారం. యాదాద్రి జిల్లాలో ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకున్నది. భూముల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు పట్ట పగ్గాలు లేకుండాఅయ్యాయి. ఈమధ్య బాగా సంపాదించిన వ్యాపారులే ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. దీంతో ఎవరూ ఖర్చుకు వెనుకాడడం లేదు. ఎలాగైనా అధికారాన్ని చేపట్టాలన్న ఆరాటంతో డబ్బును మంచినీళ్లలా ఖర్చుచేస్తున్నారు. పవర్‌లో ఉంటే రియల్ వ్యాపారంలో మరింత సంపాదించుకోవచ్చని ఆశ పడుతున్నారు. యాదాద్రి జిల్లాలో ఇటీవల పరిశ్రమలు కూడా దండిగా వచ్చాయి. ఫ్యాక్టరీలున్న చోట కూడా పోటీ జోరుగా సాగుతుంది. పరిశ్రమల నుంచి అందినకాడికి దండుకోవచ్చనే ఆశతో అభ్యర్థులు ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నారు.

ఖరీదైన పంచాయతీలు ఇవే..

జిల్లాలోని రెండు నేషనల్ హైవేలున్న మండలాల్లో హైవే వెంట, యాదాద్రి పుణ్యక్షేత్రం పరిసరాల్లోని గ్రామాల్లో ఎకరం భూమి రూ.1.50కోట్ల నుంచి రూ.2కోట్లు పలుకుతోంది. రియల్ వ్యాపారం జోరుగా జరుగుతోంది. చౌటుప్పల్, బీబీనగర్, భువనగిరి , భూదాన్ పోచంపల్లి, వలిగొండ, బొమ్మలరామారం తదితర మండలాల్లోని పంచాయతీల్లో, యాదగిరిగుట్ట పరిసర పంచాయతీల్లో ఒక్కో అభ్యర్థి రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు ఖర్చు చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. జనరల్ అభ్యర్థులకు రిజర్వ్ అయిన స్థానాల్లో అయితే, ఈ ఖర్చు మరింత ఎక్కువగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు ఈ మండలాల్లో రియల్ ఎస్టేట్ దందా చేసే బడా వ్యాపారులు సైతం వెనకుండి, ముందు ముందు తమ దందాకు ఏం ఇబ్బంది కావొద్దని పెద్ద ఎత్తున



ఖర్చు చేయిస్తున్నారు. అయితే, ఈ గ్రామపంచాయతీల్లో 2014లో జరిగిన గత ఎన్నికల్లో రూ.30లక్షల నుంచి రూ.50లక్షలకు పైగా ఖర్చు చేసిన అభ్యర్థులు ఎంతో మంది ఉన్నట్టు ప్రచారంలో ఉంది.

ప్రలోభాల జోరు

మూడో విడతలో ఎన్నికలు జరిగే మండలాల్లోనూ గురువారం నామినేషన్ల స్వీకరణ మొదలైంది. రెండో విడత ఎన్నికలు జరిగే మండలాల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ జరగాల్సి ఉంది. మొదటి విడతలో నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యి, పోటీలో ఉండే అభ్యర్థులు తేలిపోయారు. ఈ నెల 21న తొలి విడత ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆలేరు, బొమ్మలరామారం, తుర్కపల్లి, రాజాపేట, యాదగిరిగుట్ట మండలాల్లోని గ్రామాల్లో ప్రచారం ఊపందుకుంది. ప్రలోభాల పర్వం మొదలైంది. ఓటర్లు ఏది అడిగినా వారి కోరికలను తీర్చేందుకు అభ్యర్థులు వెనకాడడం లేదు. మందుతో జోరుగా విందులు చేస్తున్నారు. ఎన్నికల నాటిని డబ్బుల పంపిణీకి సిద్ధమవుతున్నారు.

ఇంటింటికీ చికెన్

సర్పంచ్ అభ్యర్థుల సంక్రాంతి గిఫ్ట్

సంగారెడ్డి, వెలుగు: సంక్రాంతి పండుగ సందర్భంగా పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకోవడానికి తెల్లవారగానే ఒక్కొక్క ఇంటికి రెండు కిలోల చికెన్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సంగారెడ్డి మండలంలో చిమ్నాపూర్, ఇస్మాయిల్‌ఖాన్‌పేట, కందిమండలం మామిడిపల్లి, కొండాపూర్ మండలంలోని మల్లెపల్లి, మల్కాపూర్,తొగర్‌పల్లి, పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం, గుమ్మడిదల మండలం నల్లవెల్లిలలో ఎలక్షన్ స్పెషల్ చికెన్ అంటూ పాకెట్లిచ్చారని సమాచారం. నారాయణఖేడ్, నాగల్‌గిద్ద, మనూర్‌మండలాల్లోని పలు పంచాయతీలలో పండుగ గిఫ్ట్‌ల పేర ఇంటింటికీ వెళ్లి కానుకలు ఇచ్చారు.

దారి కాచి.. డబ్బు దోచారు

- గన్‌తో బెదిరించి రూ.6 లక్షలకు పైగా చోరీ

పాల కుర్తి, వెలుగు : రాత్రి పూట దారి కాచి, గన్‌తో బెదిరించి డబ్బులు ఎత్తుకెళ్లిన సంఘటన కొడకండ్ల, పాలకుర్తి మండలాల్లో సంచలనం సృష్టించింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... పాలకుర్తికి చెందిన మద్యం వ్యాపారి కొడకండ్ల మండలంలోని మొండ్రాయి గ్రామంలో వైన్ షాపు నిర్వహిస్తున్నాడు. అందులో పాలకుర్తికి చెందిన కమ్మగాని రమేష్, మామిండ్ల యాకన్న, దేశబోయిన శోభన్‌పని చేస్తున్నారు. ఎప్పటిలానే మంగళవారం రాత్రి 9.55 గంటలకు సరుకు అమ్మిన డబ్బులు రూ. 6.70 లక్షలు తీసుకొని ముగ్గురూ ఒకే బైక్ పై పాలకుర్తికి బయలుదేరారు. కొడకండ్ల క్రాస్ రోడ్ దాటి రామన్నగూడెం శివారుకు చేరుకోగానే మొఖాలకు ముసుగు ధరించిన ఇద్దరు దుండగులు రోడ్డుకు ఇరువైపులా తాడు పట్టుకొని అడ్డుపడగా మరొకరు కర్రతో నిలబడి ఉన్నారు. భయాందోళనకు గురైన వారు బండి ఆపగానే మరో ఇద్దరు వచ్చి వారితో కలిశారు. వారి వద్ద ఉన్న గన్‌తో ఒక రౌండు పైకి, మరో రౌండు కిందికి కాల్పులు జరిపి 'అన్న' రమ్మంటున్నాడని బెదిరించారు. మరో దుండగుడు బైక్ పెట్రోల్ ట్యాంక్‌పై ఉన్న డబ్బుల బ్యాగును తీసుకొని పరుగెత్తాడు. మొత్తం ఐదుగురు దాడిలో పాల్గొన్నట్లు బాధిత యువకులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న వరంగల్ సీపీ రవీందర్, వెస్ట్ జోన్ డీసీపీ శ్రీనివాసరెడ్డి, వర్ధన్నపేట ఏసీపీ మధుసూదన్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని రాత్రంతా విచారణ జరిపారు. సంఘటన స్థలంలో రెండు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు ఉదయం 5 గంటల వరకు సంఘటన జరిగిన ప్రాంతాల్లోనే విచారణ చేశారు. నేరస్థులను వీలైనంత తొందరగా పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చోరీ ఘటన చుట్టుపక్క ప్రాంతాల్లో కలకలం రేపింది. విషయం తెలిసిన వెంటనే వరంగల్ కమిషనరేట్ డీసీపీ శ్రీనివాసరెడ్డి, ఏసీపీ మధుసూదన్‌స్పందించారు. సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. దుండగులు ఏ ప్రాంతానికి చెందినవారు, గన్ ఎక్కడిదని ఆరా తీస్తున్నారు.

కాకతీయ వైభవాన్ని చాటుతాం

వరంగల్ అర్బన్, వెలుగు : నాట్య, శిల్ప శాస్త్రాలు ఒకదానికొకటి సహకరిస్తూ పరస్పర అభివృద్ధికి దోహదపడ్డాయని న్యూయార్క్‌కు చెందిన మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్స్ సీనియర్ క్యూరేటర్ జాన్ గయ్ అన్నారు. హన్మకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో బుధవారం న్యూఢిల్లీకి చెందిన ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్, వరంగల్‌కు చెందిన కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సంయుక్తంగా శాస్త్ర ప్రయోగాలు అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. నాలుగో శతాబ్దం నుంచి ఈ రెండు శాస్త్రాలు ఒకదానికొకటి సహకరించుకుంటూ ముందుకు సాగాయని అన్నారు. విజయనగర కాలం వరకు ఈ అభివృద్ధి సాగిందన్నారు. వివిధ దేవాలయాల్లో చెక్కిన శిల్పాలలోని నృత్యభంగిమలను పరిశీలిస్తే ఈ విషయం బోధపడుతుందన్నారు. దీనికి సంబంధించి ఉదాహరణలతో సహా వివరించారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ద్వారా ప్రతి సంవత్సరం జనవరిలో కాకతీయుల కళా వారసత్వంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామన్నారు. కాకతీయ గణపతిదేవుని గజ సేనాపతి జయపసేనాని రచించిన నృత్య రత్నావళి అనే గ్రంథంలో పేర్కొన్న నాట్య విధానాలు, మార్పులు అనే అంశం ఆధారంగా ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ మాట్లాడుతూ ఈ ప్రాంత సంస్కృతి, వారసత్వాన్ని ఇలాంటి సదస్సులు ప్రపంచానికి చాటిచెబుతాయన్నారు. సదస్సుకు ప్రొఫెసర్ పాండురంగారావు అధ్యక్షత వహించగా హెరిటేజ్ ట్రస్టు పది సంవత్సరాలుగా చేసిన కార్యక్రమాలను వివరించారు. సదస్సులో నాగస్వామి, చూడామణి నందగోపాల్, డాక్టర్ విద్య తదితరులు పాల్గొన్నారు.



దేవాలయ పనుల పరిశీలన

లక్ష్మీ నర్సింహ్మస్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులను వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈవో గీతారెడ్డితో కలిసి పరిశీలించారు. గర్భాలయంలో ఏర్పాటు చేయదల్చిన నంది, ఏనుగు, సింహం విగ్రహాలను పరిశీలించారు. గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. యాదాద్రి, వెలుగు



తెలంగాణ బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్

హ్యాండ్‌బాల్ పోటీల విజేత తెలంగాణ

సిద్దిపేట, వెలుగు : సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న అండర్ 17 బాల బాలికల 64వ జాతీయ హ్యాండ్ బాల్ పోటీల విజేతగా తెలంగాణ జట్లు నిలిచాయి. బుధవారం ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో తెలంగాణ, ఢిల్లీ జట్టుపై విజయం సాధించింది. ఢిల్లీ బాలుర జట్టు 19 గోల్స్ చేయగా తెలంగాణ జట్టు 25 గోల్స్ చేసింది. బాలికల విభాగంలో తెలంగాణ జట్టు హర్యానాపై విజయం సాధించింది. పోటీలో హర్యానా బాలికల జట్టు 12 గోల్స్ చేయగా తెలంగాణ జట్టు 16 గోల్స్ చేసి విజయం సాధించింది. బాలుర విభాగంలో 3వ స్థానంలో పంజాబ్, 4వ స్థానంలో గుజరాత్, బాలికల విభాగంలో 3వ స్థానంలో ఢిల్లీ, 4వ స్థానంలో గుజరాత్ నిలిచాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన తెలంగాణ జట్లకు ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

పోటీల ముగింపు సందర్భంగా మెదక్ ఎంపీ కొత్త ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ సిద్దిపేటలో జాతీయ స్థాయి పోటీలు జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జాతీయస్థాయి క్రీడల్లో విజయం సాధించిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగి మంచి పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహం అందించడంలో సీఎం కేసీఆర్ ఎల్లవేళలా ముందుంటారని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ క్రిష్ణభాస్కర్, జేసీ పద్మాకర్, అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీతో తెలంగాణ బాలుర జట్టు

ప్రేమ కోసం యువతి... పరువు పోయిందని యువకుడి తండ్రి..

- పురుగుల మందు తాగి ఇద్దరి మృతి

ములుగు, వెలుగు : ప్రేమ కోసం యువతి, పరువు పోయిందని యువకుడి తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పాలంపేటలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, మృతుల బంధువుల వివరాల ప్రకారం... జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండ లం పాలంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోడ సుమలత, సంజీవయ్య దంపతులు హైదరాబాద్‌లో దినసరి కూలీలుగా చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు సింధూజ(18) పాలంపేటలోని బంధువుల ఇంట్లో ఉంటూ జవహర్‌నగర్ గ్రామంలోని మోడల్‌జూనియర్‌కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. పాలంపేటకు చెందిన కొండబత్తుల రమేష్, సింధూజ కొంతకాలంగా ప్రేమిం చుకుంటున్నారు. ఇద్దరివి వేర్వేరు కులాలు కావడంతో వీరి పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదు. సింధూజ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం సింధూజ ప్రేమ విషయం తెలియడంతో రమేష్ ఇంటి ముందు మృతదేహాన్ని ఉంచి బంధువులు ఆందోళన చేపట్టారు. దీంతో రమేష్ తండ్రి రాజు(55) పరువు పోయిందని మంగళవారం సాయంత్రం 6.30 సమయంలో పురుగుల మందు తాగారు. గమనించిన కుటుంబసభ్యులు ములుగు ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం అలముకుంది. భార్య రమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టైరు పంక్చరై, కారు పల్టీ

ప్రమాదంలో తల్లీ, తండ్రి , కుమార్తె మృతి ● గాయాలతో బయటపడిన కుమారుడు

సూర్యాపేట, కోదాడ, వెలుగు :

అనుకోని విధంగా జరిగిన రోడ్డు ప్రమాదం ఓ కుటుంబాన్ని చిదిమేసింది. తల్లిదండ్రులు, సోదరిని కోల్పోయిన బాలుడు ఒంటరిగా మిగిలాడు. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌లో నివాసముండే రావి మురళీకృష్ణ(45) వ్యాపారం చేస్తుండగా, ఆయన భార్య కవిత(35) హైదరాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ అమెరికాలో పని చేస్తోంది. వీరు సంక్రాంతి పండుగ కోసం ఈ నెల 13న కారులో కుమార్తె ధనుష(16), కుమారుడు యునిక్‌కృష్ణలతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లికి వెళ్లారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌కు బయలుదేరారు. కారును మురళీకృష్ణ నడుపుతున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ గ్రామ శివారులో ఒక్కసారిగా కారు ముందు టైర్ పేలిపోయింది. కారు వేగంగా ఉండడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి గాలిలోకి లేచింది. ఎదురుగా విజయవాడ వైపు వెళుతున్న మరో రెండు కార్లను ఢీకొని పల్టీలు కొడుతూ రోడ్డుకు అవతలి వైపు పడిపోయింది. ప్రమాదంలో కారులో ఉన్న కవిత, ధనుష ఇరువురు అక్కడికక్కడే మృతిచెందారు. కవిత తల, మొండెం విడిపోయాయి. యునిక్‌కృష్ణకు గాయాలయ్యాయి. పోలీసులకు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఉన్న మురళీకృష్ణను బయటకు తీశారు. తీవ్ర గాయాలవడంతో ఆయన మృతిచెందారు. యునిక్ కృష్ణను పట్టణంలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. ఎదురుగా వస్తున్న కార్లను ఢీ కొనడంతో అందులో ఉన్న రామాయంపేటకు చెందిన కంభంపాటి ఈశ్వర్, కలువ అనిరుధ్‌బాబు, స్వామిలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఓ ప్రైవేట్‌కంపెనీలో పనిచేసే వీరంతా కంపెనీ పని మీద విజయవాడకు వెళుతున్నారు. గాయాల పాలైన వారిని కోదాడలోని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న యునిక్‌కృష్ణ తనవారి గురించి అడుగుతుండడంతో ఏం చెప్పాలో తెలియక బంధువుల కన్నీరు, మున్నీరవుతున్నారు.





హాస్పటల్‌లో యునిక్‌కృష్ణ



కవిత, ధనూషల మృతదేహాలు

మరో ఘటనలో 18 మంది స్టూడెంట్స్‌కు గాయాలు

విహార యాత్రకు వెళ్లి వస్తున్న స్టూడెంట్స్ బస్సును లారీ ఢీకొట్టడంతో అందులో ఉన్న 18 మందికి తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చివ్వెంల మండల కేంద్రంలో జరిగింది. నల్గొండ జిల్లా చండూరు మండలంలోని పుల్లెంల గ్రామానికి చెందిన 60 మంది స్టూడెంట్స్ ట్రావెల్స్ బస్సులో మూడు రోజుల పర్యటనలో భాగంగా తిరుమల, వైజాగ్, అరకు, భద్రాచలం వెళ్లారు. ఈ నెల 14న రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో చివ్వెంల శివారులో ఎదురుగా వస్తున్న లారీ వీరి బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 18 మందికి తీవ్రంగా, మిగిలినవారికి స్వల్ప గాయాలయ్యాయి. నిఖిత, పావని, పారిజాత పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని హైదరాబాద్‌లోని ప్రైవేట్‌హాస్పిటల్‌కు తరలించారు.



ఒకప్పుడు పుష్కలంగా నీరుండి అత్యధికంగా వరి పంట పండిన మెతుకుసీమలో ఇప్పుడు చుక్కనీరు లేక పొలాలన్నీ బీళ్లయిపోతున్నాయి. సరైన వానల్లేక కరువుకాటకాలతో అల్లాడుతున్న రైతులకు ఎక్కడ బోరేసినా బొట్టు నీరు కూడా బయటపడని దుస్థితి నెలకొంది. సాగు నీటి బోరుకోసం ఎంత లోతు తవ్వినా నీరు రాకపోవడంతో ఏం చేయాలో తెలియక రైతులు బిక్కుబిక్కుమంటూ దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

బోర్లు అడుగంటె.. పొలాలు ఎండిపాయె

మెదక్, వెలుగు:

మెతుకుసీమలో భూగర్భజలాల పరిస్థితి ప్రమాదకరంగా తయారైంది. గడచిన వానాకాలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, జల సంరక్షణపై శ్రద్ధ పెట్టకపోవడం మూలంగా భూగర్భజలాలు అనూహ్యంగా దిగువకు పడిపోయాయి. ఈ పరిస్థితి ముఖ్యంగా మెదక్ జిల్లా రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 29 చోట్ల భూగర్భజల శాఖ ఆధ్వర్యంలో ఫీజోమీటర్లు ఏర్పాటు చేయగా తాజా గణాంకాల ప్రకారం 15 ప్రాంతాల్లో నీటి మట్టం 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు పడిపోయింది. 2018 డిసెంబరు నీటి మట్టాలు పరిశీలిస్తే కొల్చారం మండలం రంగంపేటలో అత్యధికంగా 40.85 మీటర్లు, తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌లో 36.95 మీటర్ల లోతుకు పడిపోవడం చూస్తే జిల్లాలో భూగర్భ జలాలు ఏ తీరుగా అడుగంటిపోతున్నాయో తెలుస్తోంది. గతేడాది డిసెంబర్‌తో పోల్చిచూస్తే రంగంపేటలో ఏడాదిలో అదనంగా 16.09 మీటర్ల లోతుకు, ఇస్లాంపూర్‌లో 9.54 మీటర్ల లోతుకు దిగజారడం గమనార్హం.



- పడిపోయిన భూగర్భజల మట్టాలు
- రంగంపేటలో అత్యధికంగా 40.85 మీటర్ల దిగువకు
- మెతుకుసీమలో పరిస్థితి దారుణం

'బోరు'మంటున్న రైతులు

వ్యవసాయరంగ ప్రాధాన్యత ఉన్న జిల్లాలో పెద్ద సాగునీటి ప్రాజెక్టులు లేవు. చిన్ననీటి వనరులైన చెరువులే పంటల సాగుకు ఆదరువు. అయితే చాలా ఏళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటుండటంతో చెరువులు నిండక ఆయకట్టు పొలాలు సాగు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో చాలా మంది రైతులు బోర్లు వేశారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 95 వేల బోర్లు ఉన్నాయి. వాటికింద దాదాపు లక్షన్నర ఎకరాల ఆయకట్టు ఉంటుంది. అయితే వానల్లేక పోవడంతో భూగర్భ జలాలు పడిపోయి బోర్లకింద సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదివరకు రెండు, మూడు ఎకరాలకు సాగునీరందించిన బోర్లు ఇప్పుడు ఎకరాకి కూడా నీరందించలేకపోతున్నాయి. అనేక బోర్లు గ్యాప్ ఇస్తుండగా, చాలా బోర్లు వట్టిపోయాయి. దీంతో గడిచిన ఖరీఫ్ సీజన్‌లో బోర్ల కింద సాగు చేసిన పంటలు చాలా వరకు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. యాసంగిలో పంటలు వేద్దామనుకున్న రైతులు 400 ఫీట్ల లోతు తవ్వినా చుక్కనీరు రావడంలేదు. బోర్లు ఫెయిలై వేలాది రూపాయలు నష్టపోతున్నారు. దీంతో వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఇళ్లలోనూ ఇబ్బందులే

నిత్య జీవితంలో వివిధ పనులకు అవసరమైన నీటి కోసం ఇళ్లలో, వ్యాపార, వాణిజ్య ప్రాంతాలలో తవ్విన బోర్లు జిల్లా వ్యాప్తంగా 50 వేలకు పైగానే ఉంటాయని అంచనా. భూగర్భ జలాలు పడిపోవడంతో బోర్లలో నీళ్లు తగ్గి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వచ్చేది ఎండాకాలం కావడంతో ముందు నీటి మట్టాలు మరింత లోతుకు దిగజారే అవకాశం ఉండటంతో జిల్లా వాసులందరికి నీటి బెంగ పట్టుకుంది. భవిష్యత్తులో పరిస్థితి ఎలా ఉంటుందోనని తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో భూగర్భ జలమట్టాల తగ్గుదల తీరు (మీటర్లలో)

ఎక్కడ	2017 డిసెంబరు	2018 డిసెంబరు
రంగంపేట	24.76	40.85
ఇస్లాంపూర్	27.41	36.95
టేక్మాల్	19.27	31.94
అల్లాదుర్గం	27.70	29.30
ఏదులపల్లి	16.86	26.95
చేగుంట	14.68	25.34
గూడూరు	21.99	25.00
నార్సింగి	19.21	26.00
మెదక్	16.05	25.85
చిలప్‌చెడ్	20.11	24.92
రామాయంపేట	17.79	24.20

స్పీడుగా షర్మిల కేసు దర్యాప్తు

హైదరాబాద్,వెలుగు:



- డీసీపీ రఘువీర్ ఆధ్వర్యంలో స్పెషల్ టీం
- వీడియో లింకులతో ఐపీ అడ్రస్‌లపై ఆరా.. యూట్యూబ్‌కు లేఖ

ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చెల్లెలు షర్మిల ఫిర్యాదుపై సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. సోషల్ మీడియాలో తనపై అసభ్యకరంగా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారంటూ సోమవారం ఆమె ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సీపీ ఆదేశాలతో డీసీపీ రఘువీర్ ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. షర్మిల ఇచ్చిన వీడియో లింకుల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్టు రఘువీర్ తెలిపారు. దాదాపు మూడు వీడియోల్లో అత్యంత అసభ్యకర వ్యాఖ్యలున్నాయన్నారు. ఆ లింకులను యూట్యూబ్ నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. యూఆర్ఎల్‌లతో ఐపీ అడ్రస్‌ల కోసం ఇప్పటికే యూట్యూబ్ యాజమాన్యానికి లేఖ రాసినట్టు చెప్పారు. ఐపీ అడ్రస్‌లు వచ్చిన తర్వాత నిందితులు ఎవరనేది తేలుతుందన్నారు. రెండు మూడు రోజుల్లో వారిని అరెస్ట్ చేస్తామన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 67తో పాటు ఐపీసీ 509 సెక్షన్ కింద కేసులు నమోదు చేశామన్నారు. 2014లోనూ షర్మిలపై ఇలాంటి ప్రచారాలే చేస్తే ముగ్గురిని అరెస్ట్ చేశామని ఆయన చెప్పారు.

'సర్పంచ్'కు అత్తాకోడళ్ల నామినేషన్లు

లింగంపేట, వెలుగు: కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని ఐలాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి అత్తాకోడళ్లు నామినేషన్ వేశారు. జంగంపల్లి ఉమారాణి (అత్త), జంగంపల్లి మయూరి (కోడలు) నామినేషన్లను దాఖలు చేశారు. ఇటీవల ఐలాపూర్ గ్రామపంచాయతీ నూతనంగా ఏర్పడింది. దాంతో తొలి సర్పంచ్‌గా పదవిని చేపట్టాలనే ఉద్దేశంతో అత్తాకోడళ్లులిద్దరూ నామినేషన్లు వేసినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. వీరితో పాటు అదే స్థానానికి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి ధనలక్ష్మి, మన్నె లక్ష్మి, సూర్న యశోద కూడా నామినేషన్లను దాఖలు చేశారు. అత్తాకోడళ్లల్లో ఎవరైనా నామినేషన్‌ని ఉపసంహరించుకుంటారా? లేక పోటీలో ఉంటారా? అనేది ఉపసంహరణకు చివరి రోజైన గురువారంతో తేలిపోనుంది.

నేటి నుంచి రంగాపూర్ ఉర్సు

అచ్చంపేట, వెలుగు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన జాతరల్లో రంగాపూర్ ఒకటి. మత సామరస్యానికి ప్రతీక నిరంజన్‌షా వలీ ఉర్సు. గురువారం నుంచి వారం రోజుల పాటు అత్యంత వైభవంగా ఈ జాతర కొనసాగుతుంది. అచ్చంపేట మండలంలోని రంగాపూర్‌లో జరిగే ఈ ఉత్సవాలకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి హిందూ ముస్లింలు తరలివచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఏటా ఈ ఉత్సవాలకు లక్ష మందికి పైగా భక్తులు హాజరవుతారు. కందూరు చేసి మేకలు, గొర్రెలు బలి ఇచ్చి భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఉర్సు రంగాపూర్‌గా పిలవబడుతున్న ఈ దర్గా వద్ద భక్తులు కేవలం ఉత్సవాల సమయంలోనే కాకుండా వివిధ రోజుల్లో దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ముఖ్యంగా అమ్రాబాద్ మండల ప్రజలు ఇళ్లలో ఏ శుభకార్యం చేసినా మొదట దర్గాను దర్శించుకుని కార్యక్రమాలు ప్రారంభిస్తారు.



- అర్ధరాత్రి గంధోత్సవం
- కులమతాలకతీంగా భక్తుల రాక
- ఒకేసారి ముగియనున్న ఉర్సు, ఉమామహేశ్వరం బ్రహ్మోత్సవాలు

అర్ధరాత్రి గంధోత్సవం

అచ్చంపేటలోని నారాయణప్రసాద్ ఇంటి నుంచి ఏటా గంధం తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఏటా మకర సంక్రాంతి మరుసటి రోజు ఉర్సు ప్రారంభమవుతుంది. అదే రోజు అర్ధరాత్రి గంధోత్సవం జరుగుతుంది. అచ్చంపేట మహబూబ్‌స్వామి దర్గాతో పాటు మన్ననూర్, అమ్రాబాద్, బల్మూర్, లింగాల, ఉప్పునుంతల, బొమ్మనపల్లి, పేనిమిళ్ల, నాగర్‌కర్నూల్, తెల్కపల్లి, కొల్లాపూర్, వనపర్తి, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకువస్తారు. బొమ్మనపల్లి నుంచి గంధాన్ని గుర్రంపై తీసుకురావడం ప్రత్యేక ఆకర్షణ. వివిధ గ్రామాల నుంచి తీసుకువచ్చిన గంధోత్సవాలు అర్ధరాత్రి వరకు రంగాపూర్‌కు చేరుకుంటాయి. మరుసటి రోజు నుంచి ఉర్సు ప్రారంభం అవుతుంది.

రెండూ ఒకేసారి ముగుస్తయ్..

దర్గా దర్శనం అనంతరం రంగాపూర్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో కొండపై వెలసిన ఉమామహేశ్వర క్షేత్రాన్ని భక్తులు దర్శించుకోవడం ఆనవాయితీ. ఉర్సుకు మూడు రోజుల ముందు ఈ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉర్సుకు వచ్చిన భక్తులు ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుంటారు. మత సామరస్యానికి ప్రతీకగా ఉండే ఈ ఉత్సవాలు ఒకే సారి ముగుస్తాయి. ఈ జాతరలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడుపుతోంది.



రైతుబంధు రాలేదని టవరెక్కిండు

మెదక్, వెలుగు: రెవెన్యూ అధికారుల తీరుపై ఓ వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. ఈ సంఘటన బుధవారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో జరిగింది. ఆత్మకూర్ తండాకు చెందిన రవి తనకు రేషన్‌కార్డు, రైతుబంధు సాయం మంజూరు చేసేదాకా కిందకు దిగనంటూ గంటపాటు పైనే ఉన్నాడు. పట్టాదారు పాసుపుస్తకం కోసం రెవెన్యూ అధికారులను ఎన్నిసార్లు కలిసినా లాభంలేకపోయిందన్నారు. పోలీసులు వచ్చి తాము సమస్య పరిష్కరిస్తామని టవర్ దిగాలని నచ్చజెప్పినా అతడు ససేమిరా అన్నాడు. చివరకు ఉమ్మడి మెదక్ జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడు మురళీయాదవ్ వచ్చి సముదాయించడంతో రవి టవర్ దిగాడు.

సెల్ఫ్ రిపోర్ట్ ఆన్‌లైన్‌లోనే!

హైదరాబాద్, వెలుగు:

డిగ్రీ అడ్మిషన్ల విధానంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సమూల మార్పులు తీసుకొస్తోంది. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తు విధానం, ఫీజుల చెల్లింపుల్లో నూతన సంస్కరణలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ తరహాలోనే డిగ్రీలో చేరే స్టూడెంట్లు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టు చేసే విధానాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి తీసుకురావాలని భావిస్తోంది.

ప్రైవేటు కాలేజీలకు చెక్

రాష్ట్రంలో 1,151 డిగ్రీ కాలేజీలున్నాయి. వాటిలో 923 ప్రైవేటు, 238 ప్రభుత్వ కాలేజీలున్నాయి. వీటిలో వివిధ కోర్సుల్లో నాలుగున్నర లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా విద్యార్థులకు కాలేజీల్లో సీట్లు కేటాయిస్తున్నారు. గతేడాది కేవలం 2.33 లక్షల సీట్లే భర్తీ అయ్యాయి. కాలేజీల్లో సీట్లు తక్కువగా నిండుతుండటంతో, వచ్చిన విద్యార్థులను వదులుకునేందుకు యాజమాన్యాలు ఇష్టపడటం లేదు. దోస్త్ ద్వారా విద్యార్థికి సీటు అలాట్ కాగానే, ఆ విద్యార్థి వేరే కాలేజీకి వెళ్లకుండా యాజమాన్యాలు ముందుగానే ఫీజులు వసూలు చేస్తున్నాయి. కన్వీనర్ కోటాలో సీట్లు పొందినా సరే, ఫీజు రీయింబర్స్ మెంట్ వచ్చిన తర్వాత తిరిగి ఇస్తామని చెబుతూ ఫీజులు కట్టించుకుంటున్నాయి. రెండో విడత కౌన్సెలింగ్‌లో వేరే కాలేజీలో సీటు వచ్చినా, ఫీజులు తిరిగి ఇచ్చేందుకు ఇబ్బందులు పెడుతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన ఉన్నత విద్యా మండలి, ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ తరహాలో సీట్ల కేటాయింపు చేయాలని భావిస్తోంది. విద్యార్థులు నేరుగా కాలేజీకి వెళ్లి రిపోర్టు చేయాల్సిన పని లేకుండా, ఆన్‌లైన్‌లోనే సెల్ఫ్ రిపోర్ట్ ఇస్తే సరిపోయేలా ఏర్పాట్లు చేస్తోంది. దీంతో విద్యార్థులు ముందుగా ఫీజులు చెల్లించే బాధ తప్పనుంది. దీన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేలా ఏర్పాట్లు చేస్తోంది.



- డిగ్రీ అడ్మిషన్లలో కొత్త విధానం
- ఉన్నత విద్యా మండలి ఏర్పాట్లు
- ప్రైవేటు కాలేజీలకు చెక్ పెట్టేందుకే..
- దరఖాస్తు విధానంలోనూ మార్పులు

వేరే కాలేజీలోనూ చేరొచ్చు

దోస్త్ ద్వారా తొలి దశ కౌన్సెలింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఇచ్చిన కాలేజీల్లో సీటు వస్తే తప్పనిసరిగా విద్యార్థులు ఆయా కాలేజీల్లోనే చేరాలి. కాలేజీ నచ్చకున్నా దాంట్లోనే కొనసాగాలి. దీనిపై భారీగా ఫిర్యాదులు వస్తుండటంతో అధికారులు పునరాలోచన చేస్తున్నారు. దరఖాస్తు విధానంలో మార్పులు తీసుకొస్తున్నారు. విద్యార్థి కోరుకున్న కోర్సులు వెంటనే వెబ్‌సైట్‌లో కనిపించేలా కసరత్తు చేస్తున్నారు. మరోవైపు దోస్త్ విధానంలో ఎదురైన సమస్యలను విద్యార్థుల నుంచి సేకరించిన అధికారులు, ఇకపై ఆ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో డిగ్రీ కాలేజీ అడ్మిషన్ల విధానంపై సమావేశం నిర్వహించి, పలు కొత్త నిర్ణయాలు తీసుకుంటామని ఉన్నత విద్యా మండలి అధికారి ఒకరు తెలిపారు.

ఐకేపీకే గిరాకెక్కువ

హైదరాబాద్, వెలుగు:

మహిళా సంఘాల (ఐకేపీ సెంటర్లు) ద్వారా ఈ ఏడాది భారీగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. 3,280 కేంద్రాల ద్వారా ఇప్పటికే 35 లక్షల టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసింది. ఈ నెల 20 లోపు ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని భావిస్తోంది. రైతులూ ఐకేపీ సెంటర్లలోనే ధాన్యం అమ్మేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది ఐకేపీ సెంటర్లు, సహకార సంఘాల బ్యాంకు సెంటర్లు, డీసీసీ బ్యాంకు సెంటర్లు, గిరిజన సొసైటీ సెంటర్లలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నా.. ఐకేపీ సెంటర్లలో సేవలు వేగంగా జరుగుతుండడంతో రైతులు అక్కడికే క్యూ కడుతున్నారు. ఆధార్ కార్డు లేకపోతే తప్ప కాంటా (తూకం) జరిగిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ అవుతుందని ఐకేపీ నిర్వాహకులు చెబుతున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత జిల్లా కేంద్రాలు దగ్గరగా ఉండడంతో పని సులభంగా, వేగంగా అయిపోతోందని చెబుతున్నారు. కాంటా అయ్యాక లారీ సామర్థ్యాన్ని బట్టి 500, 650, 700 బస్తాల వరకు లోడ్ చేసి.. మిల్లర్ ఐడీతో ఎంత మంది రైతుల ధాన్యమన్న దానిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

సన్న రకమూ ఐకేపీకే

సన్నబియ్యానికి మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.1,500 నుంచి రూ.1,600 వరకే ఇస్తుండడంతో రైతులు ఐకేపీ సెంటర్లవైపే మొగ్గుచూపుతున్నారు. ఐకేపీ సెంటర్లలో రూ.1,750 చెల్లిస్తున్నారు. రాష్ట్రం వచ్చాక 1,639 ఐకేపీల ద్వారా 11 లక్షల టన్నుల ధాన్యాన్ని కొన్న ప్రభుత్వం.. క్రమంగా సెంటర్లు, కొనుగోలు చేసే ధాన్యాన్ని పెంచుతూ వస్తోంది. గత ఏడాది 2,716 సెంటర్లలో 18.26 లక్షల టన్నుల ధాన్యం కొనగా, ఈ ఏడాది సెంటర్లను 3,280కి పెంచగా.. ఇప్పటికే 35 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రికార్డు సృష్టించింది. ఈ ఐదేళ్లలో ఐకేపీ సెంటర్ల ద్వారా జరుగుతున్న కొనుగోళ్లు మూడు రెట్లు పెరిగాయి.




- భారీగా ధాన్యం కొనుగోళ్లు
- 3,280 కేంద్రాల్లో 35 లక్షల టన్నుల సేకరణ
- ఐదేళ్లలో మూడు రెట్ల పెరుగుదల.. రెండ్రోజుల్లో డబ్బులు

కైట్ కోసం పరిగెడుతూ..

కారు ఢీకొని బాలుడి మృతి

సదాశివనగర్ వెలుగు: దారం తెగి కిందపడిపోతున్న కైట్ కోసం రోడ్డుపై పరిగెడుతున్న బాలుడిని కారు ఢీకొట్టడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేశ్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోలవోయిన లక్ష్మణ్ కుమారుడు ధర్మాపురి (10) మిత్రులతో కలిసి సదాశివనగర్ జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డులోని బస్టాండ్ వద్ద గాలిపటాలు ఎగురవేస్తున్నాడు. ఈ క్రమంలో కైట్ దారం తెగిపోవడంతో కంగారు పడ్డ బాలుడు దాన్ని పట్టుకునేందుకు జాతీయ రహదారిపైకి పరిగెత్తాడు. అదే సమయంలో నిజామాబాద్ నుండి కామారెడ్డివైపు వేగంగా వెళ్తున్న కారు బాలుడిని ఢీకొట్టింది. దీంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకు దోస్తులతో ఆడుకుంటూ, కైట్ ఎగురవేసిన చిన్నారి ఒక్కసారిగా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.



ఇరాక్ బాధితుల కుటుంబ సభ్యులతో బసంత్ రెడ్డి

మావోళ్లను రప్పియ్యండ్రి సారూ..

ప్రభుత్వానికి ఇరాక్ బాధిత కుటుంబాల వేడుకోలు

నిజామాబాద్, వెలుగు: నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయి ఇరాక్‌లో చిక్కుకుని అష్టకష్టాలు పడుతున్న 15 మంది నిజామాబాద్ జిల్లావాసులను తిరిగి ఇండియాకు రప్పించేందుకు ప్రభుత్వం సాయం చేయాలని బాధితుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు. బుధవారం తెలంగాణ గల్ఫ్ కల్చరల్ సొసైటీ, గల్ఫ్ బాధితుల సంక్షేమ సంఘం ప్రతినిధి పాట్కూరి బసంత్ రెడ్డి నేతృత్వంలో నిజామాబాద్‌లోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధితుల కుటుంబ సభ్యులు మాట్లాడారు. నాలుగైదు నెలల నుంచి తమ కుటుంబ సభ్యులు ఇరాక్ దేశంలో అవస్థలు పడుతున్నారని తెలిపారు. లక్షలు ఖర్చు పెట్టుకొని ఇరాక్ పోతే ఇంతటి కష్టాలెదురవుతాయని అనుకోలేదని వాపోయారు. తెలంగాణ గల్ఫ్ కల్చరల్ సొసైటీ ప్రతినిధి బసంత్ రెడ్డి మాట్లాడుతూ బాధితులంతా పేద కుటుంబానికి చెందినవారేనని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇరాక్‌లో ఉన్న తమ ప్రతినిధుల సహాయంతో పోలీసుల వద్ద ఉన్న బాధితుల పాస్‌పోర్టును తిరిగి వారికి ఇప్పించినప్పటికీ, వారి తరపున జరిమానా చెల్లిస్తే తప్ప ఇండియాకు రాలేని పరిస్థితి ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి బాధితుల పక్షాన వారు ఇరాక్ ప్రభుత్వానికి చెల్లించాల్సిన జరిమానాను చెల్లించి, ప్రభుత్వ ఖర్చుతో వారిని ఇండియాకు రప్పించాలని కోరారు.

అడిగేటోళ్లు లేకనే..

ప్రజలకు మెమొరీ తక్కువని ప్రభుత్వాల ఉద్దేశం. ఎప్పుడు జరిగిన సంఘటనలను అప్పుడే మర్చిపోతారని అనుకుంటాయి. జనం ఎవరి పనిలో వాళ్లు పడిపోతే తాము ఎంత పెద్ద తప్పులు చేసినా పట్టించుకోరని, వాటిపై ఆసక్తి చూపరని ధీమాగా ఉంటాయి. ఇది నిజమే కదా అని కూడా ఒక్కోసారి అనిపిస్తుంది. సర్కార్లు అనుసరించే అణచివేత ధోరణులను జనం గట్టిగా నిరసించకపోవటం, నిలదీయకపోవటం వల్లే అవి పౌర హక్కుల కార్యకర్తల పట్ల మరింత అమానుషంగా ప్రవర్తిస్తున్నాయి. గతేడాది పది మంది యాక్టివిస్టులను, లాయర్లను అదుపులోకి తీసుకొని అనంతరం జైలు పాలు చేశారు. దర్యాప్తులు, కోర్టుల్లో విచారణల పేరుతో నేటికీ చిత్రహింసలకు గురిచేస్తున్నారు. వాళ్ల బాధలను పబ్లిక్ తమ కష్టాలుగా భావించట్లేదు. వారికి అండగా నిలవట్లేదు. వారికోసం పోరాడట్లేదు. పౌర హక్కుల కార్యకర్తలను అరెస్ట్ చేస్తే ఆ వార్తలకు ప్రాధాన్యత ఇచ్చి మొదటి పేజీల్లో హెడ్‌లైన్స్ పెట్టిన పత్రికలు ఆ తర్వాత ఎందుకో వాళ్లకు పెద్దగా సపోర్ట్ ఇవ్వలేదు. జనం, మీడియా చేతులెత్తేయటంతో గవర్నమెంట్ రెచ్చిపోయింది. ఆ ధైర్యంతోనే పోలీసులు, వాళ్ల వెనకున్న పొలిటికల్ మాస్టర్లు ఇప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) స్టూడెంట్లపై పడ్డారు. కన్హయ్య కుమార్ తదితర విద్యార్థి నేతలపై ఢిల్లీ పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. యాంటీ ఇండియా స్లోగన్లు చేశారనే ఆరోపణలతో దేశద్రోహ నేరం కింద మూడేళ్ల కిందట కేసు పెట్టిన పోలీసులు ఇన్నాళ్లూ తాపీగా కూర్చొని ఇప్పుడు హడావుడి చేస్తుండటం గమనార్హం. లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో పాలకులే ఈ పని చేయించి ఉంటారనే విమర్శలు వస్తున్నాయి. రాజకీయ నాయకులు ఆడుతున్న ఈ కొత్త నాటకం వల్ల ఏడాదికి పైగా జైళ్లలో మగ్గుతున్న మానవ హక్కుల కార్యకర్తల విషయం పూర్తిగా తెరమరుగు కానుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పది మంది యాక్టివిస్టుల్లో తొమ్మిది మంది కారాగారం నుంచి స్వేచ్ఛ పొందేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఒంటరిగా చేస్తున్న ఈ న్యాయ పోరాటంలో ఒక్కోసారి అలిసిపోతున్నారు. యావద్దేశం దృష్టి ఎప్పటిలాగే ఈ పౌర హక్కుల కార్యకర్తల నుంచి వేరే అంశాల వైపుకు మళ్లింది. రానున్న జనరల్ ఎలక్షన్ల కోసం ఏర్పడనున్న రాజకీయ కూటమిపై నిలిచింది. అట్టడుగు వర్గాల ప్రజల హక్కుల కోసం పరితపించినవారిని మర్చిపోయి ప్రజానీకం ఎన్నికల వేడిలో, ఓట్ల రాజకీయంలో మునిగిపోవటం విచిత్రం, వింత ప్రజాస్వామ్యం. జేఎన్‌యూ విద్యార్థులపై ఛార్జిషీట్ వేసిన నేపథ్యంలో హక్కుల కార్యకర్తల అరెస్ట్ వల్ల తలెత్తిన పరిణామాలు, వాళ్ల ఫ్యామిలీలు పడుతున్న ఇబ్బందులను గుర్తుచేసుకోవటం సమంజసం. జనం జీవితాలను, వారి బతుకు దెరువును కేంద్రం ఎలా దెబ్బతీస్తోందో హక్కుల కార్యకర్తల బాధలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంలో న్యాయ వ్యవస్థకు, అధికార యంత్రాంగానికి పెద్ద తేడా ఏమీ లేదు. ఇలాంటి నగ్న సత్యాలను సోషల్ మీడియాలో పెట్టినందుకు సుధా భరద్వాజ ట్విట్టర్ అకౌంట్‌ని ప్రభుత్వం బ్లాక్ చేసింది. ప్రజలు తమ బాధలను ప్రపంచానికి చెప్పుకునే ప్రతి మార్గాన్నీ పాలకులు ఇలా నిర్దాక్షిణ్యంగా మూసేస్తుంటే జనం బతికున్నా శవాలతో సమానమే. జైలు జీవితం వ్యక్తులను సమాజానికి తాత్కాలికంగా లేదా శాశ్వతంగా దూరం చేస్తోంది. అంతేకాదు. ఆ పర్సన్స్‌కి సంబంధించిన స్ఫూర్తి కలిగించే విషయాలు, అనుభవాలు, అభిప్రాయాలు, సందేశాలు సొసైటీలోకి వెళ్లే వీలు కూడా లేకుండా పోతోంది. ఇది పూర్తిగా అవగాహన కావాలంటే పౌర హక్కుల కార్యకర్తలు రోనా విల్సన్, వెర్నాన్ గాన్‌సేల్వ్స్ కుమారుడు సాగర్ అబ్రహం, షోమా సేన్ కూతురు కోయెల్ సేన్ ఫేస్‌బుక్ పేజీలు చూస్తే సరిపోతుంది. కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా హక్కుల కోసం గొంతెత్తినవారిపై అణచివేతలు జరుగుతూనే ఉన్నాయి. అవిప్పుడు మోడీ పాలనలో ముదిరాయి. 2018 జూన్ 6న ఐదుగురు కార్యకర్తలను అరెస్ట్ చేయటాన్ని ఫెరీరా, గోన్‌సాల్వ్స్ ఖండించటంతో వాళ్లిద్దర్నీ జైల్లోకి నెట్టారు. భరద్వాజ్, గాడ్లింగ్‌లకూ ఇదే ఎదురైంది. సర్కారు నిర్ణయాలను ప్రశ్నించినా, ఖండించినా కత్తి కడుతున్నారు. జనం కోసం జైలుకెళ్లినవారికి మద్దతుగా నిలవటం సోషల్ మీడియా పరిధిని దాటాలి. ఇది మౌనంతో సాధ్యం కాదు. ఇతర మార్గాలు తక్షణావసరం.






- అజీజ్ అష్రఫ్ ('ది వైర్' సౌజన్యంతో)

జేఎన్‌యూ కేసు పూర్వాపరాలు

2016 ఫిబ్రవరి 9:	పార్లమెంటుపై దాడి కేసులో సూత్రధారి అఫ్జల్ గురు వర్ధంతి రోజున అతనిని పొగుడుతూ జేఎన్‌యూ క్యాంపస్‌లో ర్యాలీ
ఫిబ్రవరి 10:	దీనిపై క్రమశిక్షణా విచారణకు జేఎన్‌యూ యంత్రాంగం ఆదేశం.
ఫిబ్రవరి 11:	బీజేపీ ఎంపీ మహేశ్ గిరి, ఆరెస్సెస్ విద్యార్థి విభాగం ఏబీవీపీ ఫిర్యాదులను స్వీకరించి కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు
ఫిబ్రవరి 12:	కన్హయ్య కుమార్ అరెస్ట్.. భారీ ఆందోళనలకు దిగిన విద్యార్థులు
ఫిబ్రవరి 15:	కన్హయ్య కేసు విచారణకు ముందు పాటియాలా హౌస్ కోర్టులో విద్యార్థులు, పాత్రికేయులు, అధ్యాపకులను దేశ వ్యతిరేకులుగా పేర్కొంటూ న్యాయవాదుల దాడి.
ఫిబ్రవరి 25:	తీహార్ జైలుకు కన్హయ్యను పంపిన కోర్టు
మార్చి 3:	కన్హయ్యకు ఆరు నెలల బెయిలు
ఆగస్టు 26:	కన్హయ్య, ఉమర్ ఖలీద్, అనిర్బన్‌లకు సాధారణ బెయిలు
2019 జనవరి 14:	కేసులో అభియోగపత్రం దాఖలు చేసిన పోలీసులు

ఏమన్నారంటే



ఫస్ట్‌లవ్ ఫెయిలైంది!

నైన్త్ క్లాస్‌లో ఉన్నప్పుడు నా సీనియర్‌తో లవ్‌లో పడ్డా. ఎగ్జామ్స్ టైమ్‌లో అతను నాకు దూరమయ్యాడు. ఎంతగా ఏడ్చానో ఇప్పటికీ గుర్తుంది. ఆ ఫెయిల్యూర్ తర్వాతే తెలిసింది అది ప్రేమ కాదని.

- తాప్సీ పన్ను, నటి.



అటల్ నాటి విలువలు లేవిప్పుడు

బీజేపీ పూర్తిగా చెడిపోయింది. నాడు అటల్ బిహారీ వాజపేయి పాటించిన విలువలేవీ లేవిప్పుడు. అందుకే పార్టీకి రాజీనామా చేశా. అమిత్‌షాకు రాసిన లెటర్‌లోనూ ఇదే విషయం చెప్పా.

- గెగాంగ్ అపాంగ్, అరుణాచల్‌ప్రదేశ్ మాజీ సీఎం.



ఆ విధంగా ముందుకు పోతాం

రాజకీయాలంటేనే చాలెంజ్‌లతో కూడిన వ్యవహారం. వ్యూహాత్మకంగా ముందుకెళ్లాలి. ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు పెట్టుకోవాలన్న ఆలోచన ప్రస్తుతానికైతే లేదు. టైమ్‌ను బట్టి నిర్ణయాలు తీసుకుంటాం.

- షీలా దీక్షిత్, ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్.



ఆమె పేరు అనీష

నాకు పెండ్లి కుదిరిందని వస్తోన్న వార్తలు నిజమైనవే. లైఫ్‌లో బిగ్గెస్ట్ ట్రాన్సిషన్ ఇదే. హైదరాబాద్‌కి చెందిన ఆ అమ్మాయి పేరు అనీష. అతి త్వరలోనే వెడ్డింగ్ డేట్, ఇతర వివరాలు చెబుతా.


- విశాల్, నటుడు.



ఊచకోతతో నాకేం సంబంధం?

కోర్టులో సజ్జన్‌కుమార్‌కు పడిన శిక్షపై నేనేమీ మాట్లాడను. సిక్కుల ఊచకోత కేసుల ఎఫ్ఐఆర్‌లో నా పేరు లేదు. అయినాసరే, మీడియా పదేపదే నన్ను ప్రస్తావించింది. ఎవరో ఏవో ఆరోపణలు చేస్తే పేర్లు వేసేస్తారా?

- జగదీష్ టైట్లర్, కాంగ్రెస్ నాయకుడు.



నోరు తెరిస్తే.. కోటాను కోట్లు..

వేల కోట్లు. లక్ష కోట్లు. కోటాను కోట్లు. ఇప్పుడిదో ఊత పదం అయింది. ఏ నలుగురు కల్సి మాట్లాడుకున్నా కోట్ల రూపాయల ముచ్చట లేకుండా చర్చ ముందుకు సాగదు. స్కాంలు గురించి అయినా, స్కీంల గురించి అయినా వందల వేల కోట్ల రూపాయల మాట నోట్లో నుండి రావాల్సిందే. లక్షరూపాయలు, పది లక్షల ఊసే లేదు. అదో పెద్ద అమౌంటే కాదు అన్నట్లుంది పరిస్థితి. మన దగ్గర రియల్ బూమ్ హయాంలోనూ ఏ ఊళ్లో చూసినా కోట్ల ముచ్చటే. దానికి తోడు మొబైల్స్ వచ్చిన తర్వాత ఈ కోట్ల ముచ్చట మరింత పెరిగింది. నూటికి 80 మందికి కోట్ల రూపాయల మూట బరువెంతో కూడా తెలియదు. అయినా కోట్ల గురించిన మాట లెక్కనేనన్ని సార్లు పలుకుతున్నాం.

ఏదైనా పండగ వస్తేవందల కోట్ల వ్యాపారం జరిగిందనేది వార్త. కోళ్ల పందాల విలువ రెండు వేల కోట్ల పైమాటేనని, న్యూఇయర్ రోజున వేల కోట్ల మద్యం సేవించారని, దీపావళికి వందల కోట్ల పటాకులు కాల్చారని.. రకరకాలుగా వింటున్నాం. ఫలానా సిన్మా బాక్సాఫీసు వద్ద వారంలో వంద కోట్లు కొల్లగొట్టిందని అంటారు. వాస్తవంగా ఎంతొచ్చిందో ఐటీ అధికారులే చెప్పాలిమరి. కానీ అలాంటి లెక్కలేవీ బయటికొచ్చిన దాఖలాలు లేవు. ఇక పెద్దనోట్ల రద్దు సమయంలో లక్షల కోట్ల నల్లధనం బయట పడుతుందనే ప్రచారం జరిగింది. నల్లకుబేరుల జాబితా బయటపడనప్పటికీ జనంలో మాత్రం లక్షల కోట్ల రూపాయలు అనే మాట బలంగా నాటుకు పోయింది. మీడియా, మొబైల్ ఫోన్లు పెరిగాక కోట్ల మాట, కోట్ల స్కాం, కోట్ల వసూళ్లు అనేది సర్వ సాధారణ విషయం అయింది.

కుంభకోణం కోట్లలో ఉంటేనే క్రేజ్!

కుంభకోణం విలువ ఎన్ని వేల కోట్లు అయితే దానికంత బలం ఉంటుందనే మానసిక భావన వచ్చేసిందిప్పుడు. గతంలో పీవీ నర్సింహారావు క్యాబినెట్‌లో టెలికాం మంత్రిగా పనిచేసిన సుఖ్ రాం.. ఓ ప్రయివేటు కాంట్రాక్టర్ నుంచి మూడు లక్షల రూపాయల లంచం తీసుకున్నారని 1996లో కేసు నమోదు అయింది. చివరకు కోర్టు ఆయనకు ఐదేళ్ల జైలు శిక్ష వేసింది. తీర్పు వచ్చేనాటికి సుఖ్‌రాం వయస్సు 86 ఏండ్లు. బంగారు లక్ష్మణ్ బీజేపీ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు ఓ ఆయుధ డీలర్ల నుంచి లక్ష రూపాయల లంచం(అదికూడా పార్టీ ఫండ్‌గా) తీసుకున్నందుకు పదవి పోయింది. పెద్ద అమౌంట్లు కాకున్నా పై రెండు కేసులపై పెద్ద చర్చ జరిగింది. అసలీ కోట్ల మాట మొదట పుట్టిందెప్పుడో చూద్దాం. 1992 హర్షద్ మెహతా స్టాక్ మార్కెట్ కుంభకోణానికి పాల్పడ్డాడు. అప్పటికి దేశంలో చాలా మందికి స్టాక్‌మార్కెట్ లావాదేవీలతో సంబంధాలు ఉండేవికావు. అన్ని వేల కోట్ల రూపాయలు ఎట్లా మార్చారో కూడా తెలియక పోవచ్చు. కానీ వేల కోట్ల రూపాయలనే మాట బలంగా ముద్ర పడిపోయింది. ఆ తర్వాతి కాలంలో జరిగిన యూరియా, దాణా కుంభకోణాల విలువ వెయ్యి కోట్లకు దగ్గరగా ఉంది. జరిగిన ప్రచారంతో పోల్చితే ఆయా కేసుల్లో జరిగిన అవకతవకల విలువ తక్కువే. యూపీఏ హయాంలో వెలుగు చూసిన కోల్‌స్కాం, టెలికాం స్కాంల విలువ వేలు, లక్షల కోట్లలో ఉంటుందన్న ప్రచారం జరిగింది. అయితే ఆమేరకు సరైన ఆధారాలు చూపిండంలో ప్రాసిక్యూషన్ విఫలమైంది. వేల కోట్ల రూపాయల మాట లేకుండా రోజు గడవటం లేదు.

అన్నట్లు కోటి రూపాయలెప్పుడైనా చూశావా అని ఓ ముప్పైయేళ్ల యువకున్ని అడిగాను. అవునూ అన్నాడు. ఎక్కడ అంటే సొంతంగా కాదు కానీ... మీ సేవలో పనిచేసినప్పుడు అని చెప్పాడు. వాటి బరువెంత అంటే తడుముకోకుండా చెప్పిన మాట 13 కిలోలు అని. వెంటనే ఎలా చెప్పావు అంటే... కోటి రూపాయలు మన దగ్గర ఉండవు కదా. అందుకే అలా గుర్తుండిపోయిందన్నాడు.

- గొర్ల. బుచ్చన్న

లోకల్ పార్టీలదే హవా..

అటు బీజేపీ ఇటు కాంగ్రెస్ ఎన్ని ఎత్తుగడలతో ముందుకు పోతున్నా నాలుగైదు నెలల్లో జరిగే లోక్ సభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే కీలకం కాబోతున్నాయి. ఎన్నికలు జరిగే 543 నియోజకవర్గాల్లో 185 సెగ్మెంట్లలో గెలుపోటమును నిర్ణయించేది ప్రాంతీయ పార్టీలే. జాతీయ పార్టీల ప్రభావం ఇక్కడ నామమాత్రమే. ప్రాంతీయ దళపతుల అండలేనిదే జాతీయ పార్టీలు చేసేది ఏమీ ఉండదిక్కడ.



బీజేపీకి షాకిచ్చిన ఎస్పీ, బీఎస్పీ పొత్తు

మొత్తం 80 నియోజకవర్గాలున్న ఉత్తరప్రదేశ్ లో రెండు బలమైన ప్రాంతీయ పార్టీలు సమాజ్ వాది పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ జత కట్టి ఎన్డీయే కూటమికి షాక్ ఇచ్చాయి. దీనిని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ లాంటి వారు లైట్ గా తీసుకోవచ్చు కానీ యూపీ కులరాజకీయాలపై అవగాహన ఉన్న వారు ఈ పరిణామాన్ని సీరియస్ గానే తీసుకుంటున్నారు. బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న ఓం ప్రకాశ్ రాజ్ భర్ పార్టీ 'సుహేల్ దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్బీఎస్పీ) లీడర్లు కూడా ఎస్పీ, బీఎస్పీ పొత్తును తక్కువగా అంచనా వేయొద్దని బీజేపీని హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ పవర్ లో ఉండి కూడా కిందటేడాది జరిగిన మూడు ఉప ఎన్నికల్లో ఓడిపోవడాన్ని గుర్తు చేస్తున్నారు. అజిత్ సింగ్ నాయకత్వంలోని రాష్ట్రీయ లోక్ దళ్ పశ్చిమ యూపీకే పరిమితం. ఇక్కడ పెద్ద సంఖ్యలో జాట్ల ఓట్లే ఈ పార్టీకి పునాది. 2014 ఎన్నికల్లో మొత్తం 80 సీట్లలో 71 సీట్లు బీజేపీ గెలుచుకుంది. ఈసారి అన్ని సీట్లు రావడం అంత ఈజీ కాదంటున్నారు విశ్లేషకులు. కొత్త కూటమికి దాదాపు 57 నియోజకవర్గాల్లో గెలుపు అవకాశాలున్నాయన్నది ఒక అంచనా. ఈ అంచనా సంగతి ఎలాగున్నా యూపీలో బీజేపీ గెలుపు ఇక ఏమాత్రం నల్లేరు మీద నడక కాదన్నది మాత్రం వాస్తవం.




బీహార్ లోనూ ప్రాంతీయ పార్టీలదే హవా

40 సీట్లున్న బీహార్ లో కూడా ప్రాంతీయ పార్టీలే పెత్తనం చేస్తుంటాయి. ఇక్కడ ఎన్డీయే కూటమిలో నితీశ్ పార్టీ జేడీ(యు), పాశ్వాన్ పార్టీ లోక్ జనశక్తి పార్టీ (ఎల్జేపీ) ఉంది. ఈమధ్యే ఉపేంద్ర కుష్వాహా నాయకత్వంలోని రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ ఎన్డీయే కూటమికి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ తో జత కట్టింది. కొన్ని దశాబ్దాల పాటు బీహార్ ను శాసించిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) ప్రస్తుతం కాంగ్రెస్ కూటమిలో ఉంది. లాలూ ప్రసాద్ క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉండటంతో ఆయన చిన్న కుమారుడు తేజస్వి యాదవే పార్టీ వ్యవహారాలు చూస్తున్నారు. జేడీ(యు), ఎల్జేపీ, ఆర్జేడీ, ఆర్ ఎల్ ఎస్పీ లాంటి ప్రాంతీయ పార్టీలే బీహార్ లో కేండిడేట్ల తలరాతను మార్చబోతున్నాయి.

బెంగాల్ ను శాసిస్తున్న తృణమూల్ కాంగ్రెస్

పశ్చిమ బెంగాల్ ను తృణమూల్ కాంగ్రెస్ శాసిస్తోంది అంటే అతిశయోక్తి కాబోదు. ఫైర్ బ్రాండ్ గా ముద్రపడ్డ మమతా బెనర్జీ ని కాదని ఇక్కడ ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి. అస్సాం జాతీయ పౌరసత్వ రిజస్టర్ (ఎన్నార్సీ) వివాదంపై ఆమె పార్లమెంటు లోపల, బయట మడమ తిప్పకుండా పోరాటం చేసి అందరి దృష్టి ఆకర్షించారు. టీఎంసీ ప్రస్తుతానికి కాంగ్రెస్ కు దగ్గరగా ఉంది. అయితే దీనిని శాశ్వతం అనుకోవడానికి వీల్లేదు. బెంగాల్ ప్రయోజనాలు ఏమాత్రం దెబ్బతింటాయని భావించినా కాంగ్రెస్ తో కూడా అమీతుమీ తేల్చుకోవడానికి మమతా బెనర్జీ వెనుకాడరు. 2014 ఎన్నికల్లో మొత్తం 42 సీట్లలో 34 గెలుచుకుని తృణమూల్ కాంగ్రెస్ సత్తా చాటింది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్ నాలుగు సీట్లతోనూ బీజేపీ రెండు సీట్లతోనూ సరిపెట్టుకోవాల్సి వచ్చింది.





ఎన్సీపీ, శివసేనను తేలిగ్గా తీసుకోలేం

మహారాష్ట్ర విషయానికొస్తే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ), శివసేన ఇక్కడ కీలకం. ఎన్సీపీ, కాంగ్రెస్ మహాఘట్ బంధన్ లోనే ఉంది. శరద్ పవార్ చాలా ఏళ్ల పాటు సీఎంగా పనిచేయడం వల్ల ఎన్సీపీకి రాష్ట్ర వ్యాప్తంగా కేడర్ ఉంది. శివసేన విషయానికివస్తే ఆ పార్టీ ఇప్పటికైతే ఫడ్నవీస్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం భాగస్వామిగా ఉంది. పేరుకు మిత్రపక్షమైనా అవసరమైతే బీజేపీని కూడా విమర్శించడానికి ఉద్ధవ్ ఠాక్రే ఏమాత్రం వెనుకాడరు. ముంబై సిటీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈ పార్టీకి పలుకుబడి ఉంది.

బీజేపీ, కాంగ్రెస్ కు సమానదూరంలో బీజేడీ



ఒడిశాలో నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్ దే ప్రధాన పాత్ర. అవినీతికి, హంగు ఆర్భాటాలకు దూరంగా ఉండే సీఎం నవీన్ పట్నాయక్ కు మిస్టర్ క్లీన్ ఇమేజ్ ఉంది. ఆయన కాంగ్రెస్ కూటమిలో చేరతారని చాలా రోజులు ప్రచారం జరిగింది. అయితే ఏ కూటమిలోనూ చేరేది లేదని తాజాగా కుండబద్దలు కొట్టారు నవీన్ పట్నాయక్. 2014 ఎన్నికల్లో బీజేడీ మొత్తం 21 సెగ్మెంట్లలో 20 సెగ్మెంట్లు గెలుచుకుని హల్ చల్ చేసింది. బీజేపీ ఒకే ఒక్క సీటుతో సరిపెట్టుకుంది.

తమిళనాడులో డీఎంకే , అన్నా డీఎంకే లదే ప్రధాన పాత్ర

ఇక దక్షిణాదికి వస్తే ముందుగా చెప్పుకోవలసింది తమిళనాడు. ప్రాంతీయ పార్టీల కల్చర్ మొదలయ్యిందే తమిళనాడు లోనే. ఎంకే స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకే, కాంగ్రెస్ కు అతి ముఖ్యమైన మిత్రపక్షంగా మారిపోయింది. స్టాలిన్ ఒకడుగు ముందుకు వేసి కరుణానిధి విగ్రహావిష్కరణ సభలో ప్రధాని పదవికి రాహుల్ పేరును ప్రతిపాదించి హల్ చల్ చేశారు. బీజేపీకి ఇక్కడ మిగిలింది అన్నా డీఎంకేనే. తలైవా రజనీకాంత్ వ్యక్తిగతంగా బీజేపీకి అభిమాని. ఎన్నికల నాటికి ఆయన కూడా బీజేపీ కి జై కొట్టొచ్చు. అయితే ఎందుకో కానీ పాలిటిక్స్ లో ఆయన సందడి పెద్దగా కనిపించడం లేదు. మరో నటుడు కమల్ హాసన్ అయితే కాషాయం పార్టీకి దూరంగానే ఉన్నారు. ఎన్నికల నాటికి ఆయన అడుగులు ఎటు పడతాయో ఇప్పుడే చెప్పలేం.



జాతీయ పార్టీల ఫెయిల్యూరే ప్రాంతీయ పార్టీలకు ప్రాణం పోసింది

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో జాతీయ పార్టీలు విఫలమవడమే ప్రాంతీయ పార్టీలు పుట్టడానికి కారణమైంది. రాష్ట్ర ప్రయోజనాలే ప్రాంతీయ పార్టీలకు ముఖ్యం. సిద్ధాంతాల రాద్ధాంతాలు మిగతా గొడవలేవీ వీటికి పట్టవు. కేంద్రంపై ఒత్తిడి పెంచి తమ డిమాండ్లు సాధించుకునేదాకా నిద్రపోవు. తొలిరోజుల్లో రాష్ట్రాల శాసనసభల్లో జాతీయ పార్టీలకు పోటీగా ప్రాంతీయ పార్టీలు ఉండేవి. తర్వాత ఏకంగా పార్లమెంటులోనే జాతీయ పార్టీలను శాసించే స్థాయికి చేరుకున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రధాన పోటీ ఒక రీజనల్ పార్టీకి, ఏదో ఒక నేషనల్ పార్టీకి ఉంటే తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో రెండు ప్రాంతీయ పార్టీల మధ్యే ఉంటోంది. ఇక్కడ జాతీయ పార్టీలు ఏదో ఒక ప్రాంతీయ పార్టీతో జత కట్టకపోతే రాష్ట్రం పొలిమేరల్లోకి ప్రవేశించలేని పరిస్థితి ఉంది. లెక్కలు తీస్తే దేశం మొత్తం మీద నేషనల్ పార్టీలకు పోలైన ఓట్ల శాతం మెల్లమెల్లగా తగ్గుతోంది. ప్రాంతీయ పార్టీల ఓట్ షేర్ పెరుగుతోంది. 1984లో ప్రాంతీయ పార్టీలన్నిటికీ కలిపి వచ్చిన ఓట్ల శాతం 11.2 మాత్రమే. 2009 నాటికి ఈ ఓట్ షేర్ 28.4కు పెరిగింది. 2014 ఎన్నికల్లో దాదాపుగా 50 శాతానికి పెరిగింది. ప్రాంతీయ పార్టీలపై ప్రజల్లో ఆదరణ పెరగడమే దీనికి ప్రధాన కారణం.

దేశ రాజకీయాల్లో పెరిగిన ప్రాంతీయ పార్టీల పాత్ర

సహజంగా ప్రాంతీయ పార్టీలు ఆయా రాష్ట్రాలకే పరిమితం. రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తాయి. అలా ఉండటం వల్లే ప్రజలు ఆదరిస్తున్నారు. అయితే రకరకాల కారణాలతో నేషనల్ పాలిటిక్స్ ను కూడా శాసించే స్థాయికి ప్రాంతీయ పార్టీలు చేరుకున్నాయి. సంకీర్ణ ప్రభుత్వాల యుగంలో ఇదొక అనివార్యమైన పరిణామం. అటు ఎన్డీయే కూటమి కావచ్చు ఇటు కాంగ్రెస్ మహాఘట్ బంధన్ కావచ్చు ప్రాంతీయ పార్టీల జపం చేయందే అధికారానికి రాలేని రోజులు వచ్చాయి.

తెలుగు రాష్ట్రాల్లోనూ..

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రాంతీయ పార్టీలదే హవా. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే బీజేపీకి వ్యతిరేకంగా దేశమంతా కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నారు. మోడీ సర్కార్ కు వ్యతిరేకంగా అన్ని ప్రతిపక్షాలను ఏకం చేసే పనిని భుజాన వేసుకున్నారు. వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు తన వైఖరి ఏమిటో స్పష్టం చేయలేదు. తెలంగాణలో ఏ పార్టీ అయినా టీఆర్ ఎస్ తర్వాతే. టీఆర్ ఎస్ ను రెండోసారి ఒంటి చేత్తో గెలిపించి సత్తా చాటారు కేసీఆర్. మొత్తం 17 నియోజకవర్గాల్లో మిత్రపక్షమైన మజ్లిస్ కు ఓ సీటు పోతే మిగతా 16 సీట్లను గెలుచుకోవడానికి ఇప్పటికే కేసీఆర్ పక్కా ప్లాన్ రెడీ చేశారు.

- ఎస్. అబ్దుల్ ఖాలిక్



రిచా రానట్టే

రిచా గంగోపాధ్యాయ గుర్తుందిగా! మిరపకాయ్, మిర్చి లాంటి హిట్ చిత్రాల్లో నటించింది. అయితే సినిమాల కంటే చదువు ముఖ్యమంటూ నటనను వదిలేసి విదేశాలకు వెళ్లిపోయింది. నిజానికి వెళ్లే సమయానికి ఆమె కెరీర్ విజయవంతంగా ఉంది. అయినప్పటికీ ఆమె ఆ నిర్ణయం తీసుకోవడంతో అందరూ షాకయ్యారు. పోనీలే చదువుకుంటానంటోందిగా, అయ్యాక వచ్చేస్తుందిలే అనుకున్నారు. కానీ అది నిజమయ్యేలా లేదు. ఎందుకంటే ఆమె పెళ్లి చేసుకోబోతోంది. ఆల్రెడీ నిశ్చితార్థం కూడా అయిపోయింది. ‘‘బిజినెస్ స్కూల్లో పరిచయమైన ‘జో’ని రెండేళ్ల క్రితం కలిశాను. పెళ్లి చేసుకోబోతున్నాను. నిశ్చితార్థం అయ్యింది. పెళ్లి డేట్ ఫిక్స్ కావాల్సి ఉంది. తనతో కలిసి జీవించే రోజు కోసం ఎదురుచూస్తున్నా’ అంటూ సోషల్ మీడియాలో తన ఆనందాన్ని షేర్ చేసుకుంది రిచా. దాన్ని బట్టి ఆమెకి తిరిగి సినిమాల్లోకొచ్చే ఆలోచన లేదని అర్థమవుతోంది.

ఊరు చాలా ఇచ్చింది..

నేను తిరిగిస్తా

ఎంత ఎదిగినా సొంత ఊరిని మర్చిపోకూడదంటారు. మర్చిపోవడమా... మా ఊరికోసం నేనెంతో చేస్తాను అంటున్నారు అల్లు అర్జున్. ఈ సంక్రాంతికి తన సొంత ఊరు పాలకొల్లుకి విచ్చేసిన బన్నీ... అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహానికి కుటుంబంతో కలిసి పూల మాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ‘‘మా తాతగారు పాలకొల్లులో పుట్టారు. మా నాన్నగారు ఇక్కడే పుట్టారు. నేను మద్రాసులో పుట్టాను. ఆ తరువాత హైద్రాబాద్‌లో పెరిగాను. అయితే నన్ను మీ ఊరు ఏదంటే మాత్రం పాలకొల్లు అని చెప్తాను. ఇక్కడికి రావటానికి ముఖ్య కారణం నా ఫ్యామిలీ. నా ఊరు నాకు చాలా ఇచ్చింది. అలాంటి నా ఊరికి ఏమైనా ఇవ్వాలి. అందుకే ఈ సంక్రాంతి నుండి స్టార్ట్ చేస్తున్నాను. పెద్ద గుడిలో కల్యాణ మండపం కట్టిస్తాను. దానికి పది లక్షలు ఇస్తున్నా. ప్రతి సంక్రాంతినీ ఇక్కడే జరుపుకునే ప్రయత్నం చేస్తాను’’ అని చెప్పారు.





విజయ్ సేతుపతి వీరావేశం

స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా రూపొందుతోన్న చిత్రం ‘సైరా నరసింహారెడ్డి’. చిరంజీవి టైటిల్‌రోల్ పోషిస్తోన్న ఈ సినిమాకి సురేందర్ రెడ్డి దర్శకుడు. తెలుగు, హిందీ నటీనటులతో పాటు తమిళ హీరో విజయ్ సేతుపతి కూడా ‘రాజా పాండి’ అనే కీలక పాత్రను పోషిస్తున్నాడు. బుధవారం విజయ్ పుట్టిన రోజు సందర్భంగా తన ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. నుదురు, చేతులకు విభూది రేఖలు, పొడవైన జుట్టు, మెడలో పులిగోరు, చేతిలో వేట కత్తితో వైవిధ్యంగా కనిపిస్తున్నాడు. రామ్‌చరణ్ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి అమిత్ త్రివేది సంగీతం అందిస్తున్నాడు.

ఏప్రిల్‌లో

చిత్రలహరి



సాయిధరమ్ తేజ్ హీరోగా ‘నేను శైలజ’ ఫేమ్ కిషోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం ‘చిత్రలహరి’. కళ్యాణి ప్రియదర్శన్, రితిక సింగ్ కథానాయికలు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోన్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారైంది. వేసవి కానుకగా ఏప్రిల్ 12న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ‘కిషోర్ గత చిత్రాల తరహాలోనే ఈ సినిమాలో కూడా ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు ఎమోషన్స్ కూడా ఉంటాయి. తేజ్‌ను సరికొత్త కోణంలో చూపించబోతున్నాడు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఈ సినిమాకి హైలైట్’ అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ ‘టైటిల్‌లో ఉన్న ఐదు అక్షరాల్లాగే సినిమాలోని ఐదు పాత్రలకీ ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. సాయిధరమ్ కెరీర్‌లోనే వన్ ఆఫ్ ద బెస్ట్ మూవీ అవుతుంది’ అన్నారు. ఓ మంచి హిట్ కోసం చూస్తోన్న తేజ్ ఆశని ఈ మూవీ తీరుస్తుందేమో చూడాలి.

సరిహద్దుల్లో తనీష్

చాలా గ్యాప్ తర్వాత వరుస సినిమా అవకాశాలు వస్తున్నాయి తనీష్‌కి. ఆ మధ్య ‘రంగు’ చేశాడు. ఇప్పుడు మరో సినిమా చేయడానికి సిద్ధమవుతున్నాడు. మనిషికి మనిషికీ.. దేశాలకు, ప్రాంతాలకు మధ్య కొన్ని హద్దులు ఉంటాయి. ఎవరి పరిధిలో వాళ్లున్నంత వరకూ అవి సరిగానే ఉంటాయి. ఒక్కసారి ఆ సరిహద్దులు అతిక్రమిస్తే సంఘర్షణ మొదలవుతుంది. దేశాలు, ప్రాంతాల మధ్య ఈ సరిహద్దు సంఘర్షణలు తీవ్ర పరిణామాలకు దారి తీయొచ్చు. ఒక్కోసారి అది జాతీయ సమస్యగానూ మారొచ్చు. అలా మారకుండా చూసే శక్తి ఆర్మీ. అలాంటి ఆర్మీ ఆఫీసర్‌గా తనీష్ నటించనున్న సినిమా ‘సరిహద్దు’. తనీష్‌తో ‘రంగు’ చిత్రాన్ని తీసిన కార్తికేయ ఈ చిత్రానికి కూడా దర్శకత్వం వహించనున్నాడు. తెలుగుతో పాటు హిందీ భాషలోనూ విడుదల చేయబోతోన్న ఈ మూవీలో రెండు భాషల నటీనటులు కనిపించనున్నారు. అత్యున్నత స్థాయి సాంకేతిక విలువలతో రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్ మార్చి పదహారు నుంచి ప్రారంభం కాబోతోంది. ఇతర ఆర్టిస్టులు, టెక్నీషియన్స్‌కి సంబంధించిన వివరాలను ఈ నెలాఖరులో తెలియజేయబోతున్నారు.





మనువుకు వేళాయె

సౌత్ఇండస్ట్రీలోని మోస్ట్ వాంటెడ్ బ్యాచిలర్‌గా విశాల్ పేరు ఎప్పటి నుంచో వినిపిస్తోంది. ఆమెని చేసుకుంటాడు, ఈమెని చేసుకుంటాడు అంటూ ఎప్పుడూ ఏదో ఒక వార్త వస్తూనే ఉంది. అవన్నీ నిజం కాదని, టైమ్ వచ్చినప్పుడు నేనే రివీల్ చేస్తానని చెబుతూ వచ్చాడు విశాల్. ఆ ఘడియ ఇప్పటికి వచ్చింది. హైదరాబాద్‌కి చెందిన వ్యాపారి కూతురు అనీషాతో తన పెళ్లి ఫిక్సయ్యిందని కన్‌ఫర్మ్ చేశాడు విశాల్. త్వరలోనే పెళ్లి తేదీ కూడా చెబుతానంటున్నాడు. కంగ్రాట్స్ విశాల్.

పల్లెటూరి పిల్లాడి కథ



నవీన్ విజయ్‌కృష్ణ, శ్రీనివాస్ అవసరాల హీరోలుగా బాలాజి సానల దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం ‘ఊరంతా అనుకుంటున్నారు’. మేఘా చౌదరి, సోఫియా సింగ్ హీరోయిన్లు. రోవాస్కైర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శ్రీహరి మంగళంపల్లి, రమ్య గోగుల, పి.ఎల్.ఎన్.రెడ్డి, ఎ.పద్మనాభరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్, టీజర్‌ను కృష్ణ, విజయనిర్మల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ‘ఇంగ్లిష్ పదాల టైటిల్స్ ఎక్కువవుతోన్న తరుణంలో ఇలాంటి తెలుగు టైటిల్‌తో సినిమా రావడం బాగుంది. సినిమా వాతావరణంలో పెరిగిన నవీన్‌లో మంచి హుషారుంది. పాటలు, ఫైట్స్ బాగా చేస్తున్నాడు. నటుడిగా మంచి భవిష్యత్ ఉంది’ అన్నారు. సినిమా విజయం సాధించాలని విజయ నిర్మల శుభాకాంక్షలు తెలిపారు. నవీన్ మాట్లాడుతూ ‘గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాని ఎక్కువగా పాలకొల్లులో చిత్రీకరించాం. మంచి సినిమా అవుతుందనే నమ్మకం ఉంది’ అన్నాడు. నరేష్ మాట్లాడుతూ ‘నందిని నర్సింగ్ హోమ్ చిత్రం తర్వాత నవీన్ ఐదారు స్క్రిప్టులు విన్నాడు. వాటిలో ఈ కథ మాకు బాగా నచ్చింది. నేను బావున్నాయన్న సినిమాలు తొంభై తొమ్మిది శాతం ఫెయిలవలేదు. రషెస్ చూశాను, మంచి ఎంటర్‌టైనర్ అవుతుంది’ అని చెప్పారు. ఇదో కొత్త జానర్ సినిమా అని, క్యూట్ విలేజ్ బోయ్‌గా నవీన్ మెప్పిస్తాడని నిర్మాతలు అన్నారు. కోట శ్రీనివాసరావు, జయసుధ, రావు రమేష్ ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తోన్న ఈ సినిమాకి కె.ఎమ్.రాధాకృష్ణన్ సంగీతం అందిస్తున్నాడు.


వారియర్ సినిమాపై బోనీ వార్

సోషల్ మీడియా సంచలనం ప్రియా వారియర్ నటిస్తోన్న చిత్రం ‘శ్రీదేవి బంగ్లా’. ప్రశాంత్ మాంబుల్లి దర్శకత్వం వహిస్తోన్న ఈ థ్రిల్లర్ మూవీ టీజర్ ఇటీవలే విడుదలైంది. ఒంటరితనంతో బాధపడే ఓ ఫిల్మ్ స్టార్ పాత్రను ప్రియ పోషిస్తోంది. ఆమె పాత్ర, టైటిల్‌తో పాటు టీజర్‌లోని సన్నివేశాలు శ్రీదేవి జీవితాన్ని పోలి ఉండడంతో సినిమా వివాదాస్పదమైంది. ముఖ్యంగా టీజర్ చివర్లో హీరోయిన్ బాత్ టబ్‌లో పడి చనిపోయినట్టు చూపించారు. దీంతో బోనీకపూర్ యూనిట్‌కు లీగల్ నోటీసులు పంపారు. ఈ విషయాన్ని ధృవీకరించిన చిత్ర దర్శకుడు ప్రశాంత్.. తాను తీస్తోంది సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా అని, శ్రీదేవి అనే పేరు కామన్‌గా చాలామందికి ఉంటుందనీ అన్నాడు. లీగల్‌గానే సమాధానమిస్తామని ప్రకటించాడు. అయితే పబ్లిసిటీ కోసమే ఇలా శ్రీదేవి పేరును వాడుకుంటున్నారనే విమర్శలూ వినిపిస్తున్నాయి.



ట్విటర్ టాక్

దర్శకుడు రాజ్ కుమార్ హిరానీపై వేధింపుల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో బాలీవుడ్ గీత రచయిత జావెద్ అక్తర్ ఇలా స్పందించారు. “నేను 1965లో ఇండస్ట్రీకొచ్చాను. ఇన్ని దశాబ్దాల్లో పరిశ్రమలో చాలామందిని చూశాను. వారిలో అత్యంత డీసెంట్ వ్యక్తి ఎవరని అడిగితే నా మనసులో మొదట మెదిలే పేరు రాజ్ హిరానీ. కానీ జార్జ్ బెర్నార్డ్ షా చెప్పాడుగా... అతి మంచితనం మంచిది కాదని.”



ఆన్ లొకేషన్




విక్రమ్ హీరోగా కమల్ హాసన్ నిర్మాణంలో రూపొందుతోన్న చిత్రం ‘కదరం కందన్’. ‘చీకటి రాజ్యం’ ఫేమ్ రాజేష్ ఎమ్. సెల్వ దర్శకుడు. అక్షర హాసన్, నాజర్ కొడుకు అభి ఇతర ముఖ్య పాత్రధారులు. ఇటీవల విడుదలైన టీజర్‌లో నెరిసిన గడ్డంతో రగ్గ్‌డ్ లుక్‌తో ఆకట్టుకున్నాడు విక్రమ్. టీజర్‌ను బట్టి ఇది పక్కా యాక్షన్ సినిమాలా కనిపిస్తోంది. ఈ సినిమా సెట్‌లోనే ఓ యాక్షన్ సీన్‌ని విక్రమ్‌కి వివరిస్తున్నాడు దర్శకుడు రాజేష్.

గప్‌చుప్

లై, చల్ మోహన్ రంగ చిత్రాల్లో నటించిన మేఘా ఆకాశ్‌కి ఆ రెండు చిత్రాల పరాజయం అవకాశాలను తగ్గించింది. తమిళంలో మాత్రం కొన్ని చిత్రాలు చేస్తోంది. రీసెంట్‌గా ‘పేట’లో కూడా కనిపించింది. అయితే ఈమె మళ్లీ స్ట్రెయిట్ తెలుగు మూవీలో నటించే సూచనలు కనిపిస్తున్నాయి. ‘జెర్సీ’ తర్వాత విక్రమ్ కుమార్ దర్శకత్వంలో నాని చేయబోయే సినిమాలో హీరోయిన్‌గా మేఘనే అనుకుంటున్నారట. తెలుగులో ఇంతవరకూ అదృష్టం కలిసి రాలేదు. ఇందులో సెలెక్ట్ అయితే అయినా సక్సెస్ వరిస్తుందేమో చూడాలి మరి.



ఫొటో ఫీస్ట్



అతి చిన్న వయసులోనే తన కొడుకు అయాన్ క్యాన్సర్ బారిన పడ్డాడన్న వార్త నిలువునా కుదిపేసింది ఇమ్రాన్ హష్మిని. అయిదేళ్ల ఆ వేదనకు ఇప్పటికి తెర పడింది. వ్యాధి పూర్తిగా తగ్గిపోయిందని డాక్టర్లు నిర్ధారించడంతో ఈ ఫొటోని పోస్ట్ చేసి మరీ తన సంతోషాన్ని ట్విటర్లో పంచుకున్నాడు.

బిజినెస్

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.433	రూ.4.95
వరంగల్	రూ.435	రూ.4.95

మార్కెట్

సెన్సెక్స్ 36,321.29 ▲2.96

నిఫ్టీ 10890 ▲3.50

స్వల్పంగా సరిపెట్టేశాయి..

10,890 వద్ద ముగిసిన నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ తీవ్ర ఒడిదుడుకుల అనంతరం ఫ్లాట్‌గా ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభమైన తొలి నిమిషాల్లోనే 10,900 మార్క్‌ను పునరుద్ధరించుకున్న నిఫ్టీ.. మిడ్ సెషన్ నాటికి 10,876 పాయింట్ల స్థాయికి దిగొచ్చింది. అనంతరం కొద్దిగా కోలుకుని కేవలం 3.50 పాయింట్ల లాభంతో 10890 దగ్గర క్లోజైంది. సెన్సెక్స్ సైతం అత్యంత స్వల్పంగా 2.96 పాయింట్ల లాభంతో 36,321.29 వద్ద స్థిరపడింది.

ఆంధ్ర ప్లాంట్‌లో 4 లోపాలు : రెడ్డీస్ ల్యాబ్స్

న్యూఢిల్లీ: డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్ ప్లాంట్‌లో అమెరికా హెల్త్ రెగ్యులేటరీ తనిఖీలను పూర్తి చేసింది. ఈ తనిఖీల్లో భాగంగా అమెరికా హెల్త్ రెగ్యులేటరీ నాలుగు లోపాలను ఎత్తి చూపినట్టు డాక్టర్ రెడ్డీస్ బుధవారం ప్రకటించింది. ‘ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో ఉన్న మా ప్లాంట్ యూనిట్ 1లో అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ ఎఫ్‌డీఏ) ఆడిట్‌ను పూర్తి చేసిందని కంపెనీ తెలిపింది.



ఎయిర్‌పోర్టుల మాదిరిగా

డ్రోన్ పోర్టులు రానున్నాయి

ముంబై:

దేశంలో డ్రోన్ ఆపరేషన్స్‌కు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. డ్రోన్ ఆపరేషన్స్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు ప్రతిపాదనలను జారీ చేసింది. డ్రోన్స్ ఎగరడానికి కారిడార్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. అంతేకాక ఈ మానవరహిత ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్‌కు (యూఏఎస్) లైసెన్స్ మంజూరు చేసి, అనుమతి ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఓ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది. డ్రోన్లు ఎగిరేందుకు, ల్యాండ్ అయ్యేందుకు డ్రోన్‌పోర్ట్‌లను నిర్మించాలని సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ తన డ్రాఫ్ట్ పాలసీలో పేర్కొంది. అంతేకాక డిజైన్‌లో వ్యక్తిగత డేటా బయటికి పొక్కకుండా రక్షించేందుకు కఠిన తరమైన రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ కూడా ఉండాలని సూచించింది. డ్రోన్ల రిజిస్ట్రేషన్ కోసం డిజిటల్ స్కై ప్లాట్‌ఫామ్‌ను ఇప్పటికే సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్ (సీఏఆర్) 1.0 కింద నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సీఏఆర్ 2.0 కింద డ్రాఫ్ట్ పాలసీని ఏవియేషన్ మంత్రిత్వ శాఖ జారీ చేసింది. ఇప్పటి వరకు మామూలు ఎయిర్‌క్రాఫ్ట్‌ల మాదిరి డ్రోన్లను, కమర్షియల్ వాడుకకు సురక్షితమైనవిగా సర్టిఫైడ్ చేయలేదు. వీటిని ఎయిర్‌స్పేస్‌కు దూరంగా ఉంచుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా డ్రోన్ కారిడార్‌ను అంటే మామూలు ఎయిర్‌క్రాఫ్ట్‌లకు దూరంగా వీటి ఆపరేషన్స్ నిర్వహించేలా ఎయిర్‌స్పేస్‌ను ఏర్పాటు చేయాలని డ్రోన్ ఎకోసిస్టమ్ పాలసీ రోడ్ మ్యాప్‌లో పేర్కొంది.

ప్రత్యేక డైరెక్టరేట్ ప్రతిపాదన

అంతేకాక డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్‌లోనే ప్రత్యేకంగా డ్రోన్ డైరెక్టరేట్‌నుఏర్పాటు చేయాలని కూడా ఈ రోడ్ మ్యాప్ సూచించింది. ఈ నిబంధనలను కనుక అతిక్రమిస్తే, ఫైనాన్సియల్ పెనాల్టీలు విధించాలని నివేదించింది. ఎయిర్‌స్పేస్ సిస్టమ్‌లో వచ్చే సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉన్న ఓ నిపుణుడు కూడా అవసరమని ఈ పాలసీ రోడ్ మ్యాప్ పేర్కొంది. ఇతను స్వతంత్ర యూఏఎస్ ఆపరేషన్స్ టెక్నాలజీకి ఎప్పుడికప్పుడు అప్‌గ్రేడ్ అవుతూ ఉండాలని చెప్పింది. డ్రోన్ ఆపరేషన్స్‌లో కూడా ఎన్నో ప్రైవసీ ప్రమాదాలు ఎదురవుతూ ఉంటాయి. ఈ ఇక్విప్‌మెంట్‌ను రూపొందించే వారు తయారీదారులు.. వ్యక్తిగత డేటా, ప్రైవసీ మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకుని వీటిలో స్పెషల్ ఫీచర్లను పొందపరచాల్సి ఉంది. యూఏఎస్, ఆర్‌పీఏఎస్ ఆధారిత వాణిజ్య పరమైన పౌర విమానయాన సేవల్లో ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం ఎఫ్‌డీఐని కూడా ఈ నోట్ నొక్కి చెప్పింది. కానీ ఇది కూడా పలు కండిషన్లకు లోబడే ఉండాలని పేర్కొంది.

ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సూచిస్తోన్న డ్రోన్ డైరెక్టరేట్.. ఒక్కో డ్రోన్, గరిష్ట జీవన విధానాన్ని (మ్యాక్సిమమ్ లైఫ్ సైకిల్) నిర్ణయిస్తుంది. దీని జీవన విధానం ముగిసిన తర్వాత ఆపరేటర్లు మళ్లీ సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. అటానమస్ యూఏఎస్‌ను ఆపరేటర్లు నైతిక ప్రయోజనాల కోసమే వాడాల్సి ఉంటుంది. ‘డు గుడ్, డు నో హార్మ్’ అంటే మంచికే ఉపయోగిస్తూ.. ఎలాంటి హాని కలిగించే విధంగా ఇవి ఉండకూడదని డ్రోన్ల నైతిక విధానాల్లో పేర్కొంది. ఈ విధానాలకే ఆపరేటర్లు కూడా కట్టుబడి ఉండాలని సూచించింది. పాలసీ నోట్ ప్రకారం, అటానమస్ యూఏఎస్ ఎట్టి పరిస్థితుల్లో మనుషులకు హాని కలిగించకూడదు. మనుషుల స్వేచ్ఛ, గోప్యత, భద్రత, గౌరవాన్ని రక్షించేలా ఈ యూఏఎస్‌లను అభివృద్ధి చేయాలి. ప్రస్తుతమున్న సీఏఆర్ 1.0ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం సీఏఆర్ 2.0ను ప్రవేశపెట్టవచ్చు.

డిసెంబర్ 1 నుంచే డ్రోన్లు చట్టబద్ధం

డ్రోన్లను చట్టపరమైనవిగా చేస్తూ.. కేంద్ర ప్రభుత్వం గత డిసెంబర్ 1 నుంచి కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఆ మార్గదర్శకాల్లో.. ఫోటోగ్రఫీ, వ్యవసాయ కార్యకలాపాలు, విపత్తు సహాయ పనుల్లో వీటిని ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. పగటి పూట మాత్రమే డ్రోన్లు ఉపయోగించాలని తెలిపింది. విమానాశ్రయాలు, అంతర్జాతీయ సరిహద్దు పరిసరాల్లో, తీర ప్రాంతాలలో, రాష్ట్ర సచివాలయ ప్రాంగణాలలో డ్రోన్ల వినియోగాన్ని నిషేధించారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో వివాహ వేడుకల్లో ఫోటోగ్రఫీ కోసం డ్రోన్లను వినియోగిస్తున్న నేపథ్యంలో అలాంటి వినియోగంపై ఎలాంటి ఆంక్షలు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది.

జర్నలిజంలోకి ఫేస్‌బుక్ 30 కోట్ల డాలర్ల పెట్టుబడి

న్యూయార్క్ : జర్నలిజానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులలో 30 కోట్ల డాలర్లను వెచ్చించనున్నట్లు సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ వెల్లడించింది. డిజిటల్ ఏజ్‌లో దెబ్బతిన్న లోకల్ న్యూస్ ప్రమోషన్‌కు పెద్దపీట వేయాలనుకుంటున్నట్లు ప్రకటించింది. రాబోయే మూడేళ్లలో పార్ట్‌నర్‌షిప్స్, కంటెంట్‌ల కోసం వివిధ ప్రోగ్రామ్స్‌ను ఈ 30 కోట్ల డాలర్లను వ్యయం చేయనున్నట్లు ఫేస్‌బుక్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ న్యూస్ పార్ట్‌నర్‌షిప్స్) క్యాంప్‌బెల్ బ్రౌన్ ఒక సోషల్ మీడియా సైట్‌లో పోస్ట్ చేశారు.

కోడక్ కొత్త స్మార్ట్ టీవీ వచ్చింది

హైదరాబాద్, వెలుగు: సరికొత్త ఫీచర్స్ తో సూపర్ ప్లాస్ట్రోనిక్స్ కోడక్ బ్రాండ్ లైసెన్సీ తమ బ్రాండ్ న్యూ 'కోడక్ హెచ్డీ ఎల్‌ఈడీ టీవీ' ని మార్కెట్ లోకి విడుదల చేసింది. ఈ స్మార్ట్ ఎల్‌ఈడీ టీవీ లో డిస్ ప్లే సైజ్ 109 సీఎం, రిసొల్యూషన్ 3840 x 2160 పిక్సెల్స్ తో పాటు డ్యుయల్ కోర్ 1.4 జీహెచ్ జడ్ ప్రోసెసర్, 1జీబీ మెమొరీ, 8జీబీ ఫ్లాష్ స్టోరేజ్ వంటి సదుపాయాలు ఉన్నాయి. లాన్ కనెక్టివిటీ, వైఫై, మిరాకాస్ట్, జీమెయిల్, యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్ బుక్, హాట్ స్టార్, నెట్ ఫ్లెక్స్ వంటి ప్రిలోడెడ్ ఆప్స్ వంటి ఫీచర్స్ ఈ టీవీ లో ఉన్నాయి.




ఇక పెరగబోతున్న

ఎయిర్‌కార్గో

- కొత్త పాలసీ ప్రకటన
- 2025 నాటకి టాప్ 5లో ఒకటిగా ఇండియా

ముంబై: నేషనల్ ఎయిర్‌కార్గో పాలసీని ప్రభుత్వం ప్రకటించింది. 2025 నాటికి ప్రపంచంలోని టాప్ 5 ఫ్రైట్ మార్కెట్లలో ఒకటిగా ఇండియాను నిలపాలని లక్ష్యంగా ఈ పాలసీలో నిర్దేశించారు. దేశంలోని అన్ని ప్రధాన ఎయిర్‌పోర్టులలోనూ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ షిప్‌మెంట్ హబ్స్‌ను ఏర్పాటు చేయాలని ధ్యేయంగా పెట్టుకున్నారు. గ్లోబల్ ఏవియేషన్ సమ్మిట్ 2019 సందర్భంగా ఈ కొత్త పాలసీని విడుదల చేశారు. ఇండియన్ క్యారియర్లు విదేశీ సంస్థలతో కోడ్ షేరింగ్, ఇంటర్‌లైన్ ఒప్పందాలు కుదుర్చుకోవడాన్ని కొత్త విధానం ప్రోత్సహిస్తుంది. ఇండియాలోని మొత్తం ఎయిర్‌కార్గోలో 60 శాతం అంతర్జాతీయ కార్గోనే. ఇది ఏటా 15.6 శాతం చొప్పున పెరుగుతోంది. ఇదే సమయంలో దేశీ కార్గో 8 శాతం వృద్ధి సాధించింది. ఇండియాలో రోడ్డు మార్గంలో నిర్వహించే కార్గో రవాణా 60 శాతంతో మొదటి స్థానంలో వుంటోంది. విదేశాలలోనైతే రోడ్డు మార్గ కార్గో రవాణా 30 శాతం మాత్రమే ఉంటుంది. ఇండియలోని ఎక్స్‌ప్రెస్ ఇండస్ట్రీ శరవేగంతో పెరుగుతున్న మార్కెట్, ఐతే గ్లోబల్‌గా చూస్తే మన వాటా 2 శాతానికి మించదు. గత అయిదేళ్లలో ఈ మార్కెట్ ఏటా 17 శాతం చొప్పున పెరిగి 2016-17 నాటికి రూ. 22,000 కోట్లకు చేరినట్లు అంచనా. ఇందులో దేశీయ ఎక్స్‌ప్రెస్ ఇండస్ట్రీ వాటా రూ. 17,000 కోట్ల దాకా ఉంటుందని పాలసీ డాక్యుమెంట్ పేర్కొంది. ఇంటర్నేషనల్ ఎక్స్‌ప్రెస్ ఇండస్ట్రీ వాటా రూ. 5,000 కోట్లు. రాబోయే 10-15 ఏళ్లలో వృద్ధి కొనసాగాలంటే, కొత్త మార్కెట్లు రావాలని అభిప్రాయపడింది.



గ్లోబల్ థింకర్స్‌లో ముఖేష్ అంబానీ

న్యూఢిల్లీ: ఇండియా సంపన్నుడు ముఖేష్ అంబానీ, గ్లోబల్ థింకర్స్ 2019 జాబితాలో అలీబాబా ఫౌండర్ జాక్ మా, అమెజాన్ సీఈఓ జెఫ్ బెజోస్, ఐఎంఎఫ్ క్రిస్టీన్ లగార్డ్‌ల సరసన స్థానం పొందారు. ప్రతిష్టాత్మక ఫారిన్ పాలసీ పబ్లికేషన్ ఈ జాబితాను రూపొందించింది. 2019 కి 100 మంది థింకర్స్‌తో జాబితాను రూపొందించిన పబ్లికేషన్ కొన్ని పేర్లను మాత్రమే ఇప్పుడు ప్రకటించింది. మొత్తం జాబితాను ఈ నెల 22న వెబ్‌సైట్‌లో పెట్టనున్నట్లు తెలిపింది. 4430 కోట్ల డాలర్ల సంపదతో జాక్ మాను తోసిరాజని, ఆసియాలోనే సంపన్నుడిగా ముఖేష్ అంబానీ అవతరించారు. జియో టెలికం వెంచర్‌తో ఇండియా టెలికం రంగంలో తీవ్ర ప్రభావం చూపిస్తారని ఈ పబ్లికేషన్ అభిప్రాయపడింది. ఇండియాలో తాజాగా ఇంటర్‌నెట్ రివల్యూషన్‌కు రిలయన్స్ జియో తెరతీసింది. కంటెంట్‌తోపాటు, లైఫ్‌స్టైల్ ప్రొడక్ట్స్‌ను విక్రయించి భవిష్యత్‌లో గూగుల్, ఫేస్‌బుక్‌లతో పోటీ పడాలనేది అంబానీ ఆలోచనగా పేర్కొంది.

విదేశీ రుణం కోసం ఐఓసీ ప్రయత్నం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని చమురు సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) అమెరికా డాలర్ బాండ్స్ జారీ ద్వారా 300 కోట్ల డాలర్లను సమీకరించనుంది. రూపాయి విలువ తగ్గిపోకుండా చూసేందుకు ఆర్‌బీఐ, చమురు రిటైలర్స్ కంపెనీల విదేశీ నిధుల సేకరణకు అంగీకరిస్తోంది. 90 కోట్ల డాలర్ల నిధులను బాండ్స్ ద్వారా సమీకరించడానికి ఐఓసీ ఇప్పటికే మార్కెట్లో ఉందని, దాదాపు అంతే మొత్తంలో వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం సేకరిస్తామని ఐఓసీ ఛైర్మన్ సంజీవ్ సింగ్ బుధవారం వెల్లడించారు. ఆర్‌బీఐ పరిమితులకు లోబడి విదేశాల నుంచి నిధులు సమకూర్చుకోనున్నట్లు పేర్కొన్నారు. ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ కంపెనీలు 1000 కోట్ల డాలర్ల మేర రుణాలను తీసుకోవచ్చంటూ, ఎక్స్‌టెర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ (ఈసీబీ) నిబంధనలలో ఆర్‌బీఐ గత అక్టోబర్‌లో మార్పులు చేసింది. అలాగే ఒక్కో కంపెనీకి విధించిన రుణ పరిమితిని కూడా పెంచింది.

రోబో ముత్తాతలు ఏనాటివారో!

బిజినెస్ డెస్క్, వెలుగు

ఇప్పుడు ఏ ఇండస్ట్రీని కదిపినా.. ప్రతి ఒక్కరి నోటా వినిపించే మాట ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ). ఇది ప్రపంచవ్యాప్తంగా పెద్ద హాట్ టాపిక్‌గా మారిపోయింది. ఇటీవల టెక్నాలజీ పరంగా వచ్చిన మార్పులతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత పెరిగింది. అయితే ఇప్పుడిప్పుడే అన్ని కంపెనీల నోటా ఏఐ గురించి వినిపిస్తున్నా.. ఇదేమీ కొత్త టెక్నాలజీ కాదు. కొన్ని వందల ఏళ్ల క్రితం నుంచే ఏఐ మనుగడలో ఉంది. రోబోలకు ముత్తాతలుగా చెప్పుకుంటోన్న ఏఐ, 1637 నుంచే సైన్స్ రంగంలో తన ప్రాబల్యం కొనసాగిస్తోందని పలు రిపోర్టులు చెబుతున్నాయి. ఇంతగా హల్‌చల్ చేస్తున్న ఏఐ ప్రయాణం గురించి ఓ సారి తెలుసుకుందాం..

1637... రోబోలు రావడానికి కంటే ఎన్నో ఏళ్ల ముందు... సైన్స్ ఫిక్షన్, సైంటిస్ట్, ఫిలాసఫర్ రెనే డెస్కార్టెస్ మిషన్లకు, మానవ మేధస్సుకున్న తేడాలను కనిపెట్టారు. మనుషులు మాదిరిగా మిషన్లు మాట్లాడలేకపోయినా.. ఇచ్చిన పనిని ఇవి సమర్థవంతంగా పనిచేయగలవని గుర్తించారు. ఒక స్పెసిఫిక్ టాస్క్‌ను పూర్తిచేయడానికి దాని గురించి క్షుణ్ణంగా తెలుసుకుని, ఆ తర్వాత ఎలాంటి జాబ్‌నైనా సమర్థవంతంగా నిర్వహించగలిగే సత్తా కలిగి ఉండటం.

1956.... డార్ట్‌మౌత్ కాలేజీ ప్రొఫెసర్ జాన్‌మెకార్తీ ‘ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్’ అనే పదాన్ని మొట్టమొదటిసారి వాడుకలోకి తీసుకొచ్చారు. ఈ రంగంలో పనిచేసే ప్రముఖ నిపుణులందర్నీ ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు సమ్మర్ వర్క్‌షాపు నిర్వహించారు.

1966... ఈఎల్ఐజెడ్ఏ (ఎలిజా) ప్రపంచంలోనే తొలి ఛాట్‌బోట్. అలెక్సా, సిరి లా మాదిరిదే ఈ ఎలిజా. దీన్ని ఎంఐటీలో జోసెఫ్ వీజెన్బామ్ అభివృద్ధి చేశారు. ఎలిజాను నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ కోసం వాడేవారు. అంటే మనుషుల భాషల్లో కంప్యూటర్లు ఎలా కమ్యూనికేట్ అవ్వాలో నేర్పించేది. అయితే ఎలిజా, అలెక్సా మాదిరి మాట్లాడలేదు. కేవలం టెక్స్ట్ రూపంలోనే కమ్యూనికేట్ అవ్వగలదు. పైగా మనుషులతో ఇది సంభాషించలేదు. ఎలిజాతో మిషన్లకు, మనుషులకు మధ్యనున్న కమ్యూనికేషన్ లోపాలు కనుమరుగయ్యాయని చెప్పొచ్చు.

1980.... డిజిటల్ ఇక్విప్‌మెంట్ కార్పొరేషన్ ఎక్స్‌కాన్ ‘ఎక్స్‌పర్ట్ లెర్నింగ్ సిస్టమ్’ను 1980లో ప్రవేశపెట్టింది. ఈ సిస్టమ్‌తో 1986 నుంచి వార్షికంగా కంపెనీ 40 మిలియన్ డాలర్లను మిగుల్చుకుంది. ఇక అప్పటి నుంచి వ్యాపారాల్లో స్మార్ట్ మిషన్లను ఏర్పాటు చేయడం మొదలైంది. ఏఐ సిస్టమ్స్‌తో పెద్ద మొత్తంలో ఖర్చులను మిగుల్చుకోవచ్చని భావించిన 1985లో పలు కార్పొరేషన్స్, అప్పట్లోనే ఏకంగా ఏడాదికి ఏఐ సిస్టమ్స్‌పై 100 కోట్ల డాలర్ల వరకు వెచ్చించాయి.

1988.... ఐబీఎం రీసెర్చర్లు లాంగ్వేజ్ ట్రాన్స్‌లేషన్‌పై స్టాటిస్టికల్ అప్రోచ్‌ను పబ్లిష్ చేశాయి. ఇది పబ్లిష్ కాకముందు మెషిన్ లెర్నింగ్ అంతా రూల్స్ ఆధారంగా ఉండేది. అప్పటి నుంచే ప్రోబబిలిటీని ప్రవేశపెట్టారు. దీంతో అప్పటిదాకా భాషా ట్రాన్స్‌లేషన్‌లో ఉన్న సవాళ్లకు ఒక పరిష్కారం దొరికినట్లైంది.



1991... ప్రస్తుతం ప్రపంచాన్ని ఏలుతున్న ఇంటర్నెట్‌ను కమర్షియల్ నెట్‌వర్క్స్ లింకింగ్‌కు, ఎంటర్‌ప్రైజస్‌కు వాడింది ఈ ఏడాది నుంచే. 1991లో సీఈఆర్ రీసెర్చర్ టిమ్ బెర్నర్స్ లీ ప్రపంచంలోనే తొలి వెబ్‌సైట్‌ను ఆన్‌లైన్‌గా పెట్టారు. హైపర్‌టెక్స్ట్ ట్రాన్స్‌ఫర్ ప్రోటోకాల్ (హెచ్‌టీటీపీ) ఎలా పనిచేస్తుందో సవివరంగా తెలిపారు. అప్పటి వరకు కంప్యూటర్లను పెద్ద పెద్ద ఎడ్యుకేషనల్ సంస్థలు, వ్యాపారస్తులు కేవలం డేటా షేరింగ్‌కు మాత్రమే ఉపయోగించారు. కానీ వరల్డ్‌వైడ్ వెబ్ వచ్చిన తర్వాత, పరిస్థితంతా పూర్తిగా మారిపోయింది. చాలా తక్కువ ఏళ్లలోనే, లక్షల మంది ప్రజలు వరల్డ్ వైడ్ వెబ్‌కు కనెక్ట్ అయ్యారు.

1997... ప్రపంచ ఛెస్ ఛాంపియన్ గ్యారీ కాస్పరోవ్‌తో పోటీపడేందుకు ధీటైన ఒక సూపర్ కంప్యూటర్‌ను అప్పట్లో ఐబీఎం రూపొందించింది. దీనికి ఏఐనే ఆధారం. కాకపోతే, ఆ ఛెస్ సూపర్‌కంప్యూటర్‌లోని ఏఐ ఇప్పుడున్న ప్రమాణాలకు సరితూగేది కాదు.. అప్పటిదాకా మనుషులు మాత్రమే చేయగలరన్న కొన్ని పనులను మెషిన్లు చేయగలవనే నమ్మకాన్ని ప్రపంచంలో కల్పించడానికి ఈ సూపర్ కంప్యూటర్ బాగా దోహదపడింది.

2005... డీఏఆర్‌పీఏ గ్రాండ్ ఛాలెంజ్‌ను రెండో సారి నిర్వహించింది ఈ ఏడాదే. అటానమస్ వెహికిల్స్ 100 కిలోమీటర్ల వరకు నడిచే రేసు ఇది. 2005లో మోజావే ఎడారిలో జరిగిన ఈ రేసులో అటానమస్ వెహికిల్స్ 100 కిలోమీటర్లకు పైగా నడిచి చరిత్ర సృష్టించింది. ఈ రేసును అటానమస్ డ్రైవింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేయడం కోసం డిజైన్ చేశారు. 2007లో పట్టణ వాతావరణానికి తగ్గట్టు ఈ వెహికిల్స్‌ను రూపొందించారు.

2011..... ఐబీఎం తయారు చేసిన వాట్సన్ అనే మెషిన్ జీయోపార్డీ టీవీ గేమ్ షోలో మనుషులతో తలపడి, 10 లక్షల డాలర్ల ప్రైజ్ మనీని గెలుపొందడం విశేషం. అంతకు ముందు చదరంగాన్ని గణితశాస్త్ర పరంగా మెషిన్‌కు నేర్పించి, కాస్పరోవ్‌తో ఆడించారు. కానీ 2011 లో మనుషులు తమ భాషలో క్రియేటివ్‌గా పాల్గొన్న ఈ టీవీ గేమ్ షోలో వాట్సన్ గెలుపు ఏఐకు కొత్త మలుపు.

2015... మనుషుల కంటే మెరుగ్గా మిషన్లు పనిచేస్తాయనే దానికి ఉదాహరణను రీసెర్చర్లు రుజువు చేసి చూపించారు. 2015లో ఇమేజ్‌నెట్ ఛాలెంజ్‌పై రీసెర్చర్లు అధ్యయనం చేశారు. మనుషుల కంటే మెరుగ్గా కంప్యూటర్లే విజ్యువల్ డేటాను గుర్తించగలవని రీసెర్చర్ల అధ్యయనంలో తేలింది.

2018.... ఈ ఏడాది మేజర్ హెడ్‌లైన్‌గా సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు నిలిచాయి. 1939లోనే జనరల్ మోటార్స్ డ్రైవర్‌లెస్ వెహికిల్స్ వచ్చినట్టు అంచనావేసినా.. 1961లో ఇది రోడ్డుపైకి వచ్చినట్టు డేటా ఉన్నా.. 2018 ఏడాదే ఈ టెక్నాలజీకి ప్రత్యేకత. గూగుల్ స్పిన్ ఆఫ్ వ్యామో సెల్ఫ్ డ్రైవింగ్ ట్యాక్సీ సర్వీసులను అరిజోనాలో లాంచ్ చేసింది. తొలి కమర్షియల్ అటానమస్ వెహికిల్ సర్వీసు ఇదే.

1637 మెషీన్లకు, మానవ మేధస్సుకు మధ్య తేడా

1966 తొలి ఛాట్‌బోట్ ‘ఎలిజా’ పుట్టుక

1991 కమర్షియల్ నెట్‌వర్క్స్‌కు, ఎంటర్‌ప్రైజస్‌కు ఇంటర్నెట్ అందుబాటు

1956 మొట్టమొదటిసారి ‘ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్’ అనే పదం వాడుక

1980 వ్యాపారాల్లో స్మార్ట్ మిషన్ల వాడకం

2005 అటానమస్ డ్రైవింగ్ టెక్నాలజీ రేసు

2015 మనుషుల కంటే మెరుగ్గా మెషీన్లు పనిచేస్తాయని నిరూపణ


2018 రోడ్లపై చక్కర్లు కొడుతోన్న సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు

‘ఏఐ’పై 5 లక్షల మందికి శిక్షణ : మైక్రోసాఫ్ట్ ఇండియా

బెంగళూరు : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇండియా కూడా దృష్టిసారించింది. వచ్చే మూడేళ్లలో ఇండియాలో 5 లక్షల మంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రకటించింది. అంతేకాక 10 యూనివర్సిటీల్లో ఏఐ ల్యాబ్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది. ఎమర్జింగ్ టెక్నాలజీల్లో 10వేల మంది డెవలపర్స్‌కు స్కిల్స్‌ను పెంచుతున్నట్టు తెలిపింది. ప్రస్తుతం ప్రభుత్వ సంస్థలతో పాటు 700 ఆర్గనైజేషన్స్ ఏఐ సొల్యూషన్స్‌ను వాడుతున్నట్టు ఈ సాఫ్ట్‌వేర్ దిగ్గజం



చెప్పింది. వీటిలో 60 శాతం పెద్ద సంస్థలే అని వెల్లడించింది. ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నత విద్యాసంస్థలను, పరిశోధన సంస్థలను ఏర్పాటు చేసేందుకు మైక్రోసాఫ్ట్ ఇప్పటికే ఇంటెలిజెంట్ క్లౌడ్ హబ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్సస్, ఏఐ, ఐఓటీ వంటి టెక్నాలజీల్లో విద్యార్థులు, ఫ్యాకల్టీ వారి నైపుణ్యాలను ఇది పెంచుతోంది. ఇండియా పురోగతికి ముఖ్యంగా ఎడ్యుకేషన్, స్కిల్లింగ్, హెల్త్‌కేర్, అగ్రికల్చర్ వంటి రంగాలలో ఏఐ ఉపయోగపడుతున్నట్టు మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ అనంత్ మహేశ్వరి తెలిపారు.



‘జీవన్ శాంతి’ ప్లాన్ అదరగొడుతోంది: ఎల్ఐసీ

హైదరాబాద్, వెలుగు : డిసెంబర్ 2018తో ముగిసిన క్వార్టర్‌లో ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ మొత్తం ప్రీమియం ఇన్‌కమ్ రికార్డు స్థాయిలో రూ.35వేల కోట్లకు చేరింది. తెలంగాణతోపాటు కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లు ఈ జోన్ పరిధిలో ఉన్నాయి. ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్‌కి చెందిన డిసెంబర్ క్వార్టర్ ఫలితాలను జోనల్ మేనేజర్ టీసీ సుశీల్ కుమార్ వెల్లడించారు. . ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ ప్రీమియం ఇన్‌కమ్ రూ.55వేల కోట్లకు మించుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఎల్ఐసీ కొత్తగా లాంచ్ చేసిన ‘జీవన్ శాంతి’ ప్లాన్‌కు రెస్పాన్స్ బాగుందని, కేవలం ఈ జీవన్ శాంతి



ప్రొడక్ట్‌తోనే రూ.750 కోట్ల కొత్త బిజినెస్ ప్రీమియంను పొందినట్టు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి జీవన్ శాంతి మొత్తంగా రూ.2000 కోట్లను సాధిస్తుందని అంచనావేస్తున్నారు. ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్‌కు చెందిన మొత్తం మార్కెటింగ్ టీమ్‌ను ఆయన అభినందించారు.

డెత్ క్లెయిమ్స్, మెచ్యూరిటీ క్లెయిమ్స్, యాన్యుటీ పేమెంట్స్, ఇతర పేమెంట్స్ రూపంలో 2018 చివరి నాటికి మొత్తంగా రూ.25వేల కోట్ల చెల్లింపులు చేసినట్టు సుశీల్ చెప్పారు. ప్రమాదం జరిగిన 48 గంటల్లోపు ఎల్ఐసీ డెత్ క్లెయిమ్స్‌ను సెటిల్ చేస్తోందన్నారు. ఇటీవల జరిగిన మైసూర్, కరీంనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాల్లో, ఎల్ఐసీ స్పందనను, అంకిత భావాన్ని కస్టమర్లు చూసే ఉంటారని గుర్తుచేశారు.

ఫినిష్ కాలేదింకా!

వెలుగు, క్రీడావిభాగం

మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో ఇండియా ఓడితే... బ్యాటింగ్‌లో విఫలమైన ధవన్, రాయుడు, కోహ్లీలను పక్కనపెట్టి చర్చంతా మహేంద్ర సింగ్ ధోనీ చుట్టే తిరిగింది. ఎక్కువ బంతులు వృథా చేశాడు... వేగంగా ఆడలేకపోయాడు... మునుపటి మెరుపులు కనుమరుగయ్యాయి... ఫినిషింగ్ టచ్ ఇవ్వలేకపోతున్నాడు... వికెట్ల మధ్య పరుగు వేగం తగ్గింది... ఇంకా చాలా... ఎటు చూసినా ఇలాంటి విమర్శలే వినిపించాయి. జట్టులో ధోనీ అవసరం ఏంటనే వరకు వెళ్లింది చర్చ. సిడ్నీ వన్డేలో స్కోరు బోర్డుపై పట్టుమని పది పరుగులు కూడా నమోదు కాకముందే టాపార్డర్ కుప్పకూలిన వేళ మహీ క్రీజులోకి వచ్చాడన్న విషయం మరిచి విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. అయితే అడిలైడ్‌లో టీమిండియా విజయానికి 38 బంతుల్లో 57 పరుగులు చేయాల్సిన కీలక దశలో విరాట్ వెనుదిరిగితే ఆ బాధ్యతను భుజానెత్తుకున్న ధోనీ సమర్థవంతంగా పని పూర్తి చేశాడు. విమర్శకులకు బ్యాట్‌తోనే సమాధానం చెప్పాడు. ఒక్క ప్రదర్శనతోనే 'మిస్టర్ కూల్' బ్యాటింగ్ గురించి విశ్లేషించడం కాదు కానీ... ఇంకా తనలో చాలా క్రికెట్ మిగిలుందని ఈ ఇన్నింగ్స్ నిరూపించింది. ఈ మ్యాచ్‌లోనూ ఆరంభంలో ధోనీ ఇబ్బంది పడ్డాడు. సరైన టచ్ దొరక్క తడబడ్డాడు. మరో ఎండ్‌లో విరాట్ స్వేచ్ఛగా పరుగులు చేస్తుండటంతో పాటు టార్గెట్ మరీ పెద్దది కాకపోవడం మహీకి కలిసొచ్చింది. ఈ జోడీ పరుగు లేని చోట కూడా సింగిల్స్ తీస్తూ... ఒక్క రన్ వచ్చే చోట రెండు రన్స్ పరిగెడుతూ కంగారూలను కలవరపెట్టింది. విరాట్ ఉన్నంతసేపు స్ట్రయిక్ రొటేషన్‌కే పరిమితమైన ధోనీ ఆ తర్వాత జూలు విదిల్చాడు. సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోతుండటంతో మహీలోని అసలు సిసలు ఫినిషర్ బయటకు వచ్చాడు. ముగించడం అంటే సిక్సర్లు, ఫోర్లే కాదు ఓవర్‌కు 8 పరుగులు తగ్గకుండా తీస్తూ స్కోరు బోర్డును ముందుకు నడిపించడం అని నిరూపించాడు. ఇక చివరి ఓవర్‌లో విజయానికి 7 రన్స్ అవసరం కాగా... బెరెన్‌డార్ఫ్ తొలి బంతికే కళ్లు చెదిరే సిక్సర్‌తో మ్యాచ్‌కు తనదైన ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. తమ కెరీర్‌లో గుర్తుంచుకునే ఒక్క ఇన్నింగ్స్ కూడా ఆడని వాళ్లూ... వన్డేల్లో 10 వేల మైలురాయి దాటిన ధోనీని విమర్శించడం హాస్యాస్పదం. అడిలైడ్ మ్యాచ్ చివర్లో ధోనీతో కలిసి పరుగు తీసేందుకు కార్తీక్ పడ్డ ఇబ్బంది చూస్తుంటే ఇప్పటికీ ధోనీకి పరుగులో సాటి లేదనే విషయం స్పష్టమవుతోంది. ఇటీవల టెస్టుల్లో యువ వికెట్‌కీపర్ రిషబ్ పంత్ రెచ్చిపోతుండటం కూడా ధోనీపై కాస్త ఒత్తిడి పెంచుతున్నట్లనిపించినా... జట్టు సభ్యులతో పాటు కోచ్ ఎప్పటికప్పుడు మహీని వెనకేసుకొస్తూనే ఉన్నారు. 'సిడ్నీలో 4వ ఓవర్‌లోనే ధోనీ క్రీజులోకొచ్చాడు. ఆ సమయంలో మరో వికెట్ పడి ఉంటే మ్యాచ్ మా చేతి నుంచి ఎప్పుడో చేజారేది' అని రోహిత్ అన్నాడంటే ధోనీ విలువేంటో తెలుస్తోంది. వికెట్ కీపింగ్ విషయానికి వస్తే దేశంలోనే కాదు. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో ధోనీని మించిన కీపర్ మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు.



'ఈ రోజు ధోనీది. ఆటను చక్కగా అర్థం చేసుకునే మహీకి మ్యాచ్‌ను చివరి వరకు ఎలా తీసుకెళ్లాలో తెలుసు. ధోనీ మదిలో ఏం నడుస్తుందో అతనికి మాత్రమే తెలుసు. చివర్లో భారీ షాట్లు ఆడటంలో అతనికి సాటి లేరు'

- విరాట్ కోహ్లీ

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తనను గొప్ప ఫినిషర్ అని ఎందుకు అంటారో వెటరన్ మహేంద్ర సింగ్ ధోనీ మరోసారి నిరూపించుకున్నాడు. సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ పోతున్నా... క్రీజులో నిలదొక్కుకున్న విరాట్ కోహ్లీ వెనుదిరిగినా... ఏమాత్రం ఒత్తిడి దరి చేరనివ్వకుండా మ్యాచ్‌కు తనదైన ముగింపునిచ్చాడు. పనైపోయింది, ఇక పక్కన పెట్టాల్సిందే అన్న విమర్శలకు తన బ్యాట్‌తోనే సమాధానం చెప్పాడు. పరుగుల యంత్రం కోహ్లీ సెంచరీకి మహీ మెరుపులు తోడవడంతో రెండో వన్డేలో నెగ్గిన టీమిండియా సిరీస్ సమం చేసింది.

లెక్క సరి

విరాట్ మరో సెంచరీ ■ ఫిఫ్టీతో ధోనీ ఫినిషింగ్ టచ్

రెండో వన్డేలో టీమిండియా గెలుపు



కోహ్లీ (104)

అడిలైడ్: తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైన టీమిండియా రెండో వన్డే గెలిచి లెక్క సరిచేసింది. అడిలైడ్ వేదికగా మంగళవారం జరిగిన వన్డేలో 'రన్ మెషీన్' విరాట్ కోహ్లీ (104 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 104) సెంచరీకి తోడు మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ (54 బంతుల్లో 2 సిక్సర్లతో 55 నాటౌట్) అర్ధ సెంచరీతో ఆకట్టుకోవడంతో 6 వికెట్ల తేడాతో గెలిచి 1-1తో సిరీస్ సమం చేసింది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా మొదట 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. షాన్ మార్ష్ (123 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 131) భారీ సెంచరీకి మ్యాక్స్‌వెల్ (37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 48) మెరుపులు తోడవడంతో మంచి స్కోరు చేయగలిగింది. ఇండియా బౌలర్లలో భువనేశ్వర్ (4/45), షమీ (3/58) రాణించారు. వన్డే అరంగేట్రం చేసిన హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ (0/76) ఆకట్టుకోలేకపోయాడు. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' కోహ్లీ వన్డేల్లో 39వ శతకంతో చెలరేగడంతో ఇండియా సునాయాసంగా గెలిచేలా కనిపించింది. కానీ కీలక సమయంలో అతను పెవిలియన్ చేరడంతో చిక్కుల్లో పడింది. విరాట్ వెనుదిరిగే సమయానికి ఇండియా విజయానికి 38 బంతుల్లో 57 పరుగులు చేయాల్సి ఉండగా... వెటరన్ ధోనీ, కార్తీక్ (14 బంతుల్లో 2 ఫోర్లతో 25 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో 49.2 ఓవర్లలో 4 వికెట్లకు 299 పరుగులు చేసి గెలిచింది. సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డే శుక్రవారం మెల్‌బోర్న్‌లో జరగనుంది.

విరాట్ బేస్... ధోనీ ఫినిష్

భారీ టార్గెట్ ఛేజింగ్‌లో తొలి వన్డే సెంచరీ హీరో రోహిత్ శర్మ (52 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 43) మరో కీలక ఇన్నింగ్స్ ఆడగా... ధవన్ (32) ఉన్నంత సేపు దూకుడు కనబరిచాడు. వీరిద్దరూ తొలివికెట్‌కు 7.4 ఓవర్లలో 47 పరుగులు జోడించాక ధవన్ ఔటయ్యాడు. ఇక అక్కడి నుంచి కోహ్లీ ఆట ప్రారంభమైంది. అలవోకగా సింగిల్స్ తీస్తూ స్ట్రయిక్ రొటేట్ చేసిన విరాట్ రెండో వికెట్‌కు రోహిత్‌తో 54, మూడో వికెట్‌కు రాయుడు (24)తో 59 పరుగులు జోడించాడు. గత మ్యాచ్‌లో స్లో స్ట్రయిక్‌రేట్‌తో విమర్శల పాలైన ధోనీ ఈ ఇన్నింగ్స్‌తో సమాధానం చెప్పాడు. ఈ క్రమంలో కోహ్లీ 108 బంతుల్లో సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. నాలుగో వికెట్‌కు 82 రన్స్ జోడించాక కోహ్లీ ఔటవడంతో కాస్త ఉత్కంఠ నెలకొన్నా... కార్తీక్‌తో కలిసి ధోనీ మ్యాచ్ ఫినిష్ చేశాడు. వికెట్ల మధ్య వేగంగా పరిగెడుతూనే లక్ష్యాన్ని తరిగించుకుంటూ వచ్చిన మహీ చివరి ఓవర్‌లో భారీ సిక్సర్‌తో విజయాన్ని ఖాయం చేయడంతో పాటు వరుసగా రెండో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరూ చివరి వికెట్‌కు 34 బంతుల్లోనే 57 పరుగులు చేశారు.

మార్ష్ మెరుపులు

వరుసగా రెండో వన్డేలోనూ ఆసీస్‌కు మంచి ఆరంభం దక్కలేదు. కెప్టెన్ ఫించ్ (6), కారీ (18) త్వరగానే ఔటయ్యారు. ఈ దశలో షాన్ మార్ష్ ఇన్నింగ్స్‌ను నిర్మించే బాధ్యత తీసుకున్నాడు. ఖవాజా (21), హ్యాండ్స్‌కోంబ్ (20), స్టొయినిస్ (29) తక్కువ రన్స్‌కే వెనుదిరిగినా... మ్యాక్స్‌వెల్ నుంచి అతనికి చక్కటి సహకారం లభించడంతో చెలరేగిపోయాడు. వీరిద్దరు ఇండియా బౌలర్లను ధాటిగా ఎదుర్కొంటూ పరుగులు రాబట్టారు. ఆరో వికెట్‌కు ఈ జోడీ 65 బంతుల్లో 94 రన్స్ జోడించింది. ఈ క్రమంలో మార్ష్ 7వ వన్డే శతకం పూర్తి చేసుకున్నాడు. చివర్లో ఇండియా బౌలర్లు 4 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు తీసి స్కోరుకు కళ్లెం వేశారు. సిడ్నీ చివరి 10 ఓవర్లలో 93 పరుగులు చేసిన ఆసీస్ ఈ మ్యాచ్‌లోనూ సరిగ్గా అన్నే రన్స్ చేసింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా: కారీ (సి) ధవన్ (బి) షమీ 18; ఫించ్ (బి) భువనేశ్వర్ 6; ఖవాజా (రనౌట్) 21; షాన్ మార్ష్ (సి) జడేజా (బి) భువనేశ్వర్ 131; హ్యాండ్స్‌కోంబ్ (స్టంప్డ్) ధోనీ (బి) జడేజా 20; స్టొయినిస్ (సి) ధోనీ (బి) షమీ 29; మ్యాక్స్‌వెల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 48; రిచర్డ్‌సన్ (సి) ధవన్ (బి) షమీ 2; లైయన్ (నాటౌట్) 12; సిడిల్ (సి) కోహ్లీ (బి) భువనేశ్వర్ 0; బెరెన్‌డార్ఫ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం: 50 ఓవర్లలో 298/9.**

వికెట్ల పతనం: 1-20, 2-26, 3-82, 4-134, 5-189, 6-283, 7-283, 8-286, 9-286. **బౌలింగ్:** భువనేశ్వర్ 10-0-45-4, షమీ 10-0-58-3, సిరాజ్ 10-0-76-0, కుల్దీప్ 10-0-66-0, జడేజా 10-1-49-1.

ఇండియా: రోహిత్ (సి) హ్యాండ్‌కోంబ్ (బి) స్టొయినిస్ 43; ధవన్ (సి) ఖవాజా (బి) బెరెన్‌డార్ఫ్ 32; కోహ్లీ (సి) మ్యాక్స్‌వెల్ (బి) రిచర్డ్‌సన్ 104; రాయుడు (సి) స్టొయినిస్ (బి) మ్యాక్స్‌వెల్ 24; ధోనీ (నాటౌట్) 55; కార్తీక్ (నాటౌట్) 25; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం: 49.2 ఓవర్లలో 299/4.**


వికెట్ల పతనం: 1-47, 2-101, 3-160, 4-242. **బౌలింగ్:** బెరెన్‌డార్ఫ్ 8.2-1-52-1, రిచర్డ్‌సన్ 10-0-59-1, సిడిల్ 8-0-58-0, లైయన్ 10-0-59-0, స్టొయినిస్ 9-0-46-1, మ్యాక్స్‌వెల్ 4-0-16-1.



ఇషా డబుల్ ధమాకా

○ ఏపీ స్విమ్మర్ లోహిత్‌కు పసిడి

పుణె: హైదరాబాద్ యువ షూటర్ ఇషా సింగ్ మరోసారి సత్తా చాటింది. కొద్ది రోజుల కిందట నేషనల్ చాంపియన్‌షిప్స్‌లో అన్ని విభాగాల్లో విజేతగా నిలిచిన ఇషా.. ఖేలో ఇండియా గేమ్స్‌లోనూ అదరగొట్టింది. సింగిల్స్‌లో స్వర్ణం.. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజతంతో మెరిసింది. మంగళవారం జరిగిన అండర్-17 బాలికల పది మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో ఇషా (తెలంగాణ) 241.3 స్కోరుతో పసిడి పతకం ఖాతాలో వేసుకుంది. భుజం నొప్పితో బాధపడుతున్నప్పటికీ ఇషా ప్రత్యర్థులకు అందనంత దూరంలో నిలిచింది. ఇక, బుధవారం జరిగిన మిక్స్‌డ్ టీమ్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో అగా మహ్మద్ జైనులాబెదిన్‌తో కలిసి ఇషా 461.8 స్కోరుతో రెండో స్థానంతో తెలంగాణకు రజతం అందించింది. ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్ ఎమ్. లోహిత్ అండర్-21బాలుర 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ ఫైనల్లో 2 నిమిషాల 22.20 సెకండ్లతో స్వర్ణం గెలిచాడు.



ప్రిక్వార్టర్స్‌లో సైనా, శ్రీకాంత్, కశ్యప్

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఇండియాకు సానుకూల ఫలితాలు లభించాయి. టాప్ ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్‌లతోపాటు పారుపల్లి కశ్యప్ ముందంజ వేశారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్, ఏడోసీడ్ శ్రీకాంత్ 21-17, 21-11తో ఎంజీ కా లాంగ్ అంగూస్ (హాంకాంగ్)పై అలవోక విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో కామన్వెల్త్ మాజీ చాంపియన్ కశ్యప్ 19-21, 21-19 21-10తో రాస్మస్ గెమ్కే (డెన్మార్క్)పై చెమటోడ్చి నెగ్గాడు. మహిళల సింగిల్స్‌లో ఏడోసీడ్ సైనా చెమటోడ్చి విజయం సాధించింది. తొలిరౌండ్‌లో సైనా 14-21, 21-18, 21-18తో డెంగ్ జాయ్ షువాన్ (హాంకాంగ్)పై అతికష్టంమీద నెగ్గింది. డబుల్స్‌లో భారత జోడీ అశ్విని పొన్నప్ప-సిక్కిరెడ్డి జంట 21-16, 22-20తో ఎంజీ యే-యువెన్ సిన్ యింగ్‌పై గెలుపొందింది. అయితే మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ చోప్రా-సిక్కిరెడ్డి జంట 19-21, 17-21తో నెదర్లాండ్స్ జోడీ రాబిన్ టాబెలింగ్-సెలెనా పీక్ చేతిలో ఓడిపోయింది.

హర్యానా హ్యామర్స్ బోణీ

పంచకుల (హర్యానా): ప్రో రెజ్లింగ్ లీగ్ నాలుగో సీజన్‌లో హర్యానా హ్యామర్స్ బోణీ చేసింది. బుధవారం యూపీ దంగల్‌తో జరిగిన పోరులో 5-2తో గెలిచింది. హర్యానా తరఫున రవికుమార్ (57 కేజీలు), అనస్తాసియా నిచిత (మహిళల 57 కేజీలు), అలీ షబానోవ్ (86 కేజీలు) విజయం సాధించి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు.



సెలెక్టర్.. సర్దార్

హాకీ సెలెక్షన్ కమిటీలో మాజీ కెప్టెన్

న్యూఢిల్లీ: హాకీ ఇండియా సెలక్షన్ కమిటీ సభ్యునిగా మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్ ఎంపికయ్యాడు. జీపీ గోవిందా నేతృత్వం వహించే 13 మంది కూడిన ఈ కమిటీలో సర్దార్ భాగం కానున్నాడు. ఇది తనకో నూతన సవాలులాంటిదని, ఇండియన్ హాకీకి వీలైనంతగా సేవలందించాలని భావించానని సర్దార్ తెలిపాడు. ఇన్నాళ్లుగా జట్టుకు ప్లేయర్‌గా సేవలందించానని, ఇప్పుడు పరోక్షంగా సాయపడే అవకాశం దక్కిందని చెప్పాడు.

పాండ్యా నాలుగు గోడల మధ్యే..!

ముంబై: సస్పెన్షన్‌కు గురైన హార్దిక్ పాండ్యా తీవ్రంగా కుంగిపోతున్నాడట. ఆస్ట్రేలియా నుంచి స్వదేశానికి చేరుకున్నాక అతడు నాలుగు గోడల మధ్యే గడుపుతున్నాడు. పాండ్యా ఇంటి నుంచి బయటకు రావడం లేదని, కనీసం ఫోన్‌లో కూడా ఎవరితో మాట్లడం లేదని అతని తండ్రి హిమాన్షు పాండ్యా తెలిపారు. సంకాంత్రి పండగను సెలెబ్రేట్ చేసుకునేందుకు కూడా తన కుమారుడు ఇష్టపడలేదని చెప్పారు. కాగా, పాండ్యా, లోకేశ్ రాహుల్ వివాదంలో బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రి విచారణ ప్రారంభించారు. ఈ ఇద్దరితో జోహ్రి టెలిఫోన్‌లో మాట్లాడారు. బోర్డు షోకాజ్ నోటీసుకు క్రికెటర్లు రాతపూర్వకంగా ఇచ్చిన వివరాలను జోహ్రి సరిపోల్చుకున్నారని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు.

కాన్‌స్టంటైన్ రాజీనామా

షార్జా: ఇండియా ఫుట్‌బాల్ టీమ్ చీఫ్ కోచ్ స్టీఫెన్ కాన్‌స్టంటైన్ రాజీనామా చేశాడు. ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో జట్టు నాకౌట్ చేరడంలో విఫలమైనందుకు నైతిక బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకున్నాడు. కోచ్‌గా గత నాలుగేళ్లలో తాను అనుకున్న దానికంటే ఎక్కువే చేశానని కాన్‌స్టంటైన్ సంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టును వీడడం బాధకరంగా ఉందని, ప్లేయర్లు, సహాయక సిబ్బంది తనకు చాలా బాగా సహకరించారన్నాడు. స్టీఫెన్ రాజీనామాను ఆమోదించినట్టు ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య తెలిపింది.

ఫేవరెట్ల జోరు



- మూడో రౌండ్‌కు నడాల్, ఫెడరర్
- కెర్బర్, క్విటోవా ముందంజ
- జొకోవిచ్, సెరెనా బోణీ



క్విటోవా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫేవరెట్ల హవా నడుస్తోంది. బిగ్ ఫోర్‌లో ఒకడైన ఆండీ ముర్రే తొలి రౌండ్‌లోనే వెనుదిరిగినా.. మిగతా ముగ్గురు జోరు చూపిస్తున్నారు. టాప్ సీడ్, వరల్డ్ నెంబర్ వన్ నొవాక్ జొకోవిచ్ వరుస సెట్లలో విజయంతో బోణీ కొట్టగా.. రెండో సీడ్ రఫేల్ నడాల్ అలవోకగా రెండో రౌండ్ దాటాడు. డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్ మాత్రం మూడో రౌండ్ చేరేందుకు కాస్త కష్టపడాల్సి వచ్చింది. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో స్విట్జర్లాండ్ గ్రేట్, మూడో సీడ్ రోజర్ 7-6 (7/5), 7-6 (7/3), 6-3తో బ్రిటన్ ప్లేయర్ డాన్ ఎవాన్స్‌పై కష్టపడి గెలిచి 20వ సారి మెగా టోర్నీలో మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. డెనిస్ ఇస్తొమిన్‌పై మొదటి రౌండ్‌లో అలవోకగా నెగ్గిన ఫెడెక్స్‌కు 189వ ర్యాంకర్ ఎవాన్స్ ఈ మ్యాచ్‌లో గట్టి పోటీ ఇచ్చాడు. రెండు గంటల 35 నిమిషాల పాటు సాగిన పోరులో 28 ఏళ్ల ఎవాన్స్ తొలి సెట్‌లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అద్భుతంగా ఆడాడు. టై బ్రేక్‌లో కూడా ఒక దశలో 5-3తో ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ, గొప్పగా పుంజుకున్న రోజర్ వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి సెట్ నెగ్గాడు. రెండో సెట్‌ను కూడా టై బ్రేక్‌లో గెలిచిన ఫెడెక్స్ మూడో సెట్‌లో మాత్రం విజృంభించాడు. మరో మ్యాచ్‌లో స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ 6-3, 6-2, 6-2తో మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)ను చిత్తుగా ఓడించాడు. అయితే, ఐదో సీడ్ కెవిన్ అండర్సన్‌కు రెండో రౌండ్‌లోనే చుక్కెదురైంది. అన్‌సీడెడ్ ఫ్రాన్సెస్ టియఫో (అమెరికా) 4-6, 6-4, 6-4, 7-5తో అండర్సన్‌కు షాకిచ్చాడు. ఆరోసీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా) 7-5, 6-7 (9/11), 6-4, 6-4తో మకెంజీ మెక్‌డొనాల్డ్ (అమెరికా)పై కష్టపడి గెలిచి మూడో రౌండ్ చేరాడు. ఇతర మ్యాచ్‌ల్లో 20వ సీడ్ గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 6-7 (5/7), 6-3, 7-5తో పాబ్లో క్యూవాస్ (ఉరుగ్వే)పై, 22వ సీడ్ బాటిస్ట అగట్ (స్పెయిన్) 6-3, 6-1, 3-6, 6-7 (6/8), 6-4తో జాన్ మిల్‌మన్ (ఆస్ట్రేలియా)పై గెలిచారు. గైల్ మోన్‌ఫిల్స్, ఫెర్నాండో వెర్డాస్కో, థామస్ బెర్డిచ్, ఆండ్రిస్ సెప్పి, ష్వర్ట్జ్‌మన్ కూడా రెండో రౌండ్‌లో నెగ్గి ముందుకెళ్లారు. ఇక, మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో టైటిల్ ఫేవరెట్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) 6-3, 6-2, 6-2తో మిచెల్ క్రూగర్ (అమెరికా)ను చిత్తుగా ఓడించాడు. డొమినిక్ థీమ్, రోనిచ్, స్టానిస్లాస్ వావ్రింకా, అలెగ్జాండర్ జ్వెరెవ్, కీ నిషికోరి కూడా బోణీ కొట్టారు.

వోజ్నియాకి x షరపోవా

రష్యా స్టార్ ప్లేయర్ మరియా షరపోవా వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అలవోక విజయం సాధించింది. ఆమెతో పాటు రెండో సీడ్ ఏంజెలిక్ కెర్బర్, మూడో సీడ్ కరోలిన్ వోజ్నియాకి, ఎనిమిదో సీడ్ పెట్రా క్విటోవా మూడో రౌండ్‌కు చేరుకున్నారు. 30వ సీడ్‌గా బరిలో నిలిచిన షరపోవా 6-2, 6-1తో రెబెకా పీటర్సన్ (స్వీడన్)ను చిత్తు చేసి.. మూడో రౌండ్‌లో కరోలిన్ వోజ్నియాకితో పోరుకు సిద్ధమైంది. మరో మ్యాచ్‌లో వోజ్నియాకి (డెన్మార్క్) 6-1, 6-3తో జొహానా లాసన్ (స్వీడెన్)పై ఘన విజయం సాధించింది. కెర్బర్ (జర్మనీ) 3-2, 6-3తో బ్రెజిల్ ప్లేయర్ బడాడ్ మరియాను ఓడించగా, పెట్రా క్విటోవా (చెక్) 6-1, 6-3తో ఇరినా బెగు (రొమేనియా)పై, స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా) 6-3, 6-1తో టిమెయా బబోస్ (హంగేరీ)పై గెలిచారు. కానీ, తొమ్మిదో సీడ్ నెథర్లాండ్ ప్లేయర్ కికి బర్టెన్స్ 6-3, 3-6, 3-6తో అనస్తేసియా పావ్లుచెంకోవా (రష్యా) చేతిలో పోరాడి ఓడిపోయింది. అంతకుముందు జరిగిన తొలి రౌండ్‌లో టాప్ సీడ్ సిమోనా హాలెప్ (రొమేనియా) 6-7 (2/7), 6-4, 6-2 కియా కనేపి (ఇస్టోనియా)పై మూడు సెట్ల పాటు పోరాడి గెలిచింది. 16వ సీడ్‌గా బరిలో నిలిచిన అమెరికా లెజెండ్ సెరెనా విలియమ్స్ 6-0, 6-2తో టజానా మరియా (జర్మనీ)ని చిత్తుగా ఓడించి బోణీ కొట్టింది. మాడిసన్ కీస్, ఒసాక, స్విటోలినా, ముగురుజా, వీనస్ విలియమ్స్ కూడా టోర్నీలో శుభారంభం చేశారు.

ఇండియా జోడీలకు నిరాశ

పురుషుల డబుల్స్‌లో ఇండియా మూడు జంటలూ మొదటి రౌండ్‌లోనే ఓడిపోయి తీవ్రంగా నిరాశ పరిచాయి. స్వదేశంలో టాటా ఓపెన్ నెగ్గి జోరు మీదున్న 15వ సీడ్ ఇండియన్ జోడీ రోహన్ బోపన్న-దివిజ్ శరణ్ 1-6, 6-4, 5-7తో పాబ్లో కరెనొ బస్టా-గిలెర్మొ లోపెజ్ (స్పెయిన్) జంట చేతిలో ఓడిపోయింది. మరో మ్యాచ్‌లో వెటరన్ ప్లేయర్ లియాండర్ పేస్ తన పార్ట్‌నర్ మిగ్వేల్ రెయెస్ వారెలా (మెక్సికో) 5-7, 6-7తో ఆస్టిన్ క్రజిసెచ్ (అమెరికా)-అర్టెమ్ సిటాక్ (న్యూజిలాండ్) ద్వయం చేతిలో పరాజయం పాలయ్యాడు. జీవన్ నెడుంజెళియన్-నికోలస్ మోన్రొ (అమెరికా) 6-4, 6-7 (8/10), 5-7తో కెవిన్ క్రావీట్జ్-నికోలా మెక్టిచ్ చేతిలో ఓడి నిష్క్రమించింది.



రామచిలుకకు చైనా మాంజా ఉరి

పక్షులకు పతంగి దారాలు, చైనా మాంజాలు ఎలా ఉరిపోస్తున్నాయో చెప్పేందుకు నిదర్శనమీ చిత్రం. గుజరాత్‌లో రెండు రోజుల క్రితం జరిగిన కైట్ ఫెస్టివల్‌లో కూర్చున్న కొమ్మ మీదే ఈ రామచిలుక మెడకు చైనా మాంజా ఉరి బిగించింది. ఊపిరాడకుండా ఉక్కిరిబిక్కిరి చేసి గొంతు కోసేసింది. ఆ ఫొటోను ప్రముఖులు, నెటిజన్లు ట్విట్టర్‌లో పోస్టు చేస్తూ చైనా మాంజాను నిషేధించాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. సిగ్గుతో మనం ఉరిపోసుకోవాల్సిన అవసరం ఉందంటూ మండిపడుతున్నారు.

ఆనందానికి 17 భావాలు

చాలా చాలా ఆనందంగా ఉందా..? అయి తే, ఆ ఆనందాన్ని ఎన్ని రకాలుగా వ్యక్తపరచగలరు? దాదాపు 17 రకాలుగా ఆనందాన్ని వ్యక్తపరచొచ్చని అమెరికా ఒహాయో స్టేట్ యూనివర్సిటీ సైంటిస్టులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 16,384 ఎక్స్‌ప్రెషన్స్‌లో మనం పలుకుతున్న భావాలు కేవలం 35. ఉదాహరణకు చిరాకును కేవలం ఒకే ఒక్క ఎక్స్‌ప్రెషన్‌లో చూపించగలమట. చిన్న సంతోషం నుంచి ఆపుకోలేనంత ఆనందం వరకు దాదాపు



17 రకాల భావాలను మన మొహం పలికించగలుగుతుందట. భయాన్ని మూడు రకాలుగా, ఆశ్చర్యాన్ని నాలుగు పద్ధతుల్లో, కోపం, బాధను ఐదు చొప్పున ఎక్స్‌ప్రెషన్స్‌లో చూపిస్తామట. ప్రపంచ వ్యాప్తంగా 31 దేశాలకు చెందిన 72 లక్షల మంది మొహాలను కంప్యూటర్ ఆల్గారిథం ద్వారా పరీక్షించి 16,384 భావాలను మనిషి వ్యక్తీకరించగలడని సైంటిస్టులు తేల్చారు. 821 ఇంగ్లిష్ పదాల ఆధారంగా ఆ ఎమోషన్స్‌ను ఎలా పలుకుతారో గుర్తించారు. ప్రొఫెషనల్ అనువాదకులతో ఇంగ్లిష్ పదాలను వివిధ భాషల్లోకి తర్జుమా చేసి మరీ ఈ ప్రయోగం చేశారు.

జాబిలిపై పత్తి మొలక

చీకటి చంద్రుడిపై తెల్ల బంగారం పంట

భూమి నుంచి మనకు కనిపించని చంద్రుని అవతలి వైపు విజయవంతంగా దిగిన చైనా ల్యూనార్ రోవర్ చాంగీ 4 మరో ఘనత కూడా తన ఖాతాలో వేసుకుంది. చంద్రునిపై పత్తి విత్తనం నాటి మొలకెత్తించి భళా అనిపించుకుంది. ఇందుకు సంబంధించి ఓ ఫొటోను చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (సీఎన్ఎస్ఏ) విడుదల చేసింది. చైనా వర్సిటీ చాంగ్‌కింగ్ తన వెబ్‌సైట్ వెయ్‌బోలో ఆ ఫొటోను పోస్ట్ చేసి 'చంద్రునిపైన శూన్యం, ఉష్ణోగ్రతల్లో భారీ తేడాలు, ఎక్కువ రేడియేషన్, కఠినమైన పరిస్థితులు.. అయినా మనుషులు అక్కడ తొలిసారి మొక్కను మొలకెత్తించారు' అని పేర్కొంది. ప్రయోగంలో భాగంగా చంద్రునిపైకి పత్తి విత్తనాలతో పాటు నూనె గింజలు, ఆలూ, అరబిడోప్సిస్ విత్తనాలు, ఈస్ట్, ఫ్రూట్ ఫ్లైస్‌ల గుడ్లను రోవర్ తీసుకెళ్లింది. చాంగీ 4 ల్యాండర్‌పై 0.8 లీటర్ల టిన్‌లో సైంటిస్టులు వీటిని భద్రపరిచారు. మరో 100 రోజుల్లో ఇతర రకాల విత్తనాలూ మొలకెత్తిస్తామని వారు చెబుతున్నారు. ఈ 'ల్యూనార్ మినీ బయోస్పియర్' చైనా స్పేస్ బయోస్పియర్ ప్రయోగాల్లో ఓ భాగం. ఇది విజయవంతమైతే 2036 నాటికి అక్కడో బేస్ ఏర్పాటు చేసి మనుషుల్ని పంపాలని చైనా భావిస్తోంది.

ప్రత్యేక వాతావరణంలో


చాంగీ 4 ల్యాండర్‌పై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాతావరణంలో పత్తి విత్తనాలు పెంచారు. మొబైల్ రోవర్‌పై కాదు. చంద్రునిపై ఉన్న ఉష్ణోగ్రతల ప్రభావం ఇందులో ఉండదు. ప్రయోగం కోసం 6.6 లీటర్ల టిన్‌ను ప్రత్యేక అల్యూమినియంతో రూపొందించారు. ఇందులో విత్తనాలతో పాటు నీళ్లు, పోషకాలు, గాలి, చిన్న కెమెరా, డేటా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ ఉంది. 28 యూనివర్సిటీలకు చెందిన రీసెర్చర్లు ఈ ప్రయోగంలో పాలు పంచుకున్నారు. సౌత్‌వెస్ట్ చైనాలోని చాంగ్‌కింగ్ వర్సిటీ నాయకత్వం వహిస్తోంది. చంద్రుని వాతావరణం విషయానికొస్తే అక్కడసలు వాతావరణమే ఉండదు. కాబట్టి అతినీల లోహిత కిరణాలు ఉపరితలాన్ని చేరుతాయి. ఉష్ణోగ్రతల్లో భారీ తేడా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 127 డిగ్రీల వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు -173 డిగ్రీల వరకు ఉంటాయి.

అందుకే ఫ్రూట్ ఫ్లైస్‌తో..

విభిన్న పర్యావరణ పరిస్థితులకు జంతువులు ఎలా స్పందిస్తాయో తెలుసుకోడానికి ఫ్రూట్ ఫ్లైస్ (డ్రోసోఫిలా)ను సైంటిస్టులు ఎక్కువగా వాడుతుంటారు. వాటి సంతానోత్పత్తి సమయమూ చాలా తక్కువ కాబట్టి వివిధ తరాల జన్యువుల్లో తేడాలూ దీని వల్ల తెలుస్తాయని వాటిని పరిశోధనకు వినియోగిస్తుంటారు. ఆవాల కుటుంబానికి చెందిన అరబిడోప్సిస్‌ను కూడా ఫ్రూట్ ఫ్లైస్‌లా రకరకాల వాతావరణాల ప్రభావం తెలుసుకోడానికి వాడుతుంటారు.

చాంగీ 4కు ఖర్చు తక్కువే

చంద్రునిపై విత్తనం మొలకెత్తడం సైన్స్ చరిత్రలో అద్భుతమని సైంటిస్టులు అంటున్నారు. అంతరిక్షంలో మొక్కలు పెరిగితే మార్స్ సహా సుదూర ప్రయాణాలు చేసేందుకు ఎంతో ఉపయోగమంటున్నారు. ఇంతకుముందు ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లో ఆస్ట్రోనాట్స్ మొక్కలు పెంచారు. చైనాకు చెందిన టియాంగాంగ్ 2 స్పేస్ ల్యాబ్‌లోనూ రైస్, అరబిడోప్సిస్‌ను పెంచారు. కాగా, ప్రస్తుత చాంగీ 4 మిషన్‌కు ఒక కిలోమీటర్ అండర్‌గ్రౌండ్ రైల్వే నిర్మించేందుకు అయ్యేంత ఖర్చయిందని చైనా పేర్కొంది.



- ఫొటో పంపిన చాంగీ 4 రోవర్
- ప్రత్యేక వాతావరణంలో పెంపకం
- త్వరలో ఆలూ, నూనె గింజలతోనూ ప్రయోగం
- 2036 నాటికి ఇల్లూ కట్టేస్తామన్న డ్రాగన్ కంట్రీ



మూన్‌పై ఇంటికీ స్కెచ్

చంద్రునిపై ఓ ఇంటినీ నిర్మించాలని చైనా భావిస్తోంది. 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో దాన్ని నిర్మించాలనుకుంటోంది. ఈ విషయమై చైనా, రష్యా, యూరోపియన్ యూనియన్ చర్చలు జరుపుతున్నాయి. మరో 3 చాంగీ మిషన్లతో అక్కడి ఉపరితలాన్ని క్షుణ్నంగా పరిశీలిస్తామని, అక్కడ ఇల్లు నిర్మించే అవకాశాన్ని చూస్తామని చైనా వెల్లడించింది. చాంగీ 5తో మళ్లీ చంద్రునిపై అడుగుపెడతామని, అక్కడి నుంచి శాంపిల్స్ తీసుకొస్తామని చెప్పింది. తర్వాత చాంగీ 6తో చంద్రుని దక్షిణ ధ్రువంపై పరిశోధనలు చేస్తామంది. చాంగీ 7తో చంద్రుని ఉపరితలాన్ని, నిర్మాణాన్ని, స్పేస్ ఎన్విరాన్‌మెంట్‌ను పరిశీలిస్తామని పేర్కొంది. చాంగీ 8తో టెక్నికల్ సర్వేస్ అనాలసిస్ చేసి, బిల్డింగ్ నిర్మాణానికి గ్రౌండ్ వర్క్ చేస్తామని వివరించింది.

విండోస్ 7 సేఫ్ కాదు

సెక్యూరిటీ అప్‌డేట్లను ఆపేయబోతున్న మైక్రోసాఫ్ట్.. ఏడాది టైం

కంప్యూటర్ ఉందా? అందులో ఆపరేటింగ్ సిస్టం (ఓఎస్) విండోస్ 7 వాడుతున్నారా? అయితే, మార్చుకోవడం మంచిది. అప్‌గ్రేడ్ చేసుకుంటే చాలా మేలు. ఎందుకంటే 2015లోనే విండోస్ 7కు గుడ్‌బై చెప్పిన మైక్రోసాఫ్ట్.. వచ్చే ఏడాది జనవరి నాటికి విండోస్ 7తో పూర్తిగా బంధం తెంచుకోబోతోందట. ఇంట్లో కంప్యూటర్ వాడేటోళ్లకు ఎలాంటి సెక్యూరిటీ అప్‌డేట్లను ఇవ్వబోదట. అదే వ్యాపారం చేసుకునేటోళ్లకైతే సెక్యూరిటీ అప్‌డేట్లు కావాలంటే భారీగా మూల్యం చెల్లించుకోవాల్సిందేనట. కాబట్టి.. ఇంటి కంప్యూటర్లకు వైరస్‌ల బెడద పొంచి ఉంటుందని చెబుతున్నారు. హ్యాకర్లు తెగబడిపోయే ముప్పు ఉంటుందని హెచ్చరిస్తున్నారు. నెట్ అప్లికేషన్స్ అనే అనలిటిక్స్ సంస్థ ప్రకారం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా 42.8% కంప్యూటర్లలో వాడుతున్న ఓఎస్ విండోస్ 7. విండోస్ 10 సాఫ్ట్‌వేర్‌ను 45.5% కంప్యూటర్లలో ఇన్‌స్టాల్ చేసుకున్నారు. ఏడాదిలోపు విండోస్ 7 నుంచి విండోస్ 10కు అప్‌డేట్ అయితే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే కనీసం కస్టమర్ సపోర్ట్ కూడా ఇవ్వబోమని సంస్థ తేల్చి చెబుతోంది. 2014లో విండోస్ 10ను ప్రవేశపెట్టినప్పుడు.. ఫ్రీగా అప్‌డేట్ అయ్యే చాన్సిచ్చింది మైక్రోసాఫ్ట్. అప్పుడు వద్దనుకున్నోళ్లు ఇప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాలంటే సుమారు రూ.9 వేలు (130 డాలర్లు) పెట్టాల్సిందే. అంటే అప్పుడు ఫ్రీగా సాఫ్ట్‌వేర్‌ను ఇచ్చిన మైక్రోసాఫ్ట్ సంస్థ.. ఇప్పుడు పైసలకు దానిని అమ్ముతోందన్నమాట.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.